శ్రీమద్వరదరాజకృత

లఘుసిద్ధాన్త కౌముదీ

(సంజ్ఞా, సన్ధి, కృత్ప్రకరణములు)

తెలుగు వివరణము

శ్రీ హరి, ఎం. ఏ.
ఉపన్యాసకుడు,
ఆంధ్ర సారస్వత పరిషత్-
ప్రాచ్యకళాశాల,
హైదరాబాదు.

నవంబరు 1970

ప్రతులకు :—
ఆంధ్రసారస్వతపరిషత్తు,
బొగ్గులకుంట,
హైదరాబాదు.

ఆర్. శ్రీహరి,
ఎల్.సి.హెచ్_390,
సైదాబాదుకాలనీ, హైదరాబాదు - 36.

(ప్రథమ భాగము)

వెల : 3-00

Dr. D. Venkatavadhani, M.A; Ph.D.,
Professor and Head of the Department of Telugu, Osmania University.

సంస్కృతమున వ్యాకరణ శాస్త్ర గ్రంథములు వానిపై వ్రాయఁబడిన భాష్య వివరణవ్యాఖ్యాన గ్రంథములు, అసంఖ్యాకములుగా నున్నవి. వానిలో మొదటిది. ఐంద్రవ్యాకరణమని చెప్పుదురు. ఇంద్రుఁడు వాయుదేవుని తోడ్పాటుతోఁ బదములకుఁ బ్రకృతి ప్రత్యయ విభాగము కావించి రచించిన ప్రథమ వ్యాకరణమిది. 'అథ వర్ణ సమూహః' అనునది యిందలి మొదటి సూత్రమఁట ! ఈ వ్యాకరణ మిప్పుడు లభించుట లేదు. తరువాత నింద్ర శిష్యుఁడైన భరద్వాజుఁడు, భాగురి, వ్యాడి, కాశకృత్స్నుఁడు, శాకల్యుఁడు, శాకటాయనుఁడు, స్ఫోటాయనుఁడు, ఆపిశలి, గార్గ్యుఁడు, గాలవుఁడు మున్నగువారు వ్యాకరణ గ్రంథములు రచించినట్లు తెలియుచున్నది. పాణిని అష్టాధ్యాయి రచించుటకుఁ బూర్వము ఆపిశలి కాశకృత్స్నుల వ్యాకరణములు పఠన పాఠనములందుండెనని తెలియుచున్నది. కాశకృత్స్న వ్యాకరణము కాతంత్రమునకును, ఆపిశలి వ్యాకరణ మష్టాధ్యాయికిని మూలములై యుండునని పండితుల అభిప్రాయము.

ఇంతవఱకు లభించుచున్న సంస్కృత వ్యాకరణ గ్రంథములలో సమగ్రమైనది పాణిని అష్టాధ్యాయియే. వైదిక లౌకిక భాషల కను శాసనముగా నెనిమిద ధ్యాయములు రచింపఁబడుటచే దీని కాపేరు కలిగినది. ఇందు మొత్తము 3990 సూత్రములున్నవి. పాణిని క్రీ.పూ. 5,6 శతాబ్దములలో నివసించెనని చెప్పుదురు. అష్టాధ్యాయిని స్థూలముగాఁ బరిశీలించినచో నందు విశిష్టమైన ఒక విషయవిభాగము లేనట్లు కన్పించును. కాని పాణిని యల్పాక్షర పరిమితములైన సూత్రములలో మహత్తరములైన విషయములను జెప్పఁగలిగెను. అతఁడు ప్రత్యాహార విధానము

వచనము. ఇత్సంజ్ఞావచనము. పూర్వోత్తరసూత్రానువర్తనమువచనము. టి.ఘు ముఞ్నగు వేకాక్షర సంజ్ఞల వచనము. లఘ్వాదికాల సంజ్ఞల వచనము శాస్త్రమునకు సౌలభ్యము నాపాదింప యత్నించెను. ఈ లాఘవ దీక్షయనే శాస్త్రమును గహన మొనరించినదని చెప్పువారును గలరు. పాణిని అష్టాధ్యాయికనుబంధముగా లింగానుశాసనమును, గణధాతు పాఠములను, శిక్షను రచించి శిష్యులకు బోధించి యుండెను. ఇట్లు బోధించు సందర్భమున లఘు బృహత్పాఠ భేదము ఏర్పడెననియు నందు భట్టోజీ లఘు పాఠమును, కాశికాకారులు బృహత్పాఠమును గ్రహించెననియు చెప్పుదురు.

సంగ్రహ కథనహేతువున అష్టాధ్యాయిలో నెచట నెచటఁగలిగిన లోపములను బూరించుటకై కాత్యాయన భరద్వాజ సునాగ వాడవాదులు వార్తికములు రచించిరి. వీరిలో వరరుచి నామాంతరము గల కాత్యాయనుఁడు ప్రధానుఁడు. అష్టాధ్యాయి యందలి దోషములను సవరించియు ననావశ్యకములను బరిహరించియు నావశ్యకములను ప్రవేశపెట్టియు నితఁడు రచించిన వార్తికములు మూల సూత్రములవలెనే పరమ ప్రామాణికములైనవి. తరువాత పతంజలి మహర్షి అష్టాధ్యాయిపై సంస్కృత వ్యాకరణమునఁదుది వాక్యమని చెప్పఁదగిన మహా భాష్యమును నిర్మించెను. అతఁడు సూత్రవార్తికములకు లొంగని కొన్ని ప్రయోగములను సాధించుటకై ఇష్టులను ఏర్పఱచెను. అతని రచన యలఁతి యలఁతి పదములతోఁగూడి విస్పష్టమై ప్రామాణికమై అద్వితీయమను ప్రశంసకుఁబాత్రమైనది.

అష్టాధ్యాయి యందలి సూత్రములను వివరించుటకై పలువురు వృత్తులు రచించిరి. వానిలో వామన జయాదిత్యులు కాశిని రచించిన కాశికా వృత్తి ప్రసిద్ధమైనది. క్రీ. శ. 15 వ శతాబ్దిలో భట్టోజీ రచించిన శబ్దకౌస్తుభమను వృత్తి మిక్కిలి ప్రామాణికమైనది. అష్టాధ్యాయిపై

వలెనే మహాభాష్యముపైఁగూడఁ బెక్కు వివరణములు రచితములైనవి. వానిలో భర్తృహరి మహాభాష్య టీకయు, కైయటుని మహాభాష్య ప్రదీపమును గణనీయము లైనవి. ఈ ప్రదీపముపై వెలసిన వ్యాఖ్యలు కూడ అనేకములున్నవి.

క్రీ. శ. 11 వ శతాబ్దినుండియు అష్టాధ్యాయి సౌలభ్యమునకై సూత్రములను ప్రకరణ విభజనతోఁగూర్చుటకై ప్రయత్నములు జరిగెను. వీనిలో రూపావతారము, రూపమాల, ప్రక్రియాకౌముది ప్రసిద్ధములైనవి. శేష రామచంద్రుని ప్రక్రియా కౌముది విశేష ప్రచార మందినది. దానిపై వ్యాఖ్యలు కూడ వెలసిల్లినవి. భట్టోజీ దీక్షితుడు సిద్ధాంత కౌముది రచించిన పిమ్మట ఇతర ప్రక్రియా గ్రంథములకుఁ బ్రచారము తగ్గిపోయెను. భట్టోజీ తన సిద్ధాంత కౌముదిపై ప్రౌఢమనోరమ యను వ్యాఖ్య కూడ రచించెను. మహా ప్రతిభాశాలియు వైయ్యాకరణ మతస్థాపనాచార్యుఁడని ప్రసిద్ధి కెక్కిన వాఁడును అయిన నాగేశ భట్టు రచించినలఘు, బృహచ్ఛబ్దేందుశేఖరములు కౌముది ప్రచారప్రకాశములకు మఱింత వన్నె కలిగించెను.

భట్టోజీ దీక్షితుని శిష్యుఁడైన వరదరాజు సిద్ధాంతకౌముదిని సంక్షేపించు నుద్దేశముతో మధ్య, లఘు సిద్ధాంత కౌముదులను వెలయించెను. అతఁడు సారసిద్ధాంతకౌముది అను పేర మఱొక గ్రంథమును గూడ రచించెనఁట. కాని అది యంతగాఁ బ్రచారము పొంది యుండలేదు. అష్టాధ్యాయినికాని, సిద్ధాంత కౌముదినిగాని సమగ్రముగా నధ్యయనము చేయుటకు, దగిన కాలమును సామర్థ్యమును లేని వారు లఘుసిద్ధాంత కౌముదిని పఠించి తృప్తి నొందుదురు.

ఉస్మానియా విశ్వ విద్యాలయమున తెలుఁగున డిప్. ఓ. యల్. బి.ఓ.యల్. యమ్. ఓ.యల్. పరీక్ష లేర్పాటైన పిమ్మట తెలుఁగు పండి

తులకు సంస్కృత వ్యాకరణ పరిజ్ఞానము కూడ నావశ్యకమను నుద్దేశముతో వారు పట్టము పుచ్చుకొను నప్పటికి లఘుసిద్ధాంత కౌముదియైనఁ జదివి యుండుట యవశ్యకర్తవ్య మని తలంచి దానిని బాధ్యముగా నిర్ణయించి యుంటిమి. సంస్కృతమున నంతగాఁ బాండిత్యము లేనివారు లఘుసిద్ధాంత కౌముదిని జదివి అందలి సూత్రములను, అను వృత్తులను అర్థము చేసి కొనుట కష్ట తరమగుట సహజమే. దానికి తెలుఁగు వ్యాఖ్యాన మున్నచో వారు దానిని గ్రహించుట సులభమగును. వావిళ్ళవారు లఘు సిద్ధాంత కౌముదిని తెలుఁగువ్యాఖ్యానముతో నొకప్పుడు ప్రచురించి యుండిరి. కాని యా ప్రతు లిప్పుడు లభ్యములగుట లేదు. అందుచే వ్యాకరణ మైచ్ఛిక విషయముగా బి. ఓ. యల్. పట్టము పుచ్చుకొని తరువాత ఎం. ఏ. పరీక్ష యందు గూడ ప్రథమశ్రేణిలో గృతార్థులైనవారును, ప్రతిభావినయ సంపన్నులును, బోధనానుభవముకలవారును నైన శ్రీ శ్రీహరి గారు సర్వసుబోధమును, ఆవశ్యక వివరణ సహితమును నైన యీ గ్రంథమును రచించి విద్యార్థులకు మహోపకారము గావించి యున్నారు. ఇందు సంజ్ఞా, సంధి, కృత్ప్రకరణములు మాత్ర మున్నవి. వారితర ప్రకరణములను గూడ నచిర కాలమునఁ బూర్తి చేసి ఆంధ్ర విద్యార్థులకు లఘుసిద్ధాంత కౌముదీ పఠన భీతిని దొలఁగింతురని కోరుచున్నాను.

హైదరాబాదు
31-11-1970

దివాకర్ల వేంకటావధాని

K. LAKSHMANA SASTRY,
Dy. Director of Public Instruction.
Government of Andhra Pradesh.

నేను చిరంజీవి శ్రీహరి వ్రాసిన "లఘుసిద్ధాంత కౌముది" యాంధ్రానువాదమునామూలాగ్రముగఁ బరిశీలించినాను. శ్రీహరి సంజ్ఞా, సంధి, కృత్ప్రకరణములను మాత్రమే తెనిఁగించినాఁడు. ఈ విధముగనే యితరప్రకరణములను గూడ నితఁడే తెనిఁగించినచో బాగుండునని నా యభిప్రాయము.

ఇతఁడు, ఇందు సూత్రములవివరణమును బదచ్ఛేదాదులతోఁబాటు చేసి, వృత్తివివరణమును గూడ సులభశైలిలోఁదెలుఁగులో వ్రాసెను. వివరణము సుస్పష్టముగాను, పాణినీయ వ్యాకరణశాస్త్రము ప్రారంభములోఁజదువు తెలుఁగు విద్యార్థులకు సుగమముగాను శ్రీహరి రచియించెను. ఈ గ్రంథమునందలి విశేషమేమనగా, నుదాహరణములకుఁ దెలుఁగులో నర్థములను గూడ నీ గ్రంథకర్త వ్రాసినాడు. ఈ విశిష్టత యితరగ్రంథములందుఁ గానరాదు. ఇట్టి సమగ్రవివరణము తెలుఁగునందు లలితమైన శైలిలోలేని లోపము నీ గ్రంథకర్త పూరించుటచేత సంస్కృతవ్యాకరణము నభ్యసించు విద్యార్థిలోకమునకెల్ల నితఁడు మహోపకారము చేసినాఁడని నేను భావించుచున్నాను.

వ్యాకరణము, అందులోను పాణినీయము నభ్యసించుట కష్టతరము. ఇందలి పారిభాషికపదములు, సాంకేతికవిషయములు కొన్నిచోట్ల అతి దుర్గమములుగా నుండి సంస్కృతవ్యాకరణ ప్రవేశములేని వారికి నగమ్యములుగా నుండును. ఈ గ్రంథ మట్టివారికి విశేషోపకారకము కాగలదు. ఈ యాంధ్రానువాదము విశ్వవిద్యాలయాధికారులు, ప్రభుత్వము వారు గుర్తించి యాదరించఁదగినది.

నేనీ గ్రంథకర్తను హృదయపూర్వకముగా ఆశీర్వదించుచు నభినందించుచున్నాను.

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ఓం

నమో మునిత్రయాయ.

లఘుసిద్ధాన్తకౌముదీ



శ్లో॥ యేనాక్షరసమామ్నాయమధిగమ్య మహేశ్వరాత్.
కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినయే నమః.
యేన ధౌతా గిరః పుంసాం విమలైశ్శబ్దవారిభిః.
తమశ్చాజ్ఞానజం భిన్నం తస్మై పాణినయే నమః.
వాక్యకారం వరరుచిం భాష్యకారం పతఞ్జలిమ్.
పాణినిం సూత్రకారఞ్చ ప్రణతోఽస్మి మునిత్రయమ్.



ఓన్నమః పాణిని కాత్యాయన పతఞ్జలిభ్యశ్శబ్ద
విద్యాసమ్ప్రదాయప్రవర్తకేభ్యో మునిభ్యో
మహద్భ్యో గురుభ్యః.



నత్వా సరస్వతీం దేవీం శుద్ధాం గుణ్యాం కరోమ్యహమ్.
పాణినీయప్రవేశాయ లఘుసిద్ధాన్తకౌముదీమ్.

శ్రీః

అథ సంజ్ఞాప్రకరణమ్

అ ఇ ఉ ణ్ ౧। ఋ ఌ క్ ౨। ఏ ఓ ఙ్ ౩। ఐ ఔ చ్ ౪। హ య వ ర ట్ ౫। ల ణ్ ౬। ఞ మ ఙ ణ న మ్ ౭। ఝ భ ఞ్ ౮। ఘ ఢ ధ ష్ ౯। జ బ గ డ ద శ్ ౧౦। ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్ ౧౧। క ప య్ ౧౨। శ ష స ర్ ౧౩। హ ల్ ౧౪।

వృత్తి :— ఇతి మాహేశ్వరాణి సూత్రాణి అణాదిసంజ్ఞార్థాని ।

ఈ మాహేశ్వర సూత్రములు అణ్ మొదలగు సంజ్ఞలు సిద్ధించుటయే ప్రయోజనముగ కలవి.

వివరణము :— 'అ ఇ ఉణ్' మొదలుకొని 'హల్' వరకు చెప్పబడిన పై పదునాలుగు సూత్రములను మాహేశ్వర సూత్రములని యందురు. మాహేశ్వర సూత్రములనగా మహేశ్వరుని నుండి వచ్చిన లేక పొందబడిన సూత్రములని తాత్పర్యము (మహేశ్వరాత్ ఆగతాని, అధిగతాని వా మాహేశ్వరాణి అని వ్యుత్పత్తి) పాణిని శిష్యప్రణీతమగు శిక్షయందు

'యేనాక్షరసమామ్నాయమధిగమ్య మహేశ్వరాత్ ।
కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినయే నమః ॥

(మహేశ్వరుని నుండి అక్షర సమామ్నాయమును పొంది సమస్త వ్యాకరణమును చెప్పిన పాణినికి నా నమస్కారము) అని చెప్పబడుటచే పై 'అ ఇ ఉ ణ్' మొదలగు పదునాలుగు సూత్రములను పాణినిమహర్షి మహేశ్వరుని నుండి పొందెనని తెలియుచున్నది.

మఱియు నందికేశ్వరుని కాశిక యందీ క్రింది శ్లోకము కన్పట్టు చున్నది.

నృత్తావసానే నటరాజ రాజః
ననాద ఢక్కాం నవపంచవారమ్ ।
ఉద్ధర్తుకామః సనకాదిసిద్ధాన్
ఏతద్విమర్శే శివసూత్రజాలమ్ ॥

"పరమేశ్వరుడు నృత్తావసాన సమయమున సనకాది సిద్ధుల నుద్ధరింపఁజేయుటకు పదునాలుగు పర్యాయములు ఢమరుకమును శబ్దింప జేసెను. ఆ ఢమరుకమునుండి వచ్చిన యీ వర్ణసముదాయమును శివ సూత్రములని తలంచెదను" అని యీ శ్లోకము తాత్పర్యము. కనుక మహేశ్వరునినుండి ప్రాప్తములగుటచేతనే వీనిని మాహేశ్వరసూత్రము లని వ్యవహరించుచున్నాము.

ఈ పదునాలుగు సూత్రములను మహేశ్వర ప్రాప్తములే కాని మహేశ్వరప్రోక్తములు కావని గ్రహింపవలెను. పరమేశ్వరుడు వీనిని స్వయముగ చెప్పలేదు కదా।

ఈ సూత్రములకు అచ్, అక్, అష్ మున్నగుసంజ్ఞలు సిద్ధించు టయే ప్రయోజనము పై సూత్రములవలన నీ సంజ్ఞలు సిద్ధించు విధానము రాబోవు "ఆదిరన్త్యేన సహేతా" అను సూత్రవివరణమున తెలుపబడును.

హలన్త్యమ్ ఇతః

ఈ సూత్రముల చివరివర్ణములు ఇత్తులు.

వివ :- ఈ పదునాలుగు మాహేశ్వరసూత్రములలో ప్రతిసూత్రము చివర నున్న వర్ణములను ఇత్తులని యందురు. 'ఇత్' అనునదొక వ్యాకరణసంజ్ఞ. అ ఇ ఉణ్ సూత్రములోని చివరి ణ్, ఋ౯క్ సూత్రములోని చివరి 'క్' ఇట్లే తక్కిన సూత్రముల చివరనున్న వర్ణములన్నియు ఇత్సంజ్ఞకములగును.

హకారాదిషు అకార ఉచ్చారణార్థః

హకారము మున్నగు వానియందున్న అకారము ఉచ్చారణార్థము. హయవరట్ అను సూత్రము మొదలుకొని హల్ అనుసూత్రము వఱకు గల పదిసూత్రములలో చెప్పబడిన వర్ణములన్నియు హల్లులే. కాని యవి కేవలము హల్మాత్రములుగ (హ్, య్, వ్, ర్ ఇత్యాదిగా) కాక అకార యుక్తములుగ (హ, య, వ, ర ఇత్యాదిగా) చెప్పబడినవి. ఐనచో హకారాదుల నుచ్చరించినపుడు వానిలో నున్న అకారమును కూడ గ్రహింపవలసివచ్చును. కనుక నీ హయవర ఇత్యాది హల్లులపైనున్న అవర్ణము ఉచ్చారణ సౌకర్యముకొఱకని గ్రహింపవలెను. అకారమును చేర్చక హ్, య్, వ్, ర్ అని యుచ్చరించుట కష్టముకదా? కనుక హ య వ ర ట్ మున్నగు పది సూత్రములలోని హకారాదులను గ్రహించినపుడు వానిపై అకారమును గ్రహింపక హల్మాత్రమునే గ్రహింపవలెను. వానికి అకారమును చేర్చుటఉచ్చారణ సౌలభ్యము కొఱ కని భావము.

లణ్మధ్యేత్విత్సంజ్ఞకః

'లణ్' అను సూత్రము మధ్యముననున్న అకారము మాత్ర మిత్సంజ్ఞకమగును.

హకారాదులపై నున్న అకారము ఉచ్చారణసౌలభ్యము కొఱకని పైన తెలుపబడినది కనుక 'లణ్' అను సూత్రమున లకారముమీద అకారముకూడ ఉచ్చారణ సౌకర్యము కొఱకుమాత్రమేయని చెప్పవలసి వచ్చును కాని లణ్ సూత్రములో లకారముమీద అకారము ఉచ్చారణార్థమే కాక దానికి ఇత్సంజ్ఞయు కలదు. కనుకనే 'ర' అను [1]ప్రత్యా

1. ప్రత్యాహారమననేమో తరువాతి 'ఆదిరన్త్యేన సహేతా' అను సూత్రమున వివరముగ తెలుపబడును.

హారము సిద్ధించును. ఎట్లన హయవరట్ సూత్రమునందున్న రేఫమునకు (ర్ అనుదానికి) లణ్ సూత్రములోని లకారముమీది ఇత్సంజ్ఞకమగు అకారముతో కూడి చెప్పబడు ఆదిరన్త్యేన సహేతా అను సూత్రముచే ప్రత్యాహారము చేసినచో 'ర' (ర్ — అ) అను సంజ్ఞ సిద్ధించును. కనుక ర అను సంజ్ఞచే రేఫముతోబాటు లకారముకూడ గ్రహింపబడును.

సూ :— హలన్త్యమ్ ౧-౩-౩

పదవిభాగము :— హల్, అన్త్యమ్.

వృత్తి :— ఉపదేశే అన్త్యం హల్ ఇత్ స్యాత్. ఉపదేశ ఆద్యోచ్చారణమ్.
ఉపదేశమున చివరిహల్లు ఇత్సంజ్ఞకమగును. ఉపదేశమనగా ఆద్యోచ్చారణము.

వివ :— [1]ధాతువులు, సూత్రములు, గణములు, ఉణాదులు, లింగానుశాసనము, ఆగమములు, ప్రత్యయములు, ఆదేశములు అను వీని ఉపదేశములందురు. వ్యాకరణాచార్యులగు పాణిని మొదట వీనిని చెప్పుటచే ఇవి ఆద్యోచ్చారణములు. కనుకనే ఉపదేశములు. వీని చివరనున్న హల్లు ఇత్సంజ్ఞకమగునని సూత్రార్థము.

ధాతువు :— డుకృఞ్ (కరణే) అను ధాతువు ఉపదేశము. కనుక కృఞ్ ధాతువు చివరనున్న హల్లు (ఞ్ అనునది) ఇత్సంజ్ఞకమగును. ఇట్లే ఇతరధాతువుల చివరి హల్లులును ఇత్తులగును.

సూత్రము :— 'అఇఉణ్' అను సూత్రము ఉపదేశము కనుక ఆ సూత్రము చివరనున్న హల్లు (ణ్ అనునది) ఇత్సంజ్ఞకమగును. ఇట్లే ఋలృక్ మున్నగు సూత్రములందును చివరి హల్లులు ఇత్తులగును.

---

1. ధాతు, సూత్ర, గణో, ణాది వాక్య, లింగానుశాసనమ్।
ఆగమ, ప్రత్యయాదేశాః ఉపదేశాః ప్రకీర్తితాః॥

ఆగమము :- టిత్. కిత్. మిత్తులు ఆగమములు కలిగించునవి దాని చివరనున్న 'క్' అను హల్లు ఇత్సంజ్ఞకము. ఇత్తైన దాని ఆగమమునందలి చివరి హల్లును తప్పించెదము.

ప్రత్యయము :- అక్ అను ప్రత్యయము వంటిదానిలో దాని చివరనున్న హల్లు (క్) ఇత్సంజ్ఞకము. ఇత్తైన దాని ప్రత్యయము చివరి హల్లును తప్పించెదము.

పైనచె ఇత్. సూత్ర. ఆగమ. ప్రత్యయ. అనేకముల చివరనున్న హల్లు ఈ సూత్రముచే ఇత్సంజ్ఞకము అగుటచే లోపించును. ఇత్సంజ్ఞ పైన వచ్చు ¹లోపించుటచే స్మర్తవ్య సూత్రమే మనకు. ఇత్తైన సూత్రాను ప్రత్యయాదేశములందలి ఇత్సంజ్ఞకమైనవానికి లోపము చెప్పబడెను.

సూత్రేషు అదృష్టం పదం సూత్రాన్తరాత్ అనువర్తనీయం సర్వత్ర

సూత్రములందు కనబడని (లేని) పదమును ఇతరసూత్రము నుండి అచట అనువర్తింప చేసికొనవలెను.

హలన్త్యమ్ అను ప్రత్యాహారసూత్రమున హల్ — అన్త్యమ్ అను రెండుపదములు మాత్రమే కలవు. కాని వృత్తి(వివరణము)లో సూత్రమున లేని ఉపదేశే, ఇత్ అను ఈ రెండు పదములు వాడబడినవి. సూత్రమున లేని యీ పదములు వృత్తి యందెట్లు చెప్పవలెను అంటే సమాధానము. కనుకనే 'సూత్రేషు అదృష్టం....సర్వత్ర'' అని చెప్పబడినది. పాణినీయమైన మను అష్టాధ్యాయిలో హలన్త్యమ్ అను సూత్రమునకు పూర్వమందు 'ఉపదేశేఽజనునాసిక ఇత్' అను సూత్రమున్నది. ఆ సూత్రమునుండి ఉపదేశే,

1. "తస్యలోపః" అను సూత్రముచే ఇత్తులు లోపించును.

ఇత్ అను నీ రెండు పదములు 'హలన్త్యమ్' అను సూత్రములోనికి అను వర్తించును. అప్పుడు ఉపదేశే అన్త్యం హల్ ఇత్ స్యాత్ (ఉపదేశమున అన్త్యమగు హల్లు ఇత్సంజ్ఞక మగును) అను సంపూర్ణ సూత్రార్థము వచ్చును.

సూ:—అదర్శనం లోపః ౧-౧ ౬౦

ప. వి :- అదర్శనం, లోపః

వృ :- ప్రసక్తస్య అదర్శనం లోపసంజ్ఞం స్యాత్.

ప్రసక్తమైన వర్ణముయొక్కకాని, వర్ణసముదాయము యొక్కకాని అదర్శనమును లోపమందురు.

ముందొక వర్ణము కాని, వర్ణసముదాయము కాని, కనిపించి తరువాత కనిపింపకున్నచో లోపమందురు.

సూ :— తస్య లోపః ౧-౩-౯

ప. వి :- తస్య, లోపః

వృ :- తస్య ఇతః లోపః స్యాత్.

ఆ ఇత్తునకు లోపము వచ్చును.

ఏ వర్ణమునకు ఇత్సంజ్ఞ విధింపబడునో అది లోపించునని భావము' అణ్ అను ప్రత్యయమునందలి చివరి ణకారమునకు 'హలన్త్యమ్' అను సూత్రముచే ఇత్సంజ్ఞ వచ్చినది. కనుక ప్రకృత సూత్రముచే ఆ ణ కారము లోపించి 'అ' మాత్రమే మిగులును. ఇట్లే ధాతువులు, ఆగమములు, ఆదేశములు మున్నగువాని చివరి హల్లులు ఇత్సంజ్ఞకము లగుటచే వానికి సూత్రముచే లోపము వచ్చునని భావము.

ణాదయః అణాద్యర్థాః

ణ్ మున్నగు నవి అణ్ ఇత్యాది ప్రయోజనములు కలవి.

మాహేశ్వర సూత్రములలో ప్రతి సూత్రము చివరి హల్లు 'హలన్త్యమ్' అను సూత్రముచే ఇత్సంజ్ఞకమై 'తస్యలోపః' అను సూత్రముచే లోపించును. మొదటసూత్రమున వినబడుచు పిదప లోపముచే నా హల్లులు వినబడనిచో నా హల్లులను (ణ్, క్, ఇత్యాదులను) సూత్రములలో చెప్పుట వ్యర్థము కదా అను సంశయము కలుగును. కనుకనే 'ణాదయో......ద్యర్థాః' అని చెప్పబడినది. సూత్రములందు ణ్, క్ ఇత్యాదులను చెప్పనిచో సూత్రముల చివర హల్లుండదు కనుక వానికి ఇత్సంజ్ఞ రాదు. ఇత్సంజ్ఞ రానిచో 'ఆదిర న్త్యేన సహేతా' అను ముందు సూత్రము ప్రవర్తింపదు. అప్పుడు అణ్, అక్, అచ్ ఇత్యాది సంజ్ఞలు సిద్ధింపవు. ఈ సంజ్ఞలు లాఘవార్థము వ్యాకరణమున అత్యంతావశ్యకములు. కనుక అణ్ ఇత్యాది సంజ్ఞలు సిద్ధించుటకొఱకు మాహేశ్వర సూత్రములయందు చివరి హల్లులావశ్యకములు.

సూ :- ఆదిర న్త్యేన సహేతా ౧-౧-౭౧

ప. వి :- ఆదిః, అన్త్యేన, సహ, ఇతా

వృ :- అన్త్యేన ఇతా సహితః ఆదిః మధ్యగానాం స్వస్య చ సంజ్ఞా స్యాత్, యథా అణ్ ఇతి అ ఇ ఉ వర్ణానాం సంజ్ఞా, ఏవం అచ్, హల్, అల్ ఇత్యాదయః.

చివరి ఇత్తుతో గూడిన మొదటి వర్ణము మధ్యస్థవర్ణములకును తనకును సంజ్ఞ యగును. ఉదాహరణమునకు 'అణ్' అనునది అ, ఇ, ఉ అను వర్ణములకు సంజ్ఞ. ఇట్లే అచ్, హల్, అల్ మున్నగునవి గ్రాహ్యములు.

వివ :- అ ఇ ఉ ణ్ అను చోట చివరనున్న ణ్ అనునది ఇత్తు. దానితో కూడిన అవిభక్తము అనగా అణ్ అను నీ మొత్తము అకారము కారముల మధ్యనున్న ఇ, ఉ అను వర్ణములకును తనకును (అకారమునకును సంజ్ఞ యగును. కనుక అణ్ అను సంజ్ఞచే అ. ఇ. ఉ అను వర్ణములు గ్రహింపబడునని తాత్పర్యము. ఇట్లే అ ఇ ఉ ణ్ సూత్రమందలి అకారమునకు ఐ ఔ చ్ సూత్రములోని చివరి ఇత్తగు 'చ్' అను దానిని కలిపినచో సిద్ధించు 'అచ్' అను సంజ్ఞచే అ, ఇ, ఉ, ఋ, ఌ, ఏ, ఐ, ఓ, ఔ అను వర్ణములు గ్రహింపబడును. ఇట్లే హల్, అల్, అను సంజ్ఞల నెఱుంగునది. అల్ అను సంజ్ఞచే వర్ణములన్నియు గ్రహింపబడును. ఈ విధముగ సిద్ధించెడి అణ్ మున్నగు సంజ్ఞలను ప్రత్యాహారములందురు. (ప్రత్యాహ్రియన్తే = సంక్షిప్యన్తే వర్ణాః యత్ర సః ప్రత్యాహారః—ఎట వర్ణములు ప్రత్యాహరింపబడునో (సంక్షేపింపబడునో) అది ప్రత్యాహారము.

సూ :- ఊకాలోఽజ్ఝ్రస్వదీర్ఘప్లుతః ౧-౨-౨౭

ప. వి - ఊకాలః, అచ్, హ్రస్వదీర్ఘప్లుతః

వృ :- ఉశ్చ, ఊశ్చ ఉ3 శ్చ వః। వాం కాల ఇవ కాలః యస్యసః అచ్ క్రమాత్ హ్రస్వ దీర్ఘ ప్లుతసంజ్ఞః స్యాత్.

ఉ అను శబ్దము ప్రథమాబహువచనమున వః అని యగును. కనుక వః లనగా ఉకారములు (ఉ, ఊ ఉ3 లు) ఉ, ఊ, ఉ3 అను నీ మూడింటి కాలమువంటి కాలముగల అచ్చు హ్రస్వ దీర్ఘ ప్లుత సంజ్ఞకమగును.

'ఉ' అను దానిని ఉచ్చరించుటకు ఒక మాత్రాకాలము పట్టును. మాత్రాకాలమనగా చిటికెవేయుకాలము. ఉచ్చరించుటకు ఒక మాత్రా

కాలముపట్టు నట్టి అచ్చులను హ్రస్వములందురు. 'ఊ' అను దానిని ఉచ్చరించుటకు రెండు మాత్రలకాలము పట్టును. అట్టి ద్విమాత్రాకాలికములగు అచ్చులను దీర్ఘము లందురు. దీర్ఘమునింకను కొంచెము పొడిగించి పలికినచో మూడుమాత్రలకాలము పట్టును. అట్టి త్రిమాత్రాకాలికములగు అచ్చులను ప్లుతములని యందురు. కనుకనే ప్లుతమగు వర్ణము మీద 3 అను గుర్తు ప్రయోగింపబడును.

వృ :- సః ప్రత్యేకం ఉదాత్తాదిభేదేన త్రిధా

ఆ ఒక్కొక్క అచ్చు ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అను భేదములచే మూడు విధములు.

హ్రస్వము, దీర్ఘము, ప్లుతము అను భేదములచే అచ్చు మూడువిధములని పై సూత్రమున తెలుపబడినది. ఈ మూడింటను మరల ఒక్కొక్కటి ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అని మూడు విధములు. ఉదాహరణమునకు 'అ' అను నొక అచ్చును తీసికొనుడు.

ఇది
1) హ్రస్వోదాత్తము)
2) హ్రస్వానుదాత్తము) హ్రస్వభేదములు
3) హ్రస్వస్వరితము)

4) దీర్ఘోదాత్తము)
5) దీర్ఘానుదాత్తము) దీర్ఘభేదములు
6) దీర్ఘస్వరితము)

7) ప్లుతోదాత్తము)
8) ప్లుతానుదాత్తము) ప్లుతభేదములు
9) ప్లుతస్వరితము)

అని యీ విధముగ తొమ్మిది విధములైనది. ఈ పద్ధతి మిగిలిన యచ్చులకును వర్తించును. హ్రస్వ, దీర్ఘ, ప్లుతములను మూడు భేదములు కల అచ్చు ప్రత్యేకముగ ఉదాత్త, అనుదాత్త, స్వరితములను భేదములచే తొమ్మిది విధములగునని యెఱుంగవలెను.

౨ సూ :- ఉచ్చైరుదాత్తః ౧-౨-౨౯

ప. వి :- ఉచ్చైః, ఉదాత్తః

వృ :- తాల్వాదిస్థానేషు ఊర్ధ్వభాగే నిష్పన్నః అచ్ ఉదాత్తః.

తాలువులు (దౌడలు) మున్నగు వర్ణోత్పత్తిస్థానములయందు ఉచ్చశ్రుతిలో నుచ్చరింపబడు అచ్చు ఉదాత్తమనబడును.

సూ :- నీచైరనుదాత్తః ౧-౨-౩౦

ప. వి :- నీచైః, అనుదాత్తః

వృ :- తాల్వాదిస్థానేషు అధోభాగే నిష్పన్నః అచ్ అనుదాత్తః.

తాలువులు (దౌడలు) మున్నగు వర్ణోత్పత్తి స్థానములందు తక్కువశ్రుతిలో ఉచ్చరింపబడు అచ్చు అనుదాత్తమనబడును.

సూ :- సమాహారః స్వరితః ౧-౨-౩౧

ప. వి. :- సమాహారః, స్వరితః

వృ :- ఉదాత్తత్వానుదాత్తత్వయోః ఏకత్ర సమాహారః యత్ర సః అచ్ స్వరితః.

ఉదాత్తధర్మము, అనుదాత్తధర్మము ఏ అచ్చునందు కలిసియుండునో యది స్వరితమనబడును. అనగా తాలువులు మున్నగు స్థానముల మధ్యభాగమునుండి ఉత్పన్నమగు అచ్చు స్వరితమగునని భావము.

ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అను నీ మూడు వర్ణోచ్చారణధర్మములు వేదములో మాత్రమే కానవగును.

వృ :- సః నవవిధః అపి ప్రత్యేకం అనునాసికత్వాననునాసికత్వాభ్యాం ద్విధా.

తొమ్మిది భేదములుగల యీ అచ్చు ప్రత్యేకముగ (ఒక్కొక్కటి) అనునాసిక, అననునాసిక భేదములచే మఱల రెండువిధములగును.

హ్రస్వదీర్ఘప్లుతములలో నొక్కొక్కదానికి ఉదాత్తానుదాత్తస్వరితము లను మూడుభేదములుండుటచే అచ్చునకు తొమ్మిదిభేదము లేర్పడినవి. ఈ తొమ్మిదివిధములగు అచ్చు అనునాసికము, అననునాసికము అని మరల రెండువిధములగుచున్నటచే అచ్చునకు మొత్తము పదునెనిమి భేదము లేర్పడినవి.

సూ :- ముఖనాసికావచనోఽనునాసికః ౧-౧-౮

ప ది :- ముఖనాసికావచనః, అనునాసికః.

వృ :- ముఖసహితనాసికయా ఉచ్చార్యమాణః వర్ణః అనునాసికః స్యాత్

ముఖము (నోటి) తోడను, నాసిక తోడను ఉచ్చరింపబడు వర్ణము అనునాసిక మనబడును.

ముఖము (నోరు) మరియు నాసిక (ముక్కు) ఈ రెండింటి సాహాయ్యముతో పలుకబడు వర్ణము అనునాసికమగునని భావము.

నాసిక ననుసరించి ఉచ్చరింపబడుటచే అనునాసికమను సంజ్ఞ సార్థకము

వృ :- తత్ ఇత్థం. అ, ఇ, ఉ, ఋ ఏషాం వర్ణానాం ప్రత్యేకం అష్టాదశ భేదాః । ౡ వర్ణస్య ద్వాదశ, తస్య దీర్ఘా భావాత్. ఏచాం అపి ద్వాదశ, తేషాం హ్రస్వా భావాత్.

అ, ఇ, ఉ, ఋ అను నీ నాలుగచ్చులకు ప్రత్యేకముగ (ఒక్కొక్క దానికి) పదునెనిమిది భేదములుండును. హ్రస్వ, దీర్ఘ, ప్లుతములను మూడు భేదములును, వీనిలో నొక్కొక్కటి ఉదాత్తానుదాత్త స్వరితము లను భేదములచే తొమ్మిదివిధములై పిదప అనునాసిక, అననునాసిక భేదములచే పదునెనిమిది విధములగునని తాత్పర్యము.

ౡ వర్ణమునకు దీర్ఘము లేనందున అది పండ్రెండు విధములే. ఏచ్చు (ఏ, ఓ, ఐ, ఔ) లకు హ్రస్వము లేనందున హ్రస్వభేదములు లేకపోవుటచే నవియును ఒక్కొక్కటి పండ్రెండువిధములగును.

ఈ దిగువ నీయబడిన ప్రకోష్ఠము (Table) వలన అచ్చుల యొక్క భేదములను సులభముగను, స్పష్టముగను గ్రహింపవచ్చును.

అచ్చుల భేదములు

అ, ఇ, ఉ, ఋ, ఌ హ్రస్వభేదములు	అ, ఇ, ఉ, ఋ, ఏ, ఓ, ఐ, ఔ దీర్ఘభేదములు	అ, ఇ, ఉ, ఋ, ఌ, ఏ, ఓ, ఐ, ఔ ప్లుతభేదములు
హ్రస్వ ఉదాత్తానునాసికము	దీర్ఘ ఉదాత్తానునాసికము	ప్లుత ఉదాత్తానునాసికము
„ ఉదాత్తాననునాసికము	„ ఉదాత్తాననునాసికము	„ ఉదాత్తాననునాసికము
„ అనుదాత్తానునాసికము	„ అనుదాత్తానునాసికము	„ అనుదాత్తానునాసికము
„ అనుదాత్తాననునాసికము	„ అనుదాత్తాననునాసికము	„ అనుదాత్తాననునాసికము
„ స్వరితానునాసికము	„ స్వరితానునాసికము	„ స్వరితానునాసికము
„ స్వరితాననునాసికము	„ స్వరితాననునాసికము	„ స్వరితాననునాసికము

గమనిక :- అ) అ, ఇ, ఉ, ఋ అను నీ నాలుగచ్చులకు హ్రస్వభేదము లాఱు, దీర్ఘభేదము లాఱు, ప్లుతభేదము లాఱును ఉండుటచే ఒక్కొక్కటి 18 విధములు.

ఆ) ఌ అను అచ్చునకు దీర్ఘము లేనందున దీర్ఘభేదములాఱు ఉండవు. హ్రస్వభేదములాఱు, ప్లుతభేదములాఱు మాత్రమే ఉండుటచే నిది 12 విధములు.

ఇ) ఏ, ఓ, ఐ, ఔ అను వానికి హ్రస్వము లేనందున హ్రస్వభేదములాఱు ఉండవు. దీర్ఘభేదములాఱు; ప్లుతభేదములాఱుమాత్రమే ఉండుటచే నివి ఒక్కొక్కటి 12 విధములు.

సూ :- తుల్యాస్యప్రయత్నం సవర్ణమ్ ౧-౧-౯

ప. వి :- తుల్యాస్యప్రయత్నం, సవర్ణమ్.

వృ :- తాల్వాదిస్థానం ఆభ్యన్తరప్రయత్నశ్చ ఇత్యేతద్ద్వయం యస్య యేన తుల్యం తత్ మిథః సవర్ణ సంజ్ఞం స్యాత్.

ఏ వర్ణములకు తాలుపులు (దౌడలు) మున్నగు వర్ణోత్పత్తి స్థానములు, ఆభ్యన్తర ప్రయత్నములును సమానములుగ నుండునో అవి పరస్పరము సవర్ణసంజ్ఞకములగును.

ఆస్యేభవం ఆస్యమ్ అను వ్యుత్పత్తిచే ఆస్యమనగా నోటియం దుండు తాలుపులు (దౌడలు) మున్నగు వర్ణోత్పత్తిస్థానములు. యత్న మనగా ఆభ్యన్తర, బాహ్యప్రయత్నములు. సూత్రమున ప్రకృష్టమను నర్థముకల 'ప్ర' అను నుపసర్గతో యత్నశబ్దమును చెప్పుటచే ప్రయత్న శబ్దముచే ఆభ్యన్తరప్రయత్నమునే గ్రహించవలెను. ఏవంచ ఏ వర్ణ ములకు తాల్వాదివర్ణోత్పత్తిస్థానములు, ఆభ్యన్తరప్రయత్నములును సమానములుగ నుండునో ఆ వర్ణములు పరస్పరము సవర్ణములని భావము.

వాగ్ + హరిః అను చోట హకారస్థానమున గకారము యొక్క సవర్ణము రావలెను. హకారమునకు కంఠముత్పత్తి స్థానమును; నాదము, ఘోషము, సంవారము, మహాప్రాణము అను నాభ్యన్తర ప్రయత్నములు కలవు. ఇట్టి హకారస్థానమున వచ్చు గకార సవర్ణమునకును ఈ ఉత్పత్తి స్థానమును; ఈ ఆభ్యన్తర ప్రయత్నములును ఉండవలెను.

క వర్గములోని ఒక 'ఘ' కారమునకే ఈ స్థానసామ్యము, ఆభ్యన్తర ప్రయత్న సామ్యమును ఉండుటచే నదియే హకారమునకు సవర్ణమని భావము.

ఏ యే వర్ణము లే యే స్థానములందు పుట్టునో ఏ యే వర్ణముల కే యే ప్రయత్నము లుండునో ఈ సూత్ర వివరణముననే తరువాత చెప్పబడును.

వా :- ఋ ఌ వర్ణయోర్మిథః సావర్ణ్యం వాచ్యమ్.

ఋ ఌ అను నీ రెండు వర్ణములకు సావర్ణ్యమును చెప్పవలెను.

'ఋ' అనునది మూర్ధస్థానమునను, ఌకారము దన్తస్థానమునను పుట్టును. కనుక భిన్న స్థానికములగు నీ రెంటికి "తుల్యాస్యప్రయత్నం సవర్ణం" అను సూత్రముచే సావర్ణ్యము సిద్ధింపదు. తాల్వాది స్థానములు సమానములుగనున్న వర్ణములకే కదా పై సూత్రముచే సవర్ణసంజ్ఞ విధింపబడుచున్నది; కనుక వార్తికకారుడీ వార్తికముచే నీ రెండు వర్ణములకు సావర్ణ్యమును విధించుచున్నాడు. ఇవి భిన్నస్థానికములే యైనను సవర్ణములగునని భావము.

ఆ యా వర్ణముల యుత్పత్తిస్థానములు క్రింద వివరింపబడు చున్నవి.

సూ :- అకుహవిసర్జనీయానాం కణ్ఠః

కు అనగా కవర్గము. విసర్జనీయమనగా విసర్గ. అవర్ణము, కవర్గము (క ఖ గ ఘ ఙ) విసర్గము వీనికి కంఠము ఉత్పత్తిస్థానము. కనుక వీనిని కంఠ్యములందురు.

సూ :- ఇచుయశానాం తాలు.

చు అనగా చవర్గము. ఇవర్ణము, చవర్గము (చ. ఛ. జ. ఝ. ఞ) య. శ అను నీ యెనిమిది వర్ణములకు తాలువులు(దౌడలు) ఉత్పత్తి స్థానము. కనుక వీనిని తాలవ్యములందురు.

సూ :- ఉపూపధ్మానీయానాం ఓష్ఠౌ.

'పు' అనగా పవర్గము. ఉపధ్మానీయమనగా ≍ప. ≍ఫ అనుచోట్ల ప. ఫలకు ముందు అర్ధవిసర్గమువలె కనుపించునది. ఎవంచ ఉకారము. పవర్గము. (ప. ఫ. బ. భ. మ) ఉపధ్మానీయము వీనికి ఓష్ఠములు ఉత్పత్తి స్థానము. కనుక నివి ఓష్ఠ్యములు.

సూ :- ఋటురషాణాం మూర్ధా.

టు అనగా టవర్గము. ఋ, టవర్గము (ట. ఠ. డ. ఢ. ణ) ర. ష అను నీయెనిమిదింటికి మూర్ధము ఉత్పత్తిస్థానము. కనుక నివి మూర్ధన్యములు.

సూ :- ఌతులసానాం దన్తాః

తు అనగా తవర్గము. ఌ కారము, తవర్గ (త థ. ద ధ. న) ల. స అను నీ ఎనిమిదివర్ణములకు దన్తములుత్పత్తిస్థానము. కనుక నివర్ణములు దన్త్యములనబడును.

సూ :- ఞమఙణనానాం నాసికా చ

ఞ మ ఙ ణ న అను వానికి (ముక్కు) కూడ ఉత్పత్తిస్థానము.

ఞ, మ, ఙ, ణ, న అను నీయైదువర్ణములు ఐదువర్ణములందలి చివరివర్ణములు. వీనికి నాసికకూడ ఉత్పత్తిస్థానము. నాసికకూడ యనుటచే ఆ యా వర్గముల ఉత్పత్తిస్థానములతోడాటు నాసికకూడ ఉత్పత్తి స్థానమని భావము. ఉదాహరణమునకు ఞ అనువర్ణమును తీసికొందము. ఇది చవర్గలోని ఐదవవర్ణము. కనుక దానికి 'ఇచుయశానాం తాలు' అను పై చెప్పిన వాక్యముచే తాలువును, 'ఞమఙణనానాం నాసికాచ' అను వాక్యముచే నాసికయు ఉత్పత్తిస్థానములు. ఇట్లే మఙణన అను వానికిని ఆ యా వర్గముల యుత్పత్తిస్థానములతోడాటు నాసికయు ఉత్పత్తి స్థానమగునని యెఱుగవలెను.

సూ :- ఏదైతోః కంఠతాలు.

ఏకారమునకు, ఐకారమునకును కంఠతాలువులు (కంఠము, మరియు దౌడలు) ఉత్పత్తిస్థానములు.

సూ :- ఓదౌతోః కంఠోష్ఠమ్.

ఓకారమునకు ఔకారమునకును కంఠోష్ఠములు (కంఠము మరియు పెదవులు) ఉత్పత్తిస్థానములు.

సూ :- వకారస్య దన్తోష్ఠమ్.

వకారమునకు దన్తోష్ఠములు (దన్తములు మరియు పెదవులు) ఉత్పత్తిస్థానములు.

సూ :- జిహ్వామూలీయస్య జిహ్వామూలమ్.

జిహ్వామూలీయమునకు జిహ్వామూలము ఉత్పత్తిస్థానము.

ౘక ౘఖ అనుచోట్ల క, ఖలకు ముందు అర్ధవిసర్గలవలె కని పించుదానిని జిహ్వామూలీయమందురు. అది జిహ్వయొక్క మూల స్థానమున ఉత్పన్నమగును. కనుకనే దానికి జిహ్వామూలీయమను సంజ్ఞ సార్థకము.

సూ :- నాసికా అనుస్వారస్య

అనుస్వారమునకు నాసిక (ముక్కు) ఉత్పత్తిస్థానము.

బిందు సున్నను అనుస్వారమని యందురు. దీనికి నాసిక ఉత్పత్తి స్థానము. స్వరమును (అచ్చును) అంటిపెట్టుకొనియే యిది ఉచ్చరించ బడును కనుక దీనికి అనుస్వారమను పేరు సార్థకము.

వర్ణోత్పత్తి స్థానములు :-

వర్ణములు	స్థానములు
అ, క, ఖ, గ, ఘ, ఙ, హ, ః	కంఠము
ఇ, చ ఛ జ ఝ ఞ, య, శ,	తాలువులు (దౌడలు)
ఉ, ప, ఫ, బ, భ మ, ఉపధ్మానీయము (ప, ఫ లకు ముందుండు అర్ధ విసర్గ సదృశమైనది)	ఓష్ఠములు (పెదవులు)
ఋ, ట, ఠ, డ, ఢ, ణ, ర, ష	మూర్ధము
ఌ, త, థ, ద, ధ న, ల, స	దంతములు
ఞ, మ, ఙ, ణ, న, అనుస్వారము	నాసిక
ఏ, ఐ	కంఠతాలువులు
ఓ, ఔ	కంఠోష్ఠములు
వ	దంతోష్ఠములు
జిహ్వామూలీయము	జిహ్వామూలము

సూ :- యత్నః ద్విధా - ఆభ్యన్తరః బాహ్యశ్చ.

యత్నము ఆభ్యన్తరము, బాహ్యము అని రెండు విధములు.

వర్ణముల నుచ్చరించునపుడు చేయు చేష్టనే యత్నమందురు అట్టి యత్నము ఆభ్యన్తరము, బాహ్యమని రెండు విధములు. ఒక వర్ణము ముఖము (నోటి) నుండి బయటికి వచ్చుటకు ముందు (ఆ వర్ణోచ్చారణమునకు పూర్వము) ముఖములోపల జరుగు యత్నము ఆభ్యన్తర ప్రయత్నమనబడును. ఒకవర్ణము ముఖమునుండి బయల్వెడలు

సమయమున (అనగా వర్ణోచ్చారణ సమయమున) జరుగు యత్నము బాహ్య ప్రయత్న మనబడును.

వృ :- ఆద్యః పంచధా - స్పృష్టేషత్స్పృష్టేషద్వివృత వివృత సం వృత భేదాత్.

మొదటిప్రయత్నమగు ఆభ్యంతరప్రయత్నము స్పృష్టము. ఈషత్స్పృష్టము. ఈషద్వివృతము. వివృతము. సంవృతము అని యైదువిధములు.

ఏ యే వర్ణములకే యే ఆభ్యంతర ప్రయత్నము లుండునో దిగువ వివరింపబడుచున్నది.

వృ :- తత్ర స్పృష్టం ప్రయతనం స్పర్శానామ్.

[1]స్పర్శాక్షరములకు స్పృష్టప్రయత్నము.

వృ :- ఈషత్స్పృష్ట మన్తఃస్థానామ్.

అన్తఃస్థ వర్ణములకు (య, వ, ర, ల అను వర్ణములకు) ఈష త్స్పృష్టప్రయత్నము.

వృ :- ఈషద్వివృత మూష్మణామ్.

ఊష్మ వర్ణములకు (శ, ష, స, హ, లకు) ఈషద్వివృత ప్రయత్నము.

వృ :- వివృతం స్వరాణామ్.

స్వరములకు (అచ్చులకు) వివృతప్రయత్నము.

1. క మొదలుకొని మ వరకు గల హల్లులు.

వా :- హ్రస్వస్య అవర్ణస్య ప్రయోగే సంవృతం. ప్రక్రియాదశాయాం తు వివృతమేవ.

స్వరములన్నింటికి వివృతప్రయత్నమని సామాన్యముగ చెప్పబడినది. కాని ప్రయోగదశయందు (పరినిష్ఠితరూపమున) ఉన్న హ్రస్వాకారమునకు వివృతప్రయత్నముకాక సంవృతప్రయత్నమే యుండును. ప్రక్రియాదశయందున్న హ్రస్వాకారమునకు మాత్రము వివృతప్రయత్నమే.

ఆభ్యంతర ప్రయత్నములను తెలుపు ప్రకోష్ఠకము

స్పృష్టము	ఈషత్స్పృష్టము	వివృతము	ఈషద్వివృతము	సంవృతము
స్పర్శములు	అంతస్థములు	స్వరములు	ఊష్మములు	ప్రయోగదశయందలి హ్రస్వాకారము
క ఖ గ ఘ ఙ	య	అ ఇ ఉ	శ	
చ ఛ జ ఝ ఞ	ర	ఋ ఌ	ష	
ట ఠ డ ఢ ణ	ల	ఏ ఐ	స	
త థ ద ధ న	వ	ఓ ఔ	హ	
ప ఫ బ భ మ				

వా :- బాహ్యప్రయత్నాః తు ఏకాదశధా – వివారః, సంవారః, శ్వాసః, నాదః. ఘోషః. అఘోషః, అల్పప్రాణః, మహాప్రాణః, ఉదాత్తః, అనుదాత్తః, స్వరితః చ ఇతి.

బాహ్యప్రయత్నము 11 విధములు

1. వివారము, 2. సంవారము, 3. శ్వాసము, 4. నాదము, 5. ఘోషము, 6. అఘోషము, 7. అల్పప్రాణము, 8. మహాప్రాణము, 9. ఉదాత్తము, 10. అనుదాత్తము, 11. స్వరితము.

వృ :- ఖరో వివారాః శ్వాసా అఘోషాశ్చ

ఖర్ ప్రత్యాహారవర్ణములకు వివారము, శ్వాసము, అఘోషము అను మూడు ప్రయత్నములుండును.

వృ :- హశః, సంవారాః, నాదాః, ఘోషాశ్చ.

హశ్ ప్రత్యాహార వర్ణములకు సంవారము, నాదము, ఘోషము అను మూడు ప్రయత్నములుండును.

వృ :- వర్గాణాం ప్రథమతృతీయపంచమాః యణశ్చ అల్పప్రాణాః.

[1]ఐదువర్గములలోని మొదటి వర్ణములు (క ఇత్యాదులు) మూడవ వర్ణములు. (గ ఇత్యాదులు) ఐదవవర్ణములు. (ఙ ఇత్యాదులు) యణ్ ప్రత్యాహారవర్ణములు వీనికి అల్పప్రాణయత్న ముండును.

వృ :- వర్గాణాం ద్వితీయచతుర్థౌ శలశ్చ మహాప్రాణాః

ఐదువర్గములలోని రెండవవర్ణములు, (ఖ ఇత్యాదులు) నాలుగవ వర్ణములు, (ఘ ఇత్యాదులు) శల్ ప్రత్యాహారవర్ణములు వీనికి మహాప్రాణప్రయత్నముండును.

---

1. క, చ, ట, త, ప

బాహ్యప్రయత్నముల నీ క్రింది ప్రకోష్ఠకమువలన సులభముగా తెలియనగును.

వివారము శ్వాసము అఘోషము	సంవారము నాదము ఘోషము	అల్పప్రాణము	మహాప్రాణము	ఉదాత్తము అనుదాత్తము స్వరితము
ఖర్ ప్రత్యాహార వర్ణములు	వర్గ తృతీయ చతుర్థ పంచమ వర్ణములు, యణ్	వర్గ ప్రథమ, తృతీయ పంచమ వర్ణములు యణ్	వర్గముల ద్వితీయ చతుర్థ వర్ణములు, శల్ ప్రత్యాహార వర్ణములు	అచ్చులు
క ఖ	గ ఘ ఙ	క గ ఙ	ఖ ఘ	
చ ఛ	జ ఝ ఞ	చ జ ఞ	ఛ ఝ	అ ఇ ఉ
ట ఠ	డ ఢ ణ	ట డ ణ	ఠ ఢ	ఋ ఌ
త థ	ద ధ న	త ద న	థ ధ	ఏ ఓ
ప ఫ	బ భ మ	ప బ మ	ఫ భ	ఐ ఔ
శ ష స	య వ ర ల	య ర ల వ	శ ష స హ	

వృ :- కాదయో మావసానాః స్పర్శాః

ప్రసిద్ధమగు వర్ణమాలలో 'క' మొదలుకొని 'మ' వఱకుండు వర్ణములు స్పర్శములనబడును. అనగా క, చ, ట, త, ప అను ఈ యైదు వర్గములందుండు ఐదైదు వర్ణములు (మొత్తమిరువదియైదు వర్ణములు) స్పర్శములనబడును.

వృ :- శల ఊష్మాణః.

శల్ ప్రత్యాహారవర్ణములు (శ, ష, స, హలు) ఊష్మములనబడును.

వృ :- అచః స్వరాః

అచ్ ప్రత్యాహార వర్ణములు స్వరములనబడును.

వృ :- ≍క, ≍ఖ ఇతి కఖాభ్యాం ప్రాక్ అర్ధవిసర్గసదృశః జిహ్వామూలీయః

≍క, ≍ఖ అనుచోట క,ఖలకు పూర్వమందు అర్ధవిసర్గము వలె (≍) కనిపించునది జిహ్వామూలీయమనబడును.

వృ :- ≍ప, ≍ఫ ఇతి పఫాభ్యాం ప్రాక్ అర్ధవిసర్గసదృశః ఉపధ్మానీయః.

≍ప, ≍ఫ అనుచోట్ల ప, ఫలకు పూర్వము అర్ధవిసర్గమువలె కనిపించునది ఉపధ్మానీయమనబడును.

సూ :- అణుదిత్సవర్ణస్య చాప్రత్యయః ౧-౧-౬౯

ప ది :- అణుదిత్, సవర్ణస్య, చ, అప్రత్యయః

వృ :- ప్రతీయతే (విధీయతే) ఇతి ప్రత్యయః, సప్రత్యయః అప్రత్యయః- అవిధీయమానః అణ్ ఉదిత్ చ సవర్ణస్య సంజ్ఞా స్యాత్. అత్రైవ అణ్ పరేణ ణకారేణ, కు, చు, టు, తు, పు ఏతే ఉదితః.

ప్రత్యయమనగా విధింపబడునది. అప్రత్యయమనగా విధింపబడనిది.

విధింపబడని అణ్ ప్రత్యాహారవర్ణములును, ఉదిత్తును సవర్ణమునకు సంజ్ఞయగును. ఈ ఒక్కచోట మాత్రమే అణ్ ప్రత్యాహారమును పరణకారముతో చెప్పికొనవలెను. కు, చు, టు, తు, పు అనునవి ఉదిత్తులు.

మాహేశ్వరసూత్రములలో అఇఉణ్ అను మొదటిసూత్రమునను, లణ్ అను నాలుగవసూత్రమునను 'ణ్' అనునది కలదు ఇది హలన్త్యమ్ అనుసూత్రముచే ఇత్సంజ్ఞకమగును. ఇట అణ్ అనునది పూర్వమగు అఇఉణ్ సూత్రములోని ణకారముతో ప్రత్యాహారముచేయగా సిద్ధించిన సంజ్ఞయా? లేక పరమగు లణ్ అను సూత్రములోని ణకారముతో ప్రత్యాహారము చేయగా సిద్ధించిన సంజ్ఞయా? అను సందేహము కలుగును. ఈ సందేహము 'అత్రైవాణ్' అనువాక్యముచే నివారింపబడును. ప్రాచీనాచార్యుల సంప్రదాయానుసారము ఈ ఒక్కచోటమాత్రము [1]పరణకారము (లణ్సూత్రములోని ణకారము)తో ప్రత్యాహారము చెప్పవలెను. ఇతరత్ర నుండు అణ్ సంజ్ఞకు పూర్వణకారములో ప్రత్యాహారమని భావము.

ఉదిత్తులనగా హ్రస్వోకారము ఇత్సంజ్ఞగా కలవి. కు, చు, టు, తు, పు అనునవి ఉదిత్తులు.

ఏపంచ అణ్ ప్రత్యాహారవర్ణములును, (అచ్చులు- హ, య, వ, ర, లు) ఉదిత్తులును (కు, చు, టు, తు, పు అనునవి) విధింపబడక విశేషింపబడినపుడు వాని సవర్ణములుకూడ గ్రహింపబడును. ఉదాహరణమునకు 'ఇకోయణచి' అనుసూత్రమును గ్రహింపుము. ఇక్కునకు

1. పూర్వే త్రైవాణ్గ్రహః సర్వే పరేత్రై వేణ్గ్రహో మతః
ఋతేఽణుదిత్సవర్ణస్యేత్యేతదేకం పరేణ తు.

అచ్చుపరమగుచో యణాదేశము వచ్చును అని దీనియర్థము. ఇట ఇక్ అను ప్రత్యాహారముచే ఇ. ఉ. ఋ. ఌ అను వర్ణములు గ్రహింపబడును. సూత్రమున ఇకః అని ఇక్కునుద్దేశించి యణాదేశము విధింపబడినది కనుక విధీయమానము యణ్ కాని ఇక్కు కాదు. కనుక అవిధీయమానమగు ఇక్కు సవర్ణములన్నింటికి సంజ్ఞయగుటచే ఇవర్ణముచే ఇకారముయొక్క పదునెనిమిది భేదములను (దీర్ఘప్లుతాదులను) గ్రహింపబడును. ఇట్లే ఉ. ఋ. ఌ అను వర్ణములచేతను వాని సవర్ణములగు దీర్ఘాదులు గ్రహింపబడును

ఇట్లే కు. అను ఉదిత్తును గ్రహించినపుడు తత్సవర్ణములగు ఖ. గ. ఘ. ఙ అను వర్ణములను గ్రహింపబడును. ఇట్లే చు. టు ఇత్యాదులచేతను వాని వాని సవర్ణాక్షరములు గ్రహింపబడునని యెఱుంగనది. ఈ సూత్రములేనిచో మాహేశ్వరసూత్రములలో చెప్పబడిన హ్రస్వములగు ఇ. ఉ. ఋ లనే గ్రహింపవలసివచ్చెడిది. అట్లైనచో సుధీ+ఉపాస్యః ఇత్యాదులందు ధకారముమీది దీర్ఘ ఈకారము ఇక్ ప్రత్యాహారముచే గ్రహింపబడక పోవుటచే యణాదేశము రాకపోవును.

అణ్ ప్రత్యాహారవర్ణములచే వాని సవర్ణములన్నియు గ్రహింపబడునని చెప్పుటచే ఆ యా వర్ణములకు సవర్ణాక్షరము లెన్ని యుండునో ఈ క్రింది వృత్తిలో వివరింపబడుచున్నది.

వృ :- తదేవమ్। అ ఇత్యష్టాదశానాం సంజ్ఞా తథా ఇకారోకారౌ। ఋకారః త్రింశతః। ఏవం ఌకారోఽపి, ఏచః ద్వాదశానాం. అనునాసికాననునాసిక భేదేన యవలాద్విధా। తేన అననునాసికాస్తే ద్వయోర్ద్వయోః సంజ్ఞా।

అ అనునది పదునెనిమిది భేదములకు సంజ్ఞ. ఇట్లే ఇకార, ఉకారములు. ఋకారము ముప్పది భేదములకు సంజ్ఞ ఇట్లే ఌకారము.

ఏ, ఓ, ఐ, ఔలలో ఒక్కొక్కటి పన్నెండు భేదములకు సంజ్ఞ. య, వ, ల అను నీ మూడును అనునాసికము, అననునాసికము అను భేదములచే ఒక్కొక్కటి రెండు విధములు. అననునాసికములగు యవ లలు అనునాసిక అననునాసికములకు సంజ్ఞలగును.

అ, ఇ, ఉ అను నీ మూడచ్చులలో ఒక్కొకదానికి 18 భేదములు కలవు. ఋకార ౡకారములలో ప్రతివర్ణమునకు ముప్పది భేదములు. ఎట్లన ఋకారమునకు 18 భేదములనియు, ౡకారమునకు 12 భేదములనియు పూర్వమే తెలుపబడినది. "ఋ ౡ వర్ణయోర్మిథః సావర్ణ్యం వాచ్యమ్" అను వార్తికముచే ఋ ౡ వర్ణములు సవర్ణములు కనుక ఋవర్ణమును గ్రహించినపుడు ఋకారభేదములు పదునెనిమిదితో పాటు ౡకారభేదములు పన్నెండును గ్రహింపబడుటచే మొత్తము ముప్పది భేదము లేర్పడును.

య వ ల అను నీ మూడు వర్ణములు అనునాసికములు, అననునాసికములు అని రెండు విధములు. అనునాసికములు కాని యవలల నుచ్చరించినపుడు అనునాసికములగు యవలలు కూడ గ్రహింపబడును.

సూ :- పరః సన్నికర్షః సంహితా ౧-౪-౧౦౯

ప. వి :- పరః, సన్నికర్షః, సంహితా

వృ :- వర్ణానాం అతిశయితః సన్నిధిః సంహితాసంజ్ఞః స్యాత్.

వర్ణములయొక్క మిక్కిలి సాన్నిధ్యము సంహిత యనబడును. ఒక వర్ణమునకును దాని తరువాతి వర్ణమునకును మధ్యలో అర్ధమాత్రా కాలముకన్న ఎక్కువ వ్యవధానముండక మిక్కిలి దగ్గరగా నుండుట సంహిత యగునని భావము. దధి అను పదము నుచ్చరించిన రెండు నిమిషములకు ఓదనమ్ అని యుచ్చరించినచో నీ రెండింటికి అర్ధమాత్రా

కాలముకంటె ఎక్కువ వ్యవధానముండుటచే వీనికి సంహితలేదు. సంహిత లేనిచోట సంధిరాదు.

సూ :- సుప్తిఙన్తం పదమ్ ౧-౪-౧౪

ప. వి :- సుప్తిఙన్తం, పదమ్.

వృ :- సుబన్తం తిఙన్తం చ పదసంజ్ఞం స్యాత్.

సుబన్తమును, తిఙన్తమును అగు శబ్దము పదమనబడును.

సుప్ అనగా విభక్తి ప్రత్యయములు. తిఙ్ అనగా ధాతువులపై ప్రథమాది పురుషలలో వచ్చు ప్రత్యయములు. ఇట్టి సుప్ ప్రత్యయములు, తిఙ్ ప్రత్యయములును అంతమందు కలది పదములగును. రామః ఇత్యాదులు సుబన్తములగుటచేతను, భవతి ఇత్యాదులు తిఙన్తము లగుట చేతను పదములగును.

సూ :- హలోఽనన్తరాః సంయోగః ౧-౧-౭

ప. వి :- హలః, అనన్తరాః, సంయోగః.

వృ :- అజ్భిః అవ్యవహితాః హలః సంయోగసంజ్ఞాః స్యుః.

అచ్చులతో వ్యవధానము లేని హల్లులు సంయోగ సంజ్ఞకము లగును.

హల్లుల మధ్యలో అచ్చు లేనిచో నా హల్లులకు సంయోగమని పేరు. క్ష అను వర్ణసముదాయమున క్+ష్+అ అను మూడు వర్ణములు గలవు. ఇట క్+ష్ అను రెండు హల్లుల మధ్యలో అచ్చు లేకుండుటచే నా రెండు (క్, ష్ అనునవి) కలిసి సంయోగ మగును ఇట్లే రెంటికన్న ఎక్కువ హల్లులుండి వాని మధ్యలో అచ్చు లేనిచో నా హల్లులు సంయోగ మగును.

సూ :- హ్రస్వం లఘు ౧-౪-౧౦

హ్రస్వమైన అచ్చునకు లఘువని పేరు.

సూ :- సంయోగే గురు ౧-౪-౧౧

సంయోగము పరమందుండగా హ్రస్వము గురు సంజ్ఞక మగును.

పై సూత్రమున హ్రస్వమగు అచ్చు లఘువగునని చెప్పబడినది. అట్టి హ్రస్వము సంయోగము పరమగునపుడు గురువగును. ఉదాహరణకు అక్ష అను శబ్దమును తీసికొనుడు. ఇట అ అను హ్రస్వము 'క్ష' అను సంయోగము పరముగ నుండుటచే గురువగును.

సూ :- దీర్ఘం చ ౧-౪-౧౨

ప. వి :- దీర్ఘం, చ

వృ :- దీర్ఘం చ గురుసంజ్ఞం స్యాత్

దీర్ఘము కూడ గురుసంజ్ఞక మగును.

ఆ, ఈ మున్నగు దీర్ఘములగు అచ్చులును గురువులగునని భావము.

ఇతి సంజ్ఞాప్రకరణమ్.

అథ అచ్సంధిప్రకరణమ్

సూ:- షష్ఠీ స్థానేయోగా : ౧-౧-౪౯

ప. వి :- షష్ఠీ, స్థానేయోగా.

వృ :- అనిర్ధారితసంబంధవిశేషా షష్ఠీ స్థానేయోగా బోధ్యా. స్థానం చ ప్రసంగః.

నిర్ధారణము చేయబడని సంబంధ విశేషముగల షష్ఠి స్థానేయోగముగా గ్రహింపదగినది. స్థానమనగా ప్రసంగము.

వివ :- ముందు చెప్పబోవు "ఇకోయణచి" అను సూత్రమునకు "ఇక్కునకు అచ్చుపరమగునప్పుడు యణాదేశము వచ్చు" నని సామాన్యార్థము. ఇట "ఇకః" అనునది షష్ఠ్యంతమైన పదము. కనుక ఇక్కునకు అను అర్థము వచ్చును. ఇక్కునకు అని సామాన్యముగా చెప్పుటచే ఇక్కునకు పూర్వమందైనను, పరమందైనను లేదా ఇక్కుస్థానమందైనను యణాదేశము వచ్చునని అర్థము వచ్చుటచే నిటనున్న ఇకః అను షష్ఠీవిభక్తియొక్క సంబంధమిది యని స్పష్టముగా నిర్ధారితము కాలేదు. కనుక నిట్టి షష్ఠీవిభక్తికి ప్రకృతసూత్రముచే స్థానే అనుపదముతో యోగమును చెప్పుచున్నది. అప్పుడు "ఇకః స్థానే" అనునర్థము వచ్చును. అనగా ఇక్కునకు ప్రసక్తియున్నచోట యణాదేశము వచ్చునని సూత్రార్థమేర్పడును.

సూ :- తస్మిన్నితి నిర్దిష్టే పూర్వస్య ౧-౧-౬౬

ప. వి :- తస్మిన్, ఇతి, నిర్దిష్టే, పూర్వస్య.

వృ :- సప్తమీనిర్దేశేన విధీయమానం కార్యం వర్ణాంతరేణ అవ్యవహితస్య పూర్వస్య బోధ్యమ్.

సప్తమీ విభక్తి నిర్దేశముచే విధింపబడు కార్యము ఇతరాక్షరముతో వ్యవధానములేని పూర్వవర్ణమునకు వచ్చునని గ్రహింపవలెను.

వివ :- ఒక సూత్రమున సప్తమ్యంతపదమునుపయోగించి ఏదేని కార్యము విధింపబడినచో ఆ కార్యము ఆసప్తమ్యంతమునకు ఎట్టి ఇతర వర్ణములతో వ్యవధానము లేక పూర్వమున నున్నవర్ణమునకే వచ్చునని భావము. "ఇకో యణచి" అను పైసూత్రమున "అచి" అనునది సప్తమ్యంతపదము కనుక దానికి అవ్యవహితపూర్వమందున్న (ఇతరవర్ణములతో వ్యవధానము లేక పూర్వమందున్న) ఇక్కునకే యణాదేశము వచ్చును. అనగా యణాదేశము చెప్పదలిచిన ఇక్కునకును నిమిత్తమైన అచ్చునకును మధ్యలో ఏ వర్ణమును ఉండ కూడదని భావము. ఈసూత్రములేనిచో ఇక్కునకు అచ్చునకు మధ్యలో ఇతరవర్ణములతో వ్యవధాన ముండకూడదను అర్థమురాక "సమిధమ్" అనుపదమున మ కారముమీది ఇ కారమునకు (ఇక్కునకు) ధకారము మీది అకారము (అచ్చు) పరమగుటచే ఆ ఇకారమునకు యణాదేశము రావలసి వచ్చును. కనుక నీ సూత్రము చెప్పబడినది. ఈ సూత్ర మున్నచో ఇక్కునకు అచ్చునకు మధ్యలో ఎట్టివర్ణముతో వ్యవధాన ముండ కూడదనుటచే "సమిధమ్" అనుచోట ఇక్కునకు అచ్చునకును మధ్యలో ధకారముతోడ వ్యవధానముండుటచే యణాదేశము రాదు.

సుధీ + ఉపాస్యః అనుచోట ధకారముమీది ఈకారమునకును (ఇక్కునకు) "ఉపాస్యః"లోని ఉకారమునకు (అచ్చునకు) మధ్య నెట్టి వర్ణముతోడను వ్యవధానము లేదు కనుక నిట ఈకారస్థానమున యణాదేశము వచ్చును.

సూ :- సంహితాయామ్ ౬-౧-౭౨

వృ :- ఇత్యధికృత్య.

వివ :- ఈ సూత్ర మధికార సూత్రము. అనగా విది పైన చెప్పబోవు సంధివిధాయక సూత్రములలో అధికరించును అనగా సమన్వయించు నని భావము

స్వస్థలమున నెట్టి ప్రయోజనములేక ఆ యా విధి సూత్రములతో సమన్వయించినప్పుడే అర్థవంతమగుట అధికార సూత్రముల స్వభావము.

సంహిత యనగా వర్ణములయొక్క మిక్కిలి సాన్నిహిత్యము. ఈ విషయము సంజ్ఞాప్రకరణమున "పరః సన్నికర్షః సంహితా" అను సూత్రమున వివరింపబడినది.

ఈ అధికార సూత్రముపైన చెప్పబోవు "ఇకోయణచి" అను సూత్రమున సమన్వయించి ఇక్కునకు అచ్చు పరమగునప్పుడు వచ్చు యణాదేశము సంహిత యున్నప్పుడే వచ్చునను విశేషమును తెలుపును.

సూ :- ఇకో యణచి ౬-౧-౭౭

ప. వి :- ఇకః, యణ్, అచి.

వృత్తి :- ఇకః స్థానే యణ్ స్యాత్ అచి సంహితాయాం విషయే సుధీ + ఉపాస్యః ఇతిస్థితే.

ఇక్కున కచ్చు పరమగునపుడు సంహిత యుండగా యణ్ణు వచ్చును. సుధీ + ఉపాస్యః అని యుండగా

వివ :- ఈ సూత్రమునందలి ఇక్, యణ్, అచ్ అను నీ మూడును ప్రత్యాహారములు. సంహిత యనగా రెండు వర్ణములకు మధ్యలో ఒక మాత్రాకాలము కన్న ఎక్కువ వ్యవధానము లేకుండుట.

ఏవంచ ఇక్కునకు (ఇ. ఉ. ఋ. ఌ లకు) అచ్చు అవ్యవహిత పరముగా నున్నపుడు యణాదేశము (య్. వ్. ర్. ల్ అనునవి) వచ్చునని సూత్రార్థము. ఒక వర్ణమును తొలగించి దాని స్థానమున వచ్చునది ఆదేశమనబడును దేనిని తొలగించి ఆదేశము వచ్చునో అది స్థాని యనబడును.

సుధీ + ఉపాస్యః అనుచోట ధకారము మీది ఈః కారమునకు (ఇక్కునకు) ఉపాస్యః లోని ఉకారము అవ్యవహిత పరముగా నుండుటచే యణాదేశము రావలెను యణ్ ప్రత్యాహారమున య. వ. ర. ల లు చేరుటచే వీనిలోనే వర్ణము ఈః కార స్థానమున ఆదేశముగ రావలయునో తెలియకున్నది. కనుక నా సందేహము ఈః క్రింది సూత్రముచే తొలగి పోవును

సూ :- స్థానే ఽన్తరతమః ౧-౧-౫౦

ప వి :- స్థానే. అన్తరతమః

వృ :- ప్రసఙ్గే సతి సదృశతమః ఆదేశః స్యాత్. యత్ర అనేకవిధః అంతర్యం తత్ర స్థానతః అంతర్యం బలీయః సుధ్ + య్ + ఉపాస్యః ఇతి జాతే.

(అనేకములకు) ప్రసక్తి యుండగా మిక్కిలి సదృశమైన వర్ణము ఆదేశమగును. ఎట అనేకవిధమగు సాదృశ్యముండునో అట స్థాన సాదృశ్యమే బలీయము.

సుధ్ + య్ + ఉపాస్యః అని కాగా

వి :- ఒక వర్ణమునకు మఱియొక వర్ణముతో అనేక విధములగు సాదృశ్యము లుండవచ్చును. కాని ఆదేశముగ వచ్చు వర్ణమున కును, ఆదేశమునకు స్థానియగు వర్ణమునకును ఉండు వివిధసాదృశ్య

ములలో స్థానసాదృశ్యమే బలీయము. కనుక స్థానసాదృశ్యము కల వర్ణమే ఆదేశముగ వచ్చును

సుధీ+ఉపాస్యః అనుచోట ధకారము మీది ఈకారస్థానమున యణ్ణులు (య, వ, ర, ల లు) నాలుగును ఆదేశములుగా ప్రాప్తము లైనవి. కాని ఈ సూత్రముచే స్థానసాదృశ్యము గల వర్ణమే ఆదేశముగ రావలెనని చెప్పుటచే తాలవ్యమగు ఈ కార స్థానమున తాలవ్యమగు యవర్ణమే ఆదేశముగ వచ్చును. తక్కిన వ, ర, లలు తాలవ్యములు కావు కనుక నవి తాలవ్యమగు ఈ కారస్థానమున ఆదేశములుగ రావు. యకారమే ఆదేశముగ వచ్చి సుధ్+య్+ఉపాస్యః అని యేర్పడును.

సూ :- అనచి చ ౮-४-४౭

ప. వి :- అనచి, చ.

వృ :- అచః పరస్య యరః ద్వే వా స్తః న తు అచి ఇతి ధకారస్య ద్విత్వేన సుధ్+ధ్+య్+ఉపాస్యః ఇతి జాతే.

అచ్చునకు పరముగు యర్ ప్రత్యాహారవర్ణములకు ద్విత్వము వికల్పముగా వచ్చును. అచ్చుపరముగ నున్నచో రాదు. ఈ సూత్రముచే ధ కారమునకు ద్విత్వము రాగా సుధ్+ధ్+య్+ఉపాస్యః అని యగును.

వివ :- యర్ అను నది "హయవరట్" అను సూత్రములోని యకార మునకు శ ష స ర్ లోని రేఫముతో ప్రత్యాహారము అనగా ఒక్క హకారము తప్ప తక్కిన హల్లు లన్నియు నీ "యర్" ప్రత్యాహారముచే గ్రహింపబడును. ఈ యర్ ప్రత్యాహార వర్ణమునకు పూర్వమున అచ్చుండి పరమందచ్చు లేనిచో ద్విత్వము వికల్పముగ వచ్చునని భావము.

సుధ్ + య్ + ఉపాస్యః అను చోట సుధ్ లోని సకారము మీది ఉకారము అచ్చు. దానికి పరముగ యర్ వర్ణము (ధ్ అనునది) కలదు. ఆ ధకారమునకు పరమందు అచ్చు లేదు. కనుక ఈ సూత్రముచే ధకారమునకు ద్విత్వము రాగా సుధ్ + ధ్ + య్ + ఉపాస్యః అని యగును. ఈ ద్విత్వము వికల్పము కనుక ద్విత్వము రాని పక్షమున సుధ్ + య్ + ఉపాస్యః అనియే యుండును.

సూ :- ఝలాం జశ్ ఝశి. ౮-౪-౫౩

ప. వి :- ఝలాం, జశ్, ఝశి.

ఝల్లులకు ఝశ్ పరముగానున్నప్పుడు జశ్ (జ బ గ డ ద లు) ఆదేశముగ వచ్చును.

సుధ్ + ధ్ + య్ + ఉపాస్యః అనుచోట మొదటి ధకారము ఝల్లు. దీనికి ఝశ్ = రెండవ ధకారము పరముగ నున్నది. కనుక ఈ సూత్రముచే ఝల్లు (మొదటి ధకారము) స్థానమున జశ్ (దకారము) ఆదేశముగవచ్చి సుద్ + ధ్ + య్ + ఉపాస్యః (సుద్ధ్యుపాస్యః) అను రూప మేర్పడును.

సూ :- సంయోగాన్తస్య లోపః ౮-౨-౨౩

ప. వి :- సంయోగాన్తస్య, లోపః

వృ :- సంయోగాన్తం యత్ పదం తదన్తస్య లోపః స్యాత్.

సంయోగము అంతమందు గల పదముయొక్క అన్తమునకు లోపము వచ్చును.

అచ్చులతో వ్యవధానము లేని హల్సముదాయమును సంయోగ మందురు. ఏ పదము చివర నట్టి సంయోగ మున్నదో ఆ పదము చివరి భాగమునకు లోపము వచ్చును.

సూ :- అలోఽన్త్యస్య ౧.౧-౫౨

ప. ఛే :- అలః, అన్త్యస్య.

వృ:- షష్ఠీనిర్దిష్టః అన్త్యస్య అలః ఆదేశః స్యాత్. ఇతి యలోపే ప్రాప్తే.

షష్ఠీవిభక్తిచే నిర్దిష్టమైన ఆదేశము అంత్యమైన అల్లునకు (వర్ణమునకు) ఆదేశముగ వచ్చును. ఇట్లు యలోపము ప్రాప్తింపగా.

ఏ సూత్రమున షష్ఠీవిభక్తిని నిర్దేశించి ఆదేశము విధింపబడునో ఆ యాదేశము సూత్రమున షష్ఠీవిభక్తిచే నిర్దేశింపబడిన వర్ణసముదయముయొక్క చివరివర్ణమునకే ఆదేశముగ వచ్చునని సూత్రార్థము.

"సంయోగాన్తస్య లోపః" అను పై సూత్రములోనికి 'పదస్య' అను పదమనువర్తించి సంయోగాన్తమగు పదమునకు లోపము వచ్చునని తెలియుచున్నది. సంయోగాన్తమగు పదములో నేవర్ణమునకు లోపము వచ్చునో యీ సూత్రము స్పష్టపఱచుచున్నది. పై సూత్రమున 'సంయోగాన్తస్య' పదస్య (అనువర్తించినది) అను షష్ఠీ నిర్దేశముండుటచే "అలోఽన్త్యస్య అను ప్రకృతసూత్రము ప్రవర్తించి సంయోగాన్తమగు పదముయొక్క చివరి వర్ణమునకు మాత్రమే లోపమువచ్చునని సూత్రార్థమేర్పడుచున్నది.

ప్రకృతమున "సుద్ + ధ్ + య్" ఉపాస్యః అనుచోట "ద్ + ధ్ + య్" అనునది సంయోగము "సుద్ + ధ్ + య్" అనునది సంయోగాన్తమగు పదము కనుక ప్రకృతసూత్రముచే సంయోగాన్తమగు పదముయొక్క చివరివర్ణమునకు లోపమువచ్చునని పై సూత్రమునకర్థము చెప్పికొనుటచే నిట యకారమునకు లోపము వచ్చినచో సుద్ధ్యుపాస్యః అని కాక సుద్ధుపాస్యః అను అసాధురూపము కావలసియుండును. కనుక యకారలోపమును వారించుటకీ క్రింది వార్తికము చెప్పబడుచున్నది.

వార్తికము :- యణః ప్రతిషేధో వాచ్యః

యణ్ణునకు ప్రతిషేధము చెప్పవలెను.

సంయోగాన్తమగు పదము చివర యణ్ణు (య, వ, ర, లు) ఉన్నచో "సంయోగాన్తస్య లోపః" అను సూత్రముచే వచ్చు లోపమునకు ప్రతిషేధమును చెప్పవలెనని వార్తికార్థము. అనగా సంయోగాన్తమగు పదము చివర య, వ, ర, ల లున్నచో వానికి లోపమురాదని భావము. సుద్ + ధ్ + య్ + ఉపాస్యః అనుచోట పదాన్తమున యణ్ణు(యవర్ణము) ఉండుటచే లోపము రాక [1]సుద్ధ్యుపాస్యః అని యగును.

ఇట్లే

మధు + అరిః = [2]మధ్వరిః

ధాతృ + అంశః = [3]ధాత్రంశః

ఌ + ఆకృతిః = [4]లాకృతిః

అనుచోట్ల ప్రక్రియ నెఱుంగునది.

సూ :- ఏచోఽయవాయావః ౬-౧-౭౮

ప. వి :- ఏచః, అయవాయావః

వృ :- ఏచః క్రమాత్ అయ్, అవ్, ఆయ్, ఆవ్ ఏతే స్యుః అచి.

ఏచ్చునకు అచ్చు పరమగుచో క్రమముగా అయ్, అవ్, ఆయ్, ఆవ్ అనునవి ఆదేశములుగ వచ్చును.

---

1. పండితులచే సేవింపదగినవాడు.
2. మధువుయొక్క శత్రువు (విష్ణువు)
3. ధాతయొక్క అంశము
4 ఌకారముయొక్క ఆకారము.

ఏచ్చు అనగా ఏ, ఓ, ఐ, ఔలు. వీనికి అచ్చుపరమగుచో క్రమముగా అయ్ అవ్, ఆయ్, ఆవ్ అనునవి ఆదేశములుగ వచ్చును. క్రమముగా అనుటచే ఏకు అయ్, ఓకు అవ్, ఐకు ఆయ్, ఔకు ఆవ్ ఆదేశము లగునని భావము.

ఈ సూత్రమున కుదాహరణములు తరువాతిసూత్రము వివరణమున నిరూపింపబడును.

సూ :- యథాసంఖ్యమనుదేశః సమానామ్ ౧-౩-౧౦

ప. వి :- యథాసంఖ్యం, అనుదేశః, సమానామ్.

వృ :- సమసంబంధీ విధిః యథాసంఖ్యం స్యాత్, హరయే, విష్ణవే, నాయకః, పావకః.

సమానము సంబంధము గల విధి యథాసంఖ్యముగ వచ్చును.

పై సూత్రమున అయ్ మున్నగునవి క్రమముగా వచ్చునను సర్థ మెట్లు వచ్చినదో ఈ సూత్రమున వివరించుచున్నాడు.

ఒక వర్ణము స్థానమున వేఱొక వర్ణము కాని వర్ణసముదాయము కాని వచ్చుటచే తొలగిపోవు వర్ణము స్థాని యనబడును. ఒక వర్ణమును తొలగించి తత్స్థానమున వచ్చు వర్ణము కాని వర్ణసముదాయము కాని ఆదేశమనబడును. (యః నివర్త్యతే సః స్థానీ; యః నివర్తయతి సః ఆదేశః తొలగింపబడునది స్థాని. తొలగించునది ఆదేశము.)

ఈ స్థానులు మఱియు నాదేశములు ఏ సూత్రమున సమసంఖ్యలో నుండునో వానికి క్రమాన్వయమును చెప్పవలెను. ఏచోఽయవాయావః అను పై సూత్రమున ఏ, ఓ, ఐ, ఔ లు నాలుగు స్థానులు. అయ్, అవ్, ఆయ్, ఆవ్ అను నాలుగాదేశములు. ఈ స్థాన్యాదేశములు సమసంఖ్యలో నున్నవి కనుక పై సూత్రమున ఏకు అయ్, ఓకు అవ్, ఐకు ఆయ్, ఔకు ఆవ్ అనునవి ఆదేశములుగ వచ్చునని చెప్పవలెను.

హరయే :- (విష్ణువుకొఱకు) హరి యను ప్రాతిపదికముపై ఙే (ఏ) అను చతుర్థ్యేకవచనప్రత్యయమును పిదప గుణమును రాగా

హరే + ఏ అని యగును. పిదప "ఏచోఽయవాయావః" అను సూత్రముచే ఏకారస్థానమున 'అయ్' అను నాదేశము వచ్చి 'హరయే' అని యేర్పడును.

ఇట్లే విష్ణో + ఏ అనుచోట అవాదేశముచే విష్ణవే అనియు. నై + అకః అనుచోట అయాదేశముచే నాయకః అనియు. పౌ + అకః అనుచోట ఆవాదేశముచే పావకః అనియు పై సూత్రముచే సిద్ధించును.

సూ :- వాన్తో యి ప్రత్యయే ౬-౧-౭౯

ప వి:- వాన్తః, యి, ప్రత్యయే.

వృ :- యకారాదౌ ప్రత్యయే పరే ఓదౌతోః అవావౌ స్తః. గవ్యమ్; నావ్యమ్.

యకారమాదియందు గల ప్రత్యయము పరముగుచో ఓకార, ఔకారములకు అవ్, ఆవ్ అను నాదేశములు వచ్చును. గవ్యమ్, నావ్యమ్ అనునవి ఉదాహరణములు.

గవ్యమ్ :- గో శబ్దమునకు పరముగా "గోపయసోర్యత్" అను సూత్రముచే వికారార్థమున య (త్) ప్రత్యయము వచ్చి గో + య అని యుండగా గోలోని ఓకారమునకు య (త్) అను యకారాది ప్రత్యయము పరమగుటచే అవాదేశము వచ్చి 'గవ్యమ్' అని యేర్పడును.

నావ్యమ్ :- నౌ శబ్దమునకు పరముగా తార్యం (తరింప దగినది) అను నర్థమున "నౌవయోధర్మ" ఇత్యాది సూత్రముచే య (త్) ప్రత్యయము వచ్చి నౌ + య అని కాగా నౌ లోని ఔ కారమునకు య (త్) అను యకారాది ప్రత్యయము పరముండుటచే ఆవాదేశము వచ్చి నావ్యమ్ అని యేర్పడును.

గో + య అను చోట ఓకారమునకును, నౌ + య అనుచోట ఔకారమునకును అచ్చు పరముగా లేదు (య అను హల్లు పరముగా నున్నది) కనుక ఏచో ఽయవాయావః" అను సూత్రము ప్రవర్తించి అవ్, ఆవ్ అను నాదేశములు రావు. కనుక ప్రత్యేకముగా నీ సూత్రము చెప్పి ఇట అవ్, ఆవ్ అను నాదేశములను విధించుచున్నాడు.

వా :- అధ్వపరిమాణే చ

గవ్యూతిః

మార్గపరిమాణమను నర్థమున గో శబ్దమునకు యూతి శబ్దము పరముగా నున్నపుడు "గో" లోని ఓకారమునకు అవాదేశము వచ్చును.

గవ్యూతిః అనగా రెండు కోసుల దూరము. (గవ్యూతిః స్త్రీ క్రోశయుగమ్ అని అమరము) కనుక గో + యూతిః అను చోట మార్గపరిమాణమను నర్థముండుటచే (గో) లోని ఓకారమునకు అవాదేశము వచ్చి గవ్ + యూతిః = గవ్యూతిః అను రూపము సిద్ధించును.

విశేషము :- 'వాన్తో యి ప్రత్యయే' అను పై సూత్రముచే యకారాది యగు ప్రత్యయము పరముగా నున్నపుడే అవాదేశము విధింపబడినది. గో + యూతిః అనుచోటి యూతిః అనునది పదము. ప్రత్యయము కాదు. కనుక నా సూత్రముచే అవాదేశము రాకపోవుటచే వార్తికకారుడీ వార్తికముచే ప్రత్యేకముగా యూతిశబ్దము పరమగునపుడు అవాదేశమును విధించి 'గవ్యూతిః' అను రూపమును సాధించినాడు.

సూ :- అదేఙ్గుణః ౧-౧-౨

ప. వి :- అత్, ఏఙ్, గుణః.

వృ :- అత్ చ ఏఙ్ చ గుణసంజ్ఞః స్యాత్.

అతు మరియు ఏజ్ గుణమనబడును.

అత్ అనగా హ్రస్వమగు అకారము

(ఈ విషయము తరువాతి సూత్రమున వివరింపబడును.)

ఏజ్ అనగా ఏఓలు కనుక అ. ఎ. ఓ అను నీ మూడు వర్ణములకు గుణమని పేరు.

సూ :- తపర స్తత్కాలస్య ౧-౧-౭౦

ప. వి :- తపరః, తత్కాలస్య

వృ :- తః పరః యస్మాత్ స చ, తాత్పరశ్చ ఉచ్చార్యమాణసమకాలస్యైవ సంజ్ఞా స్యాత్.

తకారము పరమందు కలదియు, తకారమునకు పరమైనదియు నగు వర్ణము (అచ్చు) ఉచ్చరింపబడు సమకాలమునకే సంజ్ఞ యగును.

ఒక యచ్చునకు పూర్వమందు కాని, పరమందు కాని 'త్' అను వర్ణమున్నచో నట్టి యచ్చును సూత్రమున ఎట్లుచ్చరింప బడుచున్నదో అట్లే గ్రహింపవలెను. అనగా హ్రస్వముగ ఉచ్చరింపబడినచో హ్రస్వాచ్చును మాత్రమే. దీర్ఘముగ ఉచ్చరింపబడినచో దీర్ఘాచ్చును మాత్రమే గ్రహింపవలెనని భావము.

అదేఙ్గుణః అను పూర్వ సూత్రమున అత్ అను పదమునందలి అకారమునకు పరమందు త్ అను వర్ణము కలదు. అనగా నది తపరము కనుక ప్రకృత సూత్రముచే అకారమును సూత్రమున ఉచ్చరింపబడిన విధముగానే అనగా హ్రస్వ అకారముగానే గ్రహింపవలెను. హ్రస్వమగు అకారమే గుణముకాని దీర్ఘాకారము గుణముకాదు.

'అదేఙ్గుణః' అను సూత్రమున ఏజ్ అను పదము తకారమునకు పరమందున్నది. కనుక నిది (ఏజ్) తపరము. తపరమైన ఏజ్ సూత్రమున దీర్ఘముగ ఉచ్చరింపబడినది కనుక ఏజ్ పదముచే దీర్ఘములగు ఏ ఓలను మాత్రమే గ్రహింపవలెను. ప్లుతములను గ్రహింపరాదు.

కనుక దీర్ఘమగు ఏజ్జనకే (ఏ, ఓలకే) గుణసంజ్ఞ.

సూ :- ఆద్గుణః ౬-౧-౮౭

ప. వి :- ఆత్, గుణః

వృ :- అవర్ణాత్ అచి పరే పూర్వపరయోః ఏకః గుణః ఆదేశః స్యాత్, ఉపేన్ద్రః, గఙ్గోదకమ్.

అవర్ణమున కచ్చుపరమగుచో పూర్వ పరములకు గుణము ఏకాదేశమగును.

ఉపేన్ద్రః, గంగోదకమ్ అనునవి ఉదాహరణములు.

ఉపేన్ద్రః :- ఉప + ఇంద్రః, అనుచోట 'ప' కారముమీది అవర్ణమునకు 'ఇ' అను అచ్చు పరమగుటచే నీ రెండువర్ణముల స్థానమున 'ఏ' అను వర్ణము ఆదేశముగ వచ్చును. అవర్ణము, ఇవర్ణము వీని స్థానమున వచ్చు గుణము వాని (అవర్ణ, ఇవర్ణముల) స్థానసామ్యము కలదై ఉండవలెను. అకారము కంఠ్యము. ఇకారము తాలవ్యము. ఏకారము కంఠతాలవ్యము. కనుక నిట 'ఏ' వర్ణము ఏకాదేశమై ఉపేంద్రః అని యగును.

ఇట్లే గంగా + ఉదకమ్ అనుచోట అకార, ఉకారముల స్థానమున గుణమగు ఓకారమేకాదేశముగ వచ్చి "గంగోదకమ్" అని యేర్పడును.

సూ :- ఉపదేశేఽ జనునాసిక ఇత్. ౧-౩-౨

ప. వి :- ఉపదేశే, అచ్, అనునాసికః, ఇత్.

వృ :- ఉపదేశే అనునాసికః అచ్ ఇత్సంజ్ఞః స్యాత్. ప్రతిజ్ఞాతాను నాసిక్యాః పాణినీయాః. లణ్ సూత్రస్థావర్ణేన సహోచ్చార్యమాణో రేఫో రలయోః సంజ్ఞా.

ఉపదేశమున అనునాసికమైన అచ్చు ఇత్సంజ్ఞకమగును. పాణిని శిష్యులు ప్రతిజ్ఞాతాను నాసిక్యులు. 'లణ్' సూత్రమందున్న అవర్ణముతో నుచ్చరింపబడు రేఫము 'రల'లకు సంజ్ఞయగును.

వివ :- ధాతువులు, సూత్రములు మున్నగునవి ఉపదేశములని ముందు తెలుపబడినది. వీనిలో అనునాసికమగు అచ్చు ఇత్సంజ్ఞకమగును.

ఉపదేశములగు నీ ధాతు సూత్రాదులలోనున్న అచ్చులు అనునాసికములా ? కావా ? అను విషయమును పాణిని శిష్యుల వ్యవహారమును బట్టియే గ్రహింపవలెను.

'లణ్' అను మాహేశ్వరసూత్రమున లకారముమీది అకారము ఇత్సంజ్ఞకమని మాహేశ్వర సూత్రముల వివరణమున తెలుపబడినది. ఆ అకారమునకు ఇత్సంజ్ఞ యీ సూత్రముచేతనే సిద్ధించుచున్నది. ఏలనన 'లణ్' అనునది సూత్రమగుటచే ఉపదేశమైనది. పాణినీయుల వ్యవహారమున నీ సూత్రమందలి లకారముమీది అకారమునకు ఇత్సంజ్ఞ సిద్ధించినది. కనుకనే ఇత్సంజ్ఞకమగు నీ అకారముతోకూడిన రేఫము 'ర' అను ప్రత్యాహారమై రేఫ లకారములకు సంజ్ఞయగును. 'ర' అని యున్నచో రేఫముతోబాటు లకారముగూడ గ్రహింపబడును.

సూ :- ఉరణ్ రపరః ౧-౧-౫౧

ప. వి :- ఉః, అణ్, రపరః

వృ :- ఋ ఇతి త్రింశతః సంజ్ఞా ఇత్యుక్తమ్. తత్స్థానే యః అణ్ సః రపరః సన్నేవ ప్రవర్తతే. కృష్ణర్ధిః, తవల్కారః.

వివ :- ఈ సూత్రమందలి 'ఉః' అనునది 'ఋ' శబ్దము యొక్క షష్ఠ్యేకవచన రూపము. ఉః అనగా ఋ వర్ణము యొక్క అని యర్థము. ఋ వర్ణమునకు 18 భేదము లనియు, ఌ వర్ణమునకు దీర్ఘము లేకపోవుటచే 12 భేదములనియు, ఋ, ఌ వర్ణములు సవర్ణము లగుటచే ఋ కారమునకు ముప్పది భేదములని సంజ్ఞా ప్రకరణమున

తెలుపబడినది. అణ్ ప్రత్యాహారముచే నిట అ, ఇ, ఉ అను మూడు వర్ణములు గ్రహింపబడును. ఏవంచ ఋ వర్ణస్థానమున వచ్చు అణ్ణు (అ, ఇ, ఉ లు) అర్, ఇర్, ఉర్ అని రపరములుగా వచ్చునని భావము. ప్రకృతసూత్రమున రపరః అను చోటి 'ర' అను దానిని ప్రత్యాహారముగ గ్రహించినచో ల పరముగ అను నర్థమును వచ్చును. అనగా అల్, ఇల్, ఉల్ ఇత్యాదిగా వచ్చునని భావము.

ఋకార స్థానమున వచ్చు అణ్ణు (అ ఇ ఉ లు) ర పరముగను ౡకార స్థానమున వచ్చు అణ్ణు (అ ఇ ఉ లు) ల పరముగను వచ్చునని సూత్రార్థము. క్రింది ఉదాహరణములలో నీ సూత్రసమన్వయమును చూడనగును.

కృష్ణర్ధిః:- (కృష్ణుని సమృద్ధి) కృష్ణ + ఋద్ధిః అను చోట అ వర్ణమునకు ఋ కారము పరమగుటచే 'అదేఙ్గుణః' అను సూత్రముచే పూర్వపరముల (అకార ఋకారముల) స్థానమున వచ్చు 'అ' అను గుణము ర పరముగ ఆదేశమై కృష్ణ్ + అర్ + ద్ధిః = కృష్ణర్ధిః అను రూప మేర్పడును.

తవల్కారః :- (నీ ౡకారము) తవ + ౡకారః అను చోట 'అ' అను గుణము ౡకార స్థానమున వచ్చుటచే ల పరముగ ఆదేశమై తవ్ + అల్ + కారః (తవల్కారః) అను రూప మేర్పడును.

సూ :- లోపశ్శాకల్యస్య ८-३-१९

ప. వి :- లోపః, శాకల్యస్య.

వృ :- అవర్ణపూర్వయోః పదాన్తయోః యవయోః లోపః వా అశి పరే.

పదాన్తమున నున్నవియు, అవర్ణము పూర్వమందు కలవియు అగు యకార వకారములకు అశ్ను పరముగ నున్నపుడు లోపము వికల్పముగా వచ్చును.

హరే + ఇహ అను చోట 'ఏచో ఽ యవాయావః' అను సూత్రముచే రే లోని ఏ కారమునకు అయాదేశము వచ్చి హరయ్ + ఇహ అని యగును. ఇట యకారము పదాన్తము. దీనికి పూర్వము అకార ముండుటచే నిది అవర్ణ పూర్వకము కూడ. మఱియు అశ్శు (ఇకారము) పరమందున్నది. కనుక నీ సూత్రముచే యకారము లోపించి 'హర ఇహ' అను రూపమేర్పడును.

ఈ యకారలోపము వికల్పమగుటచే యకారలోపము రాని పక్షమున హరయ్ + ఇహ = హరయిహ అను రూప మేర్పడును.

సూ :- పూర్వత్రాసిద్ధమ్ ८-२-१

ప. వి :- పూర్వత్ర, అసిద్ధమ్.

వృ :- సపాద సప్తాధ్యాయీం ప్రతి త్రిపాదీ అసిద్ధా, త్రిపాద్యామపి పూర్వం ప్రతి పరం శాస్త్రం అసిద్ధం స్యాత్.

సపాద సప్తాధ్యాయిని గూర్చి త్రిపాది అసిద్ధమగును. త్రిపాది యందును పూర్వశాస్త్రమును గూర్చి పరశాస్త్రము అసిద్ధమగును.

పాణినిరచితమగు అష్టాధ్యాయీగ్రంథమున ఎనిమిది అధ్యాయములును, ప్రతి యధ్యాయమున నాలుగు పాదములును కలవు మొదటి ఏడధ్యాయములును ఎనిమిదవ అధ్యాయములోని మొదటిపాదమును కలిసి సపాదసప్తాధ్యాయి యనబడును. ఎనిమిదవ యధ్యాయములో రెండు, మూడు, నాలుగు పాదములు త్రిపాది యనబడును.

సపాదసప్తాధ్యాయిలోనున్న సూత్రమును ప్రవర్తింప జేయునపుడు త్రిపాదిలోని సూత్రము అసిద్ధమగును. అనగా త్రిపాదీ సూత్రము ప్రవర్తింపనట్లుగ భావింపబడెను. ఇట్లే త్రిపాదియందును పూర్వ సూత్రమును ప్రవర్తింప జేయునపుడు పరసూత్రము అసిద్ధమగును. అనగా త్రిపాదిలోని పరసూత్రము ప్రవర్తింపనట్లుగ భావింపబడెను.

'లోపః శాకల్యస్య' అను సూత్రము వివరణమున హర ఇహ అను రూపము సాధింపబడినది. ఈ రూపమున రేఫము మీది అవర్ణమునకు అచ్చు పరమందుండుటచే "ఆద్గుణః" అను సూత్రముచే గుణము రావలసివచ్చును. గుణమే వచ్చినచో 'హరేహ' అను అసాధురూప మేర్పడును. కనుక ప్రకృత సూత్రము చెప్పబడినది.

'ఆద్గుణః' (6-1-87)అను సూత్రము ఆఱవ అధ్యాయములోనిది. అనగా సపాదసప్తాధ్యాయిలోనిది. లోపః శాకల్యస్య (8. 3-19) అను సూత్రము ఎనిమిదవ యధ్యాయము మూడవ పాదములోనిది. అనగా త్రిపాది లోనిది. హర ఇహ అను చోట సపాదసప్తాధ్యాయిలోని 'ఆద్గుణః' అను సూత్రముచే గుణము ప్రాప్తింపగా త్రిపాదిలోని లోపః శాకల్యస్య అను సూత్రముచే వచ్చిన యకార లోపము అసిద్ధమగును. అనగా అకార ఇకారముల మధ్యలో యకారమున్నట్లగును. కనుక హర + ఇహ అను చోట యకారముతో వ్యవధానమున్నట్లు భావింపబడుటచే గుణము రాక హర ఇహ అను రూపమే కాని హరేహ అను రూప మేర్పడదు.

సూ :- వృద్ధి రాదైచ్ ౧-౧-౧

ప. వి :- వృద్ధిః, అదైచ్

వృ :- ఆదైచ్చ వృద్ధి సంజ్ఞః స్యాత్.

ఆత్ మఱియు ఐచ్చు వృద్ధి సంజ్ఞకములగును.

ఆత్ అనగా దీర్ఘమైన ఆకారము. ఐచ్ అనగా ఐ ఔ లు. ఈ మూడు వర్ణములకు (ఆ, ఐ, ఔ లకు) 'వృద్ధి' యని పేరు.

సూ :- వృద్ధి రేచి ౬-౧-౮౮

ప. వి :- వృద్ధిః, ఏచి.

వృ :- ఆదేచి పరే వృద్ధి రేకాదేశః స్యాత్. గుణాపవాదః.

అవర్ణమునకు ఏచ్చు (ఏ, ఓ, ఐ, ఔ లు) పరమగునపుడు పూర్వ పరములకు వృద్ధి ఏకాదేశముగ వచ్చును. ఇది గుణమునకు అపవాదము.

కృష్ణైకత్వమ్ :- (కృష్ణుని ఏకత్వము) కృష్ణ+ఏకత్వమ్ అను చోట ష్ణలోని అవర్ణమునకు ఏచ్చు (ఏకారము) పరమగుటచే పూర్వ పరములకు (అ, ఏ లకు) వృద్ధి (ఐ కారము) ఏకాదేశమై కృష్ణైకత్వమ్ అను రూప మేర్పడును.

ఇట్లే

గంగా + ఓఘః = [1]గంగౌఘః
దేవ + ఐశ్వర్యమ్ = [2]దేవైశ్వర్యమ్
కృష్ణ + ఔత్కంఠ్యమ్ = [3]కృష్ణౌత్కంఠ్యమ్

అను చోట్ల ప్రకృతసూత్రముచే వృద్ధి ఏకాదేశమై ఆ యా రూపములు సిద్ధించును.

కృష్ణ+ఏకత్వమ్ మున్నగు వృద్ధి రావలసినచోట్ల ఆద్గుణః అను సూత్రముచే గుణము వచ్చుచుండగా నీ సూత్రముచే వృద్ధిని విధించుటచే నిది గుణసూత్రమునకు [4]అపవాదము. అనగా దానిని రానీయక ఇదియే ప్రవర్తించునని భావము.

సూ :- ఏత్యేధత్యూఠ్సు ౬-౧-౮౯

ప. వి :- ఏత్యేధత్యూఠ్సు.

1. గంగా ప్రవాహము.
2. దేవతల ఐశ్వర్యము.
3. కృష్ణుని కొఱకు ఉత్కంఠ.
4. యేన నాప్రాప్తే యో విధి రారభ్యతే స తస్యాపవాదః.

వృ ః- అవర్ణాత్ ఏజాద్యో రేత్యేధత్యోరూఠి చ పరే వృద్ధిః ఏకాదేశః స్యాత్. ఉపైతి, ఉపైధతే, ప్రష్ఠౌహః.

అవర్ణమునకు ఏచ్(ఏ.ఓ.ఐ.ఔలు) ఆదియందుకల [1]ఏతి. [2]ఏధతి ధాతువులు కాని ఊఠ్ కాని పరమగుచో వృద్ధి ఏకాదేశముగ వచ్చును.

ఇట పరమందుండు ఏతి, ఏధతి ధాతువులు ఏజాదులుగ నుండ వలెను. అనగా ఆ ధాతువుల తొలుత ఏచ్చు (ఏ, ఓ, ఐ, ఔ లు) ఉండ వలెను. ఊఠ్ అను నది 'వాహ ఊఠ్' అను సూత్రముచే వాహ శబ్దము లోని వకారస్థానమున విధింపబడునది (ప్రష్ఠ+వాహ అను చోట వకార స్థానమున ఊః (ఠ్) వచ్చి ప్రష్ఠ+ఊహ అని యగును)

ఏవంచ ఏ, ఓ, ఐ, ఔ లు ఆదియందు కల ఏతి, ఏధతి ధాతువులు కాని, ఊఠ్ కాని, పరమందున్నపుడు పూర్వపరములకు వృద్ధి ఏకాదేశముగవచ్చునని సూత్రార్థము తేలినది. సూత్రమునందలి ఏజాద్యోః (ఏచ్ ఆదియందుకల) అనువిశేషణము ఏతి, ఏధతి ధాతువులకు మాత్రమే అన్వయించును. ఊఠ్‌కు అన్వయింపదు. కనుక ఏతి, ఏధతి ధాతువులు మాత్రమే ఏజాదులుగ నుండవలెను. కాని ఊఠ్ ఏజాదిగ నుండ నవసరములేదు.

ఉపైతి :- (దగ్గఱకు వచ్చుచున్నాడు) ఉప+ఏతి అను చోట పకారము మీది అకారమునకు ఏజాదియగు ఏతి ధాతువు పరమందుండుటచే పూర్వ పరములకు (అ – ఏలకు) వృద్ధి (ఐకారము) ఏకాదేశమై. ఉపైతి అను రూప మేర్పడును.

ఉపైధతే :- (సమీపమున వృద్ధిపొందుచున్నది) ఉప+ఏధతే అనుచోట పకారము మీది అవర్ణమునకు ఏజాదియగు ఏధతి ధాతువు పరమం

---

1. ఇణ్ = గతౌ. 2. ఏధ = వృద్ధౌ

దుండుటచే పూర్వ పరములకు (అ, ఏ లకు) వృద్ధి (ఐకారము) ఏకాదేశమై ఉపైధతే అని యగును.

వృ :- ఏజాద్యోః కిమ్ ? ఉపేతః, మా భవాన్ ప్రేదిధత్.

సూత్రార్థమున ఏజాద్యోః అను పదమెందులకు ? ఉపేతః (మా భవాన్) ప్రేదిధత్ అను చోట్ల అసాధురూపములు ఏర్పడకుండుట కొఱకు.

ఏతి, ఏధతి ధాతువులు ఏజాదులుగనే యుండును కదా ? అవి ఏజాదులుగ నుండవలెనని ప్రత్యేకముగా చెప్పుట యెందులకు ? అను నాశంక కలుగును. దానికిట్లు సమాధానము చెప్పవలెను. సూత్రార్థమున 'ఏజాద్యోః' (ఏజాదులైన) అను విశేషణము లేనిచో ఏతి, ఏధతి ధాతువులు పరమగునపుడు వృద్ధి వచ్చునని మాత్రమే సూత్రార్థము వచ్చును. అట్లైనచో ఉప + ఇతః అను చోటను వృద్ధిరావలసి వచ్చును. ఎట్లన ఇతః అనునదియు 'ఏతి' ధాతువునుండి పుట్టినరూపమే యగుటచే నది ఏతి ధాతువే. కనుక ఉప + ఇతః అనుచోట అవర్ణమునకు ఏతి ధాతువు పరమందుండుటచే వృద్ధివచ్చి ఉపైతః అను అసాధురూపమేర్పడవలసి వచ్చును కావున సూత్రార్థమున 'ఏజాద్యోః' అను విశేషణమును చెప్పవలెను. అప్పుడు ఏతి, ఏధతి ధాతువులు ఏజాదులుగ నున్నపుడే వృద్ధి వచ్చును. ఉప + ఇతః అను చోట ఇతః అనునది ఏతి ధాతువేయైనను ఏజాదికాదు. కనుక వృద్ధిరాక గుణమే వచ్చి ఉపేతః అని యేర్పడును.

ఇట్లే 'మా భవాన్ ప్రేదిధత్' అను వాక్యములోని ప్రేదిధత్ అను పదమును విడదీసిన ప్ర + ఇదిధత్ అని యుండును. ఇట ఇకారమునకు ఇదిధత్ అను ఏధతి ధాతువు రూపమే పరమందున్నను అది ఏజాదికాక పోవుటచే (ఇకారాది కనుక) వృద్ధి రాదు. గుణమే వచ్చి ప్రేదిధత్ అని యగును.

ప్రష్ఠౌహః :- ప్రష్ఠవాహ అను చోట 'వాహ ఊఠ్' అను సూత్రముచే వకారమునకు ఊః (ఠ్) వచ్చి ప్రష్ఠ + ఊహ అని యగును. ఇట అవర్ణమునకు ఊఠ్ పరమందుండుటచే పూర్వ పరములకు (అకార, ఊకారములకు) వృద్ధి (ఔకారము) ఏకాదేశమై ప్రష్ఠౌహః అను రూపమేర్పడును.

వృ :- పరరూపగుణాపవాదః.

ఈ సూత్రము పరరూపమునకును, గుణమునకును అపవాదము. అపవాదమనగా ఒక సూత్రము తప్పక రావలసియుండగా దానిని రానీయక విధింపబడు కార్యము. (యేన నా ప్రాప్తే యో విధి రారభ్యతే స తస్యాపవాదః)

ఉప + ఏతి, ఉప + ఏధతే అను చోట్ల పరరూపమును, (అకార ఏకారముల స్థానమున ఏకారమే ఆదేశమగుట) ప్రష్ఠ + ఊహః అను చోట గుణమును రావలసియుండగా వానిని రానీయక ఈ సూత్రముచే వృద్ధి విధింపబడినది. కనుక నీ వృద్ధి పరరూపమునకును, గుణమునకును అపవాదమని భావము.

వా :- అక్షాదూహిన్యా ముపసంఖ్యానమ్.

ప. వి :- అక్షాత్, ఊహిన్యాం, ఉపసంఖ్యానమ్.

అక్ష శబ్దమునకు ఊహినీశబ్దము పరమగుచో వృద్ధిని చెప్పవలెను. [1]అక్షౌహిణీ :- (సేనా) అక్ష + ఊహినీ అను చోట అక్ష శబ్దమునకు ఊహినీ శబ్దము పరమగుటచే పూర్వపరములకు (అకార ఊకారములకు)

1.

ఏనుగులు...	21870	ఇట్టి సంఖ్యగల సేనను
రథములు...	21870	అక్షౌహిణీ అని
గుఱ్ఱములు...	65610	యందురు.
పదాతులు...	109350	
మొత్తము	218700	

వృద్ధి (ఔకారము) ఏకాదేశమై ఊహిని నకారమునకు ణకార మాదేశమై అక్షౌహిణీ అను రూప మేర్పడును.

వా :- ప్రాదూహోఢోఢ్యేషైష్యేషు

ప. వి :- ప్రాత్, ఊహోఢోఢ్యేషైష్యేషు.

ప్ర అను ఉపసర్గకు ఊహ, ఊఢ, ఊఢి, ఏష, ఏష్య అను పదములు పరమగునపుడు పూర్వపరములకువృద్ధిని చెప్పబడెను.

ప్రౌహః :- (ఉత్కృష్టమైన తర్కము) ప్ర + ఊహః అనుచోట ప్ర అను నుపసర్గకు ఊహ అను శబ్దము పరమందుండుటచే నీ వార్తికముచే వృద్ధి వచ్చి ప్రౌహః అని యగును.

ఇట్లే ప్ర + ఊఢః = ప్రౌఢః (పెద్దవాడు)
ప్ర + ఊఢిః = ప్రౌఢిః (పెద్దతనము)
ప్ర + ఏషః = ప్రైషః (ప్రేరణ)
ప్ర + ఏష్యః = ప్రైష్యః (సేవకుడు)

అను రూపములును ఈ వార్తికముచే సాధింపనగును.

వా :- ఋతే చ తృతీయాసమాసే.

తృతీయాతత్పురుషసమాసమున అవర్ణమునకు ఋత అనుశబ్దము పరమగునపుడు పూర్వపరములకు వృద్ధి ఏకాదేశముగ వచ్చును.

సుఖార్తః :- (సుఖముతో కూడినవాడు—సుఖి)

సుఖేన ఋతః అని విగ్రహము. కనుక నిది తృతీయా తత్పురుషము. సుఖ + ఋతః అనుచోట ఖకారముమీది అకారమునకు ఋత అను శబ్దము పరమగుటచే వృద్ధి (ఆకారము) రపరముగ (ఆర్ అను రూపమున) ఏకాదేశమై సుఖార్తః అని యగును.

ప్ర :- తృతీయేతి కిమ్ ? పరమర్తః

వార్తికమున 'తృతీయా' అను పదము పరమర్తః అనుచోట అసాధురూపము ఏర్పడకుండుట కొఱకు.

ఈ వార్తికమున 'తృతీయా' అను పదములేనిచో అవర్ణమునకు ఋత అను శబ్దముపరమగునపుడు సమాసమున వృద్ధివచ్చునని వార్తికార్థము ఏర్పడును. ఇట్లు చెప్పినను (తృతీయాఅను పదమును చెప్ప కున్నను) సుఖార్తః అను రూపము సిద్ధించుచుండగా 'తృతీయా' అను పదము వార్తికమున వ్యర్థముకదా ? యను నాశంక కలుగును. వార్తికమున తృతీయా అనుపదము లేనిచో పరమ + ఋతః అనుచోటను వృద్ధి వచ్చి పరమార్తః అను అసాధురూప మేర్పడును ఎట్లన పరమ + ఋతః అనునది పరమశ్చాసౌ ఋతశ్చ అని విగ్రహవాక్యమును చెప్పుటచే కర్మధారయసమాసము. వార్తికమున తృతీయా అనుపదములేనిచో పరమ + ఋతః అను కర్మధారయసమాసస్థలమునను వృద్ధిరావలసివచ్చును. వార్తికమున 'తృతీయా' అను పదమును చెప్పినచో పరమ + ఋతః అనుచోట అవర్ణమునకు ఋతశబ్దము పరముగానున్నను ఇది తృతీయా తత్పురుషముకాదుకనుక వృద్ధిరాదు. గుణమేవచ్చి పరమర్తః అను రూప మేర్పడును.

వా :- ప్ర. వత్సతర. కమ్బల. వసనా. ర్ణ. దశానాం ఋణే.

ప్ర, వత్సతర, కమ్బల, వసన, ఋణ, దశ అను నీయారు శబ్దములకు ఋణ అనుశబ్దము పరమగుచో వృద్ధి ఏకాదేశముగవచ్చును.

ప్రార్ణమ్ :- (ఎక్కువ ఋణము) ప్ర + ఋణమ్ అనుచోట ప్ర అను శబ్దమునకు ఋణశబ్దము పరమగుటచే ప్రస్తుతవార్తికముచే పూర్వ పరములకు (అకార, ఋకారములకు) వృద్ధి (ఆకారము) రపరముగ ఏకాదేశమై ప్రార్ణమ్ అనురూప మేర్పడును.

ఇట్లే

1) వత్సతర + ఋణమ్ = [1]వత్సతరార్ణమ్
2) కమ్బల + ఋణమ్ = [2]కమ్బలార్ణమ్
3) వసన + ఋణమ్ = [3]వసనార్ణమ్
4) ఋణ + ఋణమ్ = [4]ఋణార్ణమ్
5) దశ + ఋణమ్ = [5]దశార్ణమ్

అను రూపములు సిద్ధించును.

ఈ రూపము లన్నిటియందు 'అద్గుణః' అనుసూత్రముచే గుణము ప్రాప్తింపగా దానికి బాధకముగా ఈ వార్తికముచే వృద్ధి విధింప బడినది.

సూ :- ఉపసర్గాః క్రియాయోగే ౧-౪-౫౯.

---

1. చిన్న దూడకొఱకైన ఋణము.
2. గొంగడి కొఱకైన ఋణము.
3. వస్త్రము కొఱకైన ఋణము.
4. ఋణమును తీర్చుట కొఱకు చేసిన ఋణము.
5. ఒక దేశము పేరు.

ప. వి :- ఉపసర్గాః, క్రియాయోగే

వృ : ప్రాదయః క్రియాయోగే ఉపసర్గ సంజ్ఞాః స్యుః.

ప్ర, పరా, అప, సమ్, అను, అవ, నిస్ నిర్, దుస్, దుర్, వి, ఆఙ్, ని, అధి, అపి, అతి, సు, ఉత్, అభి, ప్రతి, పరి, ఉప ఏతే ప్రాదయః ద్వావింశతిః.

ప్రాదులు క్రియాయోగమున ఉపసర్గ సంజ్ఞకములగును. ప్ర, పరా, అప, అను మొ॥ పై యిఱువది రెండును ప్రాదు లనబడును.

వివ :- పైన చెప్పబడిన 'ప్ర' మున్నగు యిఱువది రెండు పదములును క్రియాపదములతో కలిసినపుడు ఉపసర్గ లనబడును. ప్రభవతి, పరాభవతి, అను చోట్ల ప్ర, పరా అనునవి భవతి అను క్రియతో కలిసి యుండుటచే నివి (ప్ర, పరా అనునవి) ఉపసర్గములైనవి. ఇట్లే మిగిలిన ప్రాదులును క్రియాపదములతో కలిసినపుడు ఉపసర్గ సంజ్ఞకము లగునని తెలియునది. ప్రాదులు క్రియలతో కలిసి యుండక వ్యస్తముగా (విడిగా) ప్ర, పరా ఇత్యాది రీతిగ నున్నచో నవి ఉపసర్గలు కావు.

సూ :- భూవాదయో ధాతవః ౧-౩-౧

ప. వి :- భూవాదయః, ధాతవః.

వృ :- క్రియావాచినః భ్వాదయః ధాతు సంజ్ఞాః స్యుః

క్రియలను తెలుపునట్టి భూ మున్నగునవి ధాతువు లనబడును.

వివ :- పాణిని ప్రోక్తమగు ధాతుపాఠమున అనేకధాతువులు పఠింప బడినవి. వానిలో మొదటిది 'భూ' ధాతువు. ఇట్టి భూ మున్నగు నవి క్రియలను తెలిపినచో ధాతువులనబడును భూ అనునది సత్త (ఉనికి) అను క్రియను తెలుపుటచే ధాతువు. ఇట్లే భ్వాదులలో చేరిన వా అనునది వీచుట అను క్రియను తెలుపుటచే ధాతువగును.

భూమి అను నర్థమును తెలుపు 'భూ' అను శబ్దమును, వికల్ప మను నర్థమును తెలుపు వా అను శబ్దమును క్రియలను తెలుపునట్టివి కానందున నవి భ్వాదులలో నున్నను ధాతువులు కావు భూమి మరియు వికల్పము అను నర్థములు క్రియలు కావుకదా ?

సూ :- ఉపసర్గాదృతి ధాతౌ ౬-౧-౯౧

ప. వి :- ఉపసర్గాత్, ఋతి, ధాతౌ.

వృ :- అవర్ణాన్తా దుపసర్గాత్ ఋకారాదౌ ధాతౌ పరే వృద్ధిః ఏకాదేశః స్యాత్.

విప :- అకారాన్తమగు ఉపసర్గకు ఋకారాది యగు ధాతువు పరమగు నపుడు పూర్వ పరములకు (అకార ఋకారములకు) వృద్ధి ఏకాదేశ మగును.

ప్రార్ఛతి :- (పోవుచున్నాడు) ప్ర + ఋచ్ఛతి అను చోట ప్ర అనునది ఋచ్ఛతి అను క్రియతో కలిసి యుండుటచే ఉపసర్గ యగును. ఋచ్ఛతి అనునది క్రియావాచకమగుట చేతను, భ్వాదులయం దుండుటచేతను ధాతువగును. ప్ర అను అకారాన్తమగు ఉపసర్గకు ఋచ్ఛతి అను ఋకారాది యగు ధాతువు పరమగుటచే పూర్వ పరము లకు (అకార ఋకారములకు) వృద్ధి (ఆకారము) ర పరముగ ఆదేశమై ప్రార్ఛతి అను రూప మేర్పడును.

సూ :- ఏఙి పరరూపమ్ ౬-౧-౯౪

ప. వి :- ఏఙి. పరరూపమ్.

వృ :- ఆదుపసర్గాత్ ఏఙాదౌ ధాతౌ పరే పరరూపం ఏకాదేశః స్యాత్. **ప్రేజతే. ఉపోషతి.**

అ వర్ణాన్తమగు ఉపసర్గకు ఏఙ్ (ఏ, ఓలు) ఆదియందు కల ధాతువు పరమగునప్పుడు పరరూపము ఏకాదేశ ముగ వచ్చును.

ప్రేజతే :- (మిక్కిలి కదలుచున్నది) ప్ర + ఏజతే అను చోట ప్ర అను అవర్ణాన్తమగు ఉపసర్గకు ఏజతే అను ఏజాది (ఏకారాది) యగు ధాతువు పరమగుటచే పరరూపము (ఏకారము) ఏకాదేశముగ వచ్చి 'ప్రేజతే' అని యగును. పరరూపమనగా పూర్వ పరాచ్చుల స్థానమున పరాచ్చు ఏకాదేశమగుట. ఈ పరరూపము తెనుగు వ్యాకరణములోని పారిభాషికపదమగు సంధి వంటిది.

ఉపోషతి :- (కాల్చుచున్నాడు) ఉప + ఓషతి అనుచోట పై వలెనే ఉప అను ఉపసర్గకు ఓషతి అను ఏజాది (ఓకారాది) యగు ధాతువు పరమగుటచే పూర్వ పరములకు (అకార ఓకారములకు) పరరూపము (ఓకారము) ఏకాదేశమై ఉపోషతి అను రూప మేర్పడును.

సూ :- అచోఽన్త్యాది టి ౧-౧-౬౪

ప వి :- అచః, అన్త్యాది. టి.

వృ :- అచాం మధ్యే యః అన్త్యః స ఆదిర్యస్య తత్ టిసంజ్ఞం స్యాత్.

అచ్చులలో నేది చివరి యచ్చో అది యాది యందుగలది టి యనబడును.

వివ :- ఒక పదములో అనేకములగు అచ్చులున్నపుడు వానిలో చివరి యచ్చు మొదలుకొని మిగులు భాగము 'టి' యనబడును. ఉదాహరణమునకు మనస్ అను పదమును తీసికొనుడు. ఇట మకారము మీద నొక యచ్చును, నకారము మీద నొక యచ్చును కలవు. వీనిలో నకారము మీది అకారము చివరి యచ్చు. అది మొదలుకొని మిగులు భాగము (అస్ అనునది) టి అనబడును. శక, కర్క మున్నగు అజంత శబ్దములలో చివరనుండునది అచ్చే కనుక అది మాత్రమే టి యగును.

వా :- శకన్ధ్వాదిషు పరరూపం వాచ్యమ్

తచ్చ టేః.

శకన్ధు మున్నగు పదములలో పరరూపమును చెప్పవలెను. ఈ పరరూపము శక మున్నగు పూర్వపదములలోని టి కి వచ్చును.

మనీషా :- (బుద్ధి) ఈ పదము శకన్ధ్వాది గణములో నుండుటచే మనస్ + ఈషా అను చోట ప్రకృతవార్తికముచే మనస్ శబ్దములోని టి కి (అస్ అనుదానికి) పరరూపము (ఈకారము) ఆదేశముగ వచ్చి మనీషా అను రూప మేర్పడును.

ఇట్లే

శక + అన్ధుః = [1]శకన్ధుః

కర్క + అన్ధుః = [2]కర్కన్ధుః

లాంగల + ఈషా = [3]లాంగలీషా

మార్త + అండః = [4]మార్తండః అనుచోట్ల నీ వార్తికముచే టి కి పరరూపమును చెప్పి ఆ యా రూపములను సాధింపవలెను.

---

1. శకదేశము నందలి నూయి. 2. రేగుచెట్టు.
3. నాగటి యేడి కోల. 4. సూర్యుడు.

సూ :- ఓమాఙోశ్చ ౬-౧-౯౫

ప. వి :- ఓమాఙోః, చ

వృ :- ఓమి, ఆఙి చ ఆత్ పరే పరరూపం ఏకాదేశః స్యాత్ - శివాయోన్నమః, శివ + ఏహి.

అవర్ణమునకు ఓమ్ అనునది కాని, ఆఙ్ అనునది కాని పరమగుచో పూర్వపరములకు పరరూపము ఏకాదేశమగును.

శివాయోన్నమః :- (శివునికొఱకు నమస్కారము)

శివాయ + ఓన్నమః అనుచోట యకారముమీది అకారమునకు ఓమ్ అనునది పరమందుండుటచే పూర్వపరాచ్చులకు (అ. ఓలకు) పరరూపము (ఓకారము) ఏకాదేశమై 'శివాయోన్నమః' అని యేర్పడును.

శివ + ఏహి (ఓ శివా! రమ్ము) ఇహి అను క్రియాపదమునకు ఆ(ఙ్) అను నుపసర్గను చేర్చగా గుణమువచ్చి ఏహి అని యగును. శివ + ఏహి అనుచోట ప్రకృతసూత్రముచే పూర్వపరవర్ణములకు (అ. ఏ. లకు) పరరూపమేకాదేశముగ వచ్చి 'శివేహి' అని కావలయును. కాని శివ + ఏహి అనుచోట వకారముమీది అకారమున్నను దానికి పరమందు ఆఙ్ పరముగా లేదు. (గుణము ఏకాదేశమగుటచే) కనుక ఏహిలోని ఏకారమున ఆఙ్త్వమును సాధించుట అవసరము. కనుక నీ క్రిందిసూత్రమును చెప్పుచున్నాడు

సూ :- అన్తాదివచ్చ. ౬-౧-౮౫

ప. వి :- అన్తాదివత్, చ.

వృ :- యోఽయమేకాదేశః స పూర్వస్య అన్తవత్ పరస్య ఆదివచ్చ స్యాత్.

ఏ వర్ణ మేకాదేశముగ వచ్చునో అది పూర్వమునకు అన్తము వలెను, పరమునకు ఆదివలెను అగును.

ఏకాదేశము రాకపూర్వము పూర్వసముదాయమునకాని, పరసముదాయమునకాని ఉండిన ధాతుత్వము, ప్రాతిపదికత్వము, సుబన్తత్వము, నిపాతత్వము మున్నగు వ్యవహారములు ఏకాదేశము వచ్చినపిదపను ఉండునని సూత్రతాత్పర్యము. అ+ఇహి అనుచోట ఏకాదేశమగు గుణము రాకపూర్వము అ అను పూర్వసముదాయమున అజ్త్వవ్యవహారము కలదు. గుణమేకాదేశముగవచ్చినను పిదపను (ఏహి అని యేర్పడిన పిదపను) ఏ అను ఏకాదేశవిశిష్టమగు వర్ణమున అజ్త్వవ్యవహారము ఈ సూత్రముచే సిద్ధించును. కనుక శివ+ఏహి అనుచోట 'ఏ'లో అజ్ ఉండుటచే పై సూత్రముచే పరరూప మేకాదేశమై శివేహి అను రూపమేర్పడును

సూ :- అకః సవర్ణే దీర్ఘః ౬-౧-౧౦౧

ప వి :- అకః, సవర్ణే, దీర్ఘః.

వృ :- అకః సవర్ణే అచి పరే పూర్వపరయోః దీర్ఘ ఏకాదేశః స్యాత్.

అక్కునకు (అ, ఇ, ఉ, ఋ, ఌలకు సవర్ణమగు అచ్చుపరమగునపుడు పూర్వపరములకు దీర్ఘము ఏకాదేశముగ వచ్చును.

అ, ఇ, ఉ, ఋ, ఌ అను నీ యైదచ్చులకు సవర్ణములగు అనన్తరమే అచ్చులు పరములైయున్నపుడు ఆయా అచ్చులకు వాని వాని దీర్ఘము లేకాదేశములగును.

దైత్యారిః (రాక్షసులకు శత్రువు-విష్ణువు)

దైత్య+అరిః అనుచోట పూర్వపదములోని త్యకారమునందలి అక్కునకు (అకారమునకు) సవర్ణమైనఅచ్చు (అరిః లోని అచ్చు) పరమగుటచే పూర్వపరములకు ఆ అను దీర్ఘము ఏకాదేశమై దైత్యారిః అను రూపమేర్పడును.

ఇట్లే శ్రీ + ఈశః
విష్ణు + ఉదయః
హోతృ + ఋకారః

అనుచోట పూర్వపదముల చివరనున్న ఈ, ఉ, ఋలకు సవర్ణము లగు అచ్చులు పరమగుటచే క్రమముగా ఈ, ఊ, ౠ అను దీర్ఘము లాదేశములై [1]శ్రీశః, [2]విష్ణూదయః, [3]హోతౄకారః అను రూపము లేర్పడును

సూ :- ఏఙః పదాన్తాదతి. ౬-౧-౧౦౯

ప వి :- ఏఙః, పదాన్తాత్, అతి.

వృ :- పదాన్తాదేఙః అతి పరే పూర్వరూప మేకాదేశః స్యాత్.

పదాన్తమందున్న ఏఙ్ఞకు (ఏ, ఓలకు) అత్తు (హ్రస్వాకారము) పరమగునపుడు పూర్వరూపమేకాదేశము గ వచ్చును.

హరేఽవ (ఓ హరీ ! రక్షింపుము)

హరే + అవ అనుచోట హరే అనునది సుబన్త మగుటచే పదమగుటచే రేలోని ఏకారము పదాన్తమైన ఏఙ్. దానికి అవలోని మొదటి "అ" అను హ్రస్వాకారము పరమందుండుటచే పూర్వ పరములకు (ఏకార అకారములకు) పూర్వరూపము (ఏకారము) ఏకాదేశమై హరేఽవ అను రూపమేర్పడును.

ఇట్లే విష్ణో + అవ అనుచోట విష్ణో అనుపదము చివరనున్న ఏఙ్ఞకు (ఓకారమునకు) హ్రస్వాకారము (అవలోని మొదటి అకారము)

1. విష్ణువు. 2. విష్ణువుయొక్క అభివృద్ధి. 3. హోతృశబ్దములోని ఋకారము.

పరమగుటచే నీ సూత్రముచే పూర్వరూప మేకాదేశమై విష్ణోఽవ అను రూపమేర్పడును.

సూ :- సర్వత్ర విభాషా గోః ౬-౧-౧౨౨

ప. వి :- సర్వత్ర, విభాషా, గోః.

వృ :- లోకే వేదే చ ఏఙన్తస్య గోః అతి వా ప్రకృతి భావః పదాన్తే.
గో అగ్రమ్, గోఽగ్రమ్

లోకమునందును, వేదమునందును పదాన్తమున ఏఙన్తమగు గోశబ్దమునకు అత్తు (హ్రస్వాకారము) పరమగునపుడు ప్రకృతిభావము వికల్పముగ వచ్చును.

వివ :- సంస్కృతభాష వైదికము, లౌకికము అని రెండువిధములు. వేదములలోని సంస్కృతము వైదికము. కావ్యాదుల యందును, వ్యవహారమునను ఉండు సంస్కృతము లౌకికము. వైదికమును లౌకికమును అగు గోశబ్దమునకు హ్రస్వాకారము పరమగునపుడు ప్రకృతి భావము వికల్పముగ వచ్చును. ప్రకృతిభావమున ఉన్నదున్నట్లుండుట. అనగా సంధి రాకుండుట. ప్రకృతిభావము విధింపబడిన గోశబ్దము పదాన్తమున ఏఙన్తమై యుండవలెను.

గోఅగ్రమ్ :- (గోవుయొక్క అగ్రము)

గో+అగ్రమ్ అనుచోట గోఅనునది సుబన్తమగుటచే పదమైనది. పదాన్తమున ఓకారముండుటచే ఏఙన్తమును ఐనది. ఇట్టి గోశబ్దమునకు హ్రస్వాకారము (అగ్రమ్‌లోని తొలి అకారము) పరముండుటచే ప్రకృతసూత్రముచే ప్రకృతిభావము వచ్చి అనగా ఎట్టిసంధియు రాక గో అగ్రమ్ అనియేయుండును.

ఈ సూత్రముచే వచ్చు ప్రకృతిభావము వికల్పముకనుక నది రాని పక్షమున గో+అగ్రమ్ అనుచోట ఏఙః పదాన్తాదతి అనుసూత్రముచే పూర్వరూపము వచ్చి గోఽగ్రమ్ అను రూప మేర్పడును.

ప్ర :- ఏఙన్తస్య కిమ్? చిత్రగ్వగ్రమ్.

ఏఙన్తమను పదమెందులకు? చిత్రగ్వగ్రమ్ అను రూపము సిద్ధించుటకొఱకు.

సూత్రార్థమున ఏఙన్తమను పదము లేనిచో గో శబ్దమునకు హ్రస్వాకారము పరమగునపుడు పదాన్తమున ప్రకృతిభావము వచ్చునని సూత్రమున కర్థము. అట్లైనచో చిత్రగు+అగ్రమ్ అనుచోట 'గు' అనునది పద సంజ్ఞకల గో శబ్దమగుటచేతను, పరమందు హ్రస్వాకారముండుటచేతను ఈ సూత్రముచే ప్రకృతిభావము వచ్చి చిత్రగుఅగ్రమ్ అను రూపమును ఏర్పడవలసివచ్చును. కనుక సూత్రార్థమున ఏఙన్తస్య అను విశేషణముండ వలెను. అప్పుడు గో అను పదము ఏఙన్తమైనపుడే ప్రకృతి భావము వచ్చునని యర్థము తెలియును. ఐనచో చిత్రగు+అగ్రమ్ అనుచోట గు అనుపదము గో శబ్దమేయైనను ఏఙన్తముకాదు. (ఉకారాన్తముకనుక) కనుక నిట ప్రకృతిభావము రాక యణాదేశమే వచ్చి చిత్రగ్వగ్రమ్ అను రూపమేర్పడును. చిత్రగుఅగ్రమ్ అను ప్రకృతిభావమువచ్చిన రూప ముండదని ఫలితార్థము.

ప్ర :- పదాన్తే కిమ్? గోః

పదాన్తమున అను పదమెందులకు? గోః అను రూపము సిద్ధించుట కొఱకు.

వివ :- ఈ సూత్రార్థమున 'పదాన్తే' అను పదము లేనిచో ఏఙన్తమగు గోశబ్దమునకు హ్రస్వాకారము పరమగునపుడు వికల్పముగా ప్రకృతి

భావము వచ్చునని సూత్రమునర్థము. అనగా గో శబ్దము చివర నున్న ఓకారము పదాన్తమున నుండవలెనను నియమముండదు. అట్లైనచో గోః అను రూపము సిద్ధించదు. ఎట్లన గో అను ప్రాతిపదికముపై పంచమ్యేకవచన ప్రత్యయము కాని, షష్ఠ్యేకవచన ప్రత్యయము కాని చేర్చగా గో + అస్ అని యుండును. ఇట గో అను ఏజన్తమగు శబ్దమునకు పరమందు హ్రస్వాకారముండుటచే నీ సూత్రముచే ప్రకృతిభావము వచ్చి గో అస్ అను (అసాధు) రూపమును ఏర్పడును. కనుక సూత్రమున పదాన్తే అను దళ ముండవలెను. అప్పుడు ఏజన్తమగు గో శబ్దము పదసంజ్ఞకమై యుండవలెనని తాత్పర్యము. గో + అస్ అను నీ చోట గో శబ్దము ఏజన్తమేయైనను పదాన్తము కాకపోవుటచే పద సంజ్ఞ లేదు కనుక ప్రకృతిభావము రాక పూర్వరూపమే వచ్చి గోస్ అని యగును. పిదప సకారస్థానమున రుత్వమును, రేఫస్థానమున విసర్గయు ఆదేశమై గోః అను రూపమేర్పడును.

సూ :- అనేకాల్శిత్సర్వస్య ౧-౧-౫౫

ప. వి :- అనేకాల్శిత్, సర్వస్య

అనేకాల్లును, శిత్తును అగు ఆదేశము సర్వమునకు ఆదేశముగ వచ్చును.

వివ :- అనేకములైన అల్లులు కలది అనేకాల్లు. అల్ అనునది ప్రత్యాహారము. ఈ ప్రత్యాహారముచే వర్ణములన్నియు గ్రహింపబడును. శకారమిత్తుగా కలది శిత్తు. ఏ యాదేశమున ఒక వర్ణముకన్న ఎక్కువ వర్ణములుకాని, శకారము ఇత్తుగా కాని యున్నచో నది యాదేశము దేనికి విధింపబడునో దానికి మొత్తమునకు నాదేశముగ వచ్చునని భావము. 'అస్తేర్భూః' అను సూత్రముచే అస్ ధాతువునకు

ఘా అను నాదేశము విధింపబడినది. ఘా అను నాదేశము అనేకాల్లు అగుటచే 'అస్' అను మొత్తము స్థానమున ఘా అనునది ఆదేశ మగునని భావము. అష్టన్ శబ్దముపై వచ్చు జస్, శస్ అను ప్రథమా ద్వితీయా విభక్తి ప్రత్యయములకు "అష్టాభ్య ఔశ్" అను సూత్రముచే ఔశ్ అను నాదేశము విధింపబడినది. ఈ ఔశ్ అను నాదేశము శిత్తు. కనుక జస్, శస్ అను వాని మొత్తము స్థానమున ఔశ్ అను నది ఆదేశముగ వచ్చును.

వృ :- ఇతి ప్రాప్తే

అని ప్రాప్తింపగా

వివ :- "అవఙ్స్ఫోటాయనస్య" అను తరువాతి సూత్రముచే గో శబ్దమునకు అవఙాదేశము విధింపబడుచున్నది. అవఙ్ అను నీ యాదేశము అనేకాల్లగుటచే (అనేక వర్ణములు కలదగుటచే) ప్రకృతసూత్రముచే 'గో' అను శబ్దము మొత్తము స్థానమున ప్రాప్తించినది. కనుక నీ క్రింది సూత్రమును చెప్పుచున్నాము.

సూ :- ఙిచ్చ ౧-౧-౫౩

ప. వి :- ఙిత్, చ

వృ :- ఙిత్ అనేకాలపి అన్త్యస్యైవ స్యాత్.

ఙిత్తు అనేకాల్తైనను అన్త్యమునకే వచ్చును.

వివ :- ఙకారమిత్తుగా కల యాదేశమున అనేక వర్ణములున్నను అది సర్వమునకు కాక దేనికి విధింపబడినదో దాని యన్త్య (చివరి) వర్ణమునకే ఆదేశమగునని భావము. ఈ సూత్రము పై సూత్రమున కపవాదము. తరువాతి సూత్రముచే గో శబ్దమునకు అవఙ్ అను నాదేశము విధింపబడినది. ఆ యాదేశమున అనేక వర్ణము లుండుటచే

అనేకాల్శిత్సర్వస్య అను సూత్రముచే గో శబ్దము మొత్తము స్థానమున అవఙాదేశము ప్రాప్తించినది. కాని అవఙ్ అను నాదేశము అనేకాక్షరములున్నను జిత్తగుటచే ప్రకృతసూత్రముచే గో శబ్దమునకు మొత్తమునకు కాక చివరి వర్ణమునకు (గోలోని ఓకారమునకు) మాత్రమే అవఙాదేశము వచ్చునని భావము.

సూ :_ అవఙ్ స్ఫోటాయనస్య ౬-౧-౧౨౩

ప. వి :_ అవఙ్, స్ఫోటాయనస్య.

వృ :_ పదాన్తే ఏఙన్తస్య గోరవఙ్ వా అచి.

పదాన్తమున ఏఙన్తమగు గోశబ్దమునకచ్చు పరమగుచో అవఙాదేశము వికల్పముగ వచ్చును.

వివ :_ సూత్రమున స్ఫోటాయనస్య అను పదముచే స్ఫోటాయనుడను వ్యాకరణాచార్యుని మతమున నీ అవఙాదేశము వచ్చుననియు, పాణిని మతమున రాదనియు భావము. ఏవంచ ఈ సూత్రముచే విధింపబడు అవఙాదేశము వికల్పమని తేలినది.

గవాగ్రమ్ :_ (గోవుయొక్క అగ్రము) గో + అగ్రమ్ అనుచోట పదాన్తమున ఏఙన్తమగు గోశబ్దము కలదు. దానికి పరమందు అచ్చు ఉండుటచే ప్రకృతసూత్రముచే గోలోని ఓకారమునకు అవఙాదేశము వచ్చి గవ + అగ్రమ్ అని కాగా సవర్ణదీర్ఘము వచ్చి గవాగ్రమ్ అను రూపమేర్పడును. ఈ సూత్రముచే వచ్చు అవఙాదేశము వికల్పము కనుక నది రానిపక్షమున 'సర్వత్ర విభాషాగోః' అను సూత్రముచే ప్రకృతిభావము వచ్చి గోఅగ్రమ్ అని యగును. ప్రకృతి భావము కూడ వికల్పమగుటచే నది రాని పక్షమున 'ఏఙఃపదాన్తాదతి' అను సూత్రముచే పూర్వరూపమువచ్చి గోఽగ్రమ్ అను రూపమేర్పడును.

ఇష్టే [1]గవాక్షః (వాతాయనము. కిటికీ) [2]గవోద్ధః (శ్రేష్ఠమైన గోవు) అను రూపములను అవఙాదేశముచే సాధించునది.

వృ :- పదాన్తే కిమ్ ? గవి.

పదాన్తమున అను పదమెందులకు ? గవి అను చోటనసాధు రూపము ఏర్పడకుండుటకొఱకు.

వివ :- ఈ సూత్రమున పదాన్తమున అని చెప్పనిచో ఏఙన్తమైన గోశబ్దమున కచ్చు పరమగునపుడు అవఙాదేశము వచ్చునని సూత్రమున కర్థము. అనగా గోశబ్దము చివరనుండు ఏఙ్ పదాన్తమున నుండవలెనను నియమముండదు. ఐనచో గోశబ్దమునకు సప్తమ్యేకవచన ప్రత్యయమగు 'ఇ' చేర్చగా గో + ఇ అని యుండును. ఇటనున్న గోశబ్దము ఏఙన్తమే. దానికచ్చు పరమందున్నది. కనుక అవఙాదేశము వచ్చి గవ + ఇ అని యేర్పడి పిదప గుణముచే 'గవే' అను అసాధురూప మేర్పడవలసివచ్చును. కనుక సూత్రమున పదాన్తమున అను పదముండవలెను. గో + ఇ అను చోటనున్న గో అనునది సుబన్తము కాకపోవుటచే పదముకాదు. కనుక గోశబ్దము చివరనున్న ఏఙ్ పదాన్తమున లేదు. అవఙాదేశము రాదు. ఏచోఽయవాయావః అను సూత్రముచే అవాదేశము వచ్చి గవ్ + ఇ = గవి అనియే రూపమేర్పడును.

సూ :- ఇన్ద్రే చ ౬-౧-౧౨౪

ప. వి :- ఇన్ద్రే, చ.

వృ :- గోరవఙ్ స్యాదిన్ద్రే. గవేన్ద్రః.

గోశబ్దమునకు ఇన్ద్రశబ్దము పరమగుచో అవఙాదేశము వచ్చును.

1, 2. ఇట అవఙాదేశము నిత్యమని గ్రహింపవలెను.

గవేన్ద్రః :- (గొప్ప ఎద్దు) గో — ఇన్ద్రః అనుచోట గోశబ్దమునకు [illegible] శబ్దము పరముగా నుండుటచే గోలోని ఓకారమునకు అవాదేశ వచ్చి గవ + ఇన్ద్రః అని యగును. పిదప గుణము వచ్చి గవేన్ద్ర అను రూపమేర్పడును.

సూ :- దూరాద్ధూతే చ ౮-౨-౮౪

ప. చ :- దూరాత్, హూతే చ

వృ :- దూరాత్ సంబోధనే వాక్యస్య టేః ప్లుతో వా స్యాత్.

దూరమునుండి సంబోధించునప్పుడు ప్రయోగింపబడు వాక్యము యొక్క టికి ప్లుతము వచ్చును.

పరాఙ్ముఖుని అభిముఖునిగా చేసికొనుటకు పలుకు వాక్యమును సంబోధన వాక్యమందురు. అట్టి సంబోధన వాక్యముయొక్క టికి ప్లుతము వచ్చును.

ఆగచ్ఛ కృష్ణ^{3} :- (ఓకృష్ణా! రమ్ము) అనునది సంబోధన వాక్యము. కృష్ణ శబ్దములోని ణకారముమీది అకారము టి. ఆ అకారము ప్రకృత సూత్రముచే ప్లుతమగును. ప్లుతము నుచ్చరించుటకు మూడు మాత్రల కాలము పట్టును. కనుకనే కృష్ణశబ్దములోని ణకారముమీది అకారము పై ^{3} అనునది ప్లుతచిహ్నముగా ప్రయోగింపబడినది.

'ప్లుతప్రగృహ్యా అచి నిత్యమ్' అను తరువాతి సూత్రముచే విధింపబడు ప్రకృతిభావము వచ్చుటయే యీ ప్లుతమునకు ప్రయోజనము.

సూ :- ప్లుతప్రగృహ్యా అచి నిత్యమ్ ౬-౧-౧౨౫

ప. చ :- ప్లుతప్రగృహ్యాః, అచి, నిత్యమ్.

వృ :- ఏతే అచి ప్రకృత్యా స్యుః.

ఇవి (ప్లుత, ప్రగృహ్యములు) అచ్చు పరముగునపుడు సహజముగా (ఎట్టి మార్పులేక) ఉండును.

ప్లుతసంజ్ఞకములకును, ప్రగృహ్యసంజ్ఞకములకును అచ్చు పరమగుచో ప్రకృతిభావము వచ్చునని భావము. ప్రకృతిభావమనగా ఉన్నదున్నట్లు ఉండుట. అనగా ఎట్టి సంధియు రాదని భావము. ప్రగృహ్యములేమో తరువాతి సూత్రములో వివరింపబడును. అగచ్ఛ కృష్ణ3 + అత్ర గౌశ్చరతి (ఓ కృష్ణా! రమ్ము. ఇక్కడ గోవు చరించుచున్నది) అనుచోట అగచ్ఛ కృష్ణ3 అనునది సంబోధనవాక్యము. కనుక 'దూరాద్ధూతే చ' అను సూత్రముచే టి యగు ణకారముమీది అకారము ప్లుతమైనది. దానికి పరముగ అచ్చు (అత్రలోని తొలి అకారము) పరమగుటచే నీ సూత్రముచే ప్రకృతిభావము వచ్చి ఆగచ్ఛ కృష్ణ3 అత్ర గౌశ్చరతి అనియే యగును కృష్ణ3 + అత్ర అనుచోట సవర్ణదీర్ఘము రాదని యెఱుగవలెను.

సూ :- ఈదూదేద్ద్వివచనం ప్రగృహ్యమ్ ౧-౧-౧౧

ప. వి :- ఈదూదేత్, ద్వివచనం, ప్రగృహ్యమ్.

వృ :- ఈదూదేదన్తం ద్వివచనం ప్రగృహ్యం స్యాత్.

ఈకారము, ఊకారము, ఏకారము ఇవి అంతమందుగల ద్వివచనము ప్రగృహ్య సంజ్ఞకమగును. ప్రగృహ్యసంజ్ఞ వచ్చుటచే ప్రకృతిభావము వచ్చునని భావము.

హరీ ఏతౌ :- (వీరిద్దఱు హరులు) హరీ + ఏతౌ అనుచోట హరీ అనునది ఈకారాన్త ద్వివచనమగుటచే ప్రకృతసూత్రముచే ప్రగృహ్యమైనది. దానికి అచ్చు (ఏతౌలోని ఏకారము) పరమగుటచే ప్లుత ప్రగృహ్యా అచి నిత్యమ్ అను సూత్రముచే ప్రకృతిభావము వచ్చి హరీ ఏతౌ అనియే యగును. 'ఇకోయణచి' అను సూత్రముచే యణాదేశము రాదని యెఱుగవలెను.

విష్ణూఇమౌ :- (వీరిద్దరు విష్ణువులు) విష్ణూ + ఇమౌ అనుచోట విష్ణూ అనునది ఊకారాన్త ద్వివచనమగుటచే ప్రగృహ్యసంజ్ఞయు, ప్రకృతిభావమును వచ్చి విష్ణూ ఇమౌ అనియే యుండును. యణాదేశము రావని భావము.

గంగే అమూ :- (ఈ రెండు గంగలు) గంగే + అమూ అనుచోట గంగే అనునది ఏకారాన్త ద్వివచనమగుటచే ప్రకృతసూత్రముచే ప్రగృహ్య సంజ్ఞయు పిదప ప్రకృతిభావమునువచ్చి గంగే అమూ అని యగును. 'ఏఙః పదాన్తాదతి' అను సూత్రముచే పూర్వరూపము రాదని భావము. ఇట్లే కవీ అగచ్ఛతః, ఋతూ అతీతౌ. నేత్రే అమృశతి అనుచోట్లను కవీ, ఋతూ, నేత్రే అనునవి క్రమముగా ఈకారాన్త, ఊకారాన్త, ఏకారాన్త ద్వివచనములగుటచే ప్రకృత సూత్రముచే ప్రగృహ్యసంజ్ఞయు పిదప ప్రకృతిభావమును వచ్చునని తెలియవలెను.

సూ :- అదసో మాత్ ౧-౧-౧౨

వ. వి :- అస్మాత్పరావీదూతౌ ప్రగృహ్యౌ స్తః.

అమీ ఈశాః, రామకృష్ణావమూ ఆసాతే.

అదశ్శబ్దమునకు సంబంధించిన మకారమునకు పరముండున్న ఈకార ఊకారములు ప్రగృహ్యములగును.

అమీఈశాః :- (వీరు ఈశ్వరులు లేక సమర్థులు) అమీ + ఈశాః అనుచోట అమీ అనునది పుంలింగమగు అదశ్శబ్దము ప్రథమాబహువచన రూపము. ఇందలి మకారము అదశ్శబ్ద సంబంధియే. అట్టి మకారమునకు పరమందు ఈకారముండుటచే నా ఈకారము ప్రకృతసూత్రముచే ప్రగృహ్యమై 'ప్లుతప్రగృహ్యా అచినిత్యమ్' అనుసూత్రముచే

ప్రకృతిభావమువచ్చి అమీఈశాః అని యేర్పడును. సవర్ణదీర్ఘము రావని భావము.

అమూ ఆసాతే :- (ఈ ఇద్దరు కూర్చొనియున్నారు) అమూ అను పదములోని మకారము అదశ్శబ్ద సంబంధి. దానిపైనున్న ఊకార మీ సూత్రముచే ప్రగృహ్యమై ప్రకృతి భావముచే అమూ ఆసాతే అని యేర్పడును. యణాదేశము రావని భావము.

వృ :- మాత్ కిమ్ ? అముకేఽత్ర.

సూత్రమున మాత్ (మకారముకంటె) అను పదమెందులకు? అముకేఽత్ర అనుచోట ప్రగృహ్యసంజ్ఞ రాకుండుటకొఱకు.

సూత్రమున మాత్ అనుపదము లేనిచో 'ఈదూదేత్' అను పై సూత్రమునుండి ఈత్, ఊత్ అనువానితో పాటు ఏత్ అనునదికూడ అనువర్తించును. అప్పుడు అదశ్శబ్దసంబంధములగు ఈకార, ఊకార, ఏకారములు మూడును ప్రగృహ్యములగునని సూత్రమున కర్థమేర్పడును. అముకే అను పదములోని కకారముమీది ఏకారముకూడ అదశ్శబ్దమునకు సంబంధించినదే యగుటచే నది ప్రగృహ్యమై ప్రకృతిభావమువచ్చి అముకే అత్ర అను సంధిరహితరూప మేర్పడును. సూత్రమున 'మాత్' (మకారముకంటె) అను పదమున్నపక్షమున 'ఈదూదేత్' అను పై సూత్రమునుండి ఈకార ఊకారములు (ఈదూత్ అనునవి) మాత్రమే అనువర్తించును. అదశ్శబ్దములో మకారముమీద ఏకారము అసంభవము కనుక ఏకార మనువర్తింపదు. ఇది సూత్రమున మాత్ అను పదమున్నందుచే సంభవించును. అముకే అనుచోట మకారముమీద ఈకారము కాని, ఊకారము కాని లేకపోవుటచే ప్రగృహ్యసంజ్ఞను తద్ద్వారా ప్రకృతి భావమును వారింపవచ్చును. అముకే + అత్ర అనుచోట పూర్వరూపమే వచ్చి అముకేఽత్ర అని యగును.

సూ :- ప్రాగ్రీశ్వరాన్నిపాతాః ౧-౪-౫౬

ప. వి :- ప్రాక్, రీశ్వరాత్, నిపాతాః.

సూత్రమునందలి రీశ్వరాత్ అనునది అధిరీశ్వరే అను సూత్రములోని ఏకదేశమగు రీశ్వర శబ్దమున కనుకరణము. అధిరీశ్వరే (1-4-97) అనునది అష్టాధ్యాయిలో మొదటి యధ్యాయము నాలుగవపాదమున 97వ సూత్రము. ప్రాగ్రీశ్వరాన్నిపాతాః (1-4-56) అనునదియు అదే అధ్యాయమున అదేపాదమున 56వ సూత్రము. మొదటి యధ్యాయము నాలుగవ పాదములోని 56వ సూత్రమునుండి ఆ పాదములోని 97వ సూత్రము వఱకు చెప్పబడినవన్నియు నిపాతములగునని సూత్రార్థము.

ఇది అధికారసూత్రము.

సూ :- చాదయోఽసత్త్వే ౧-౪-౫౭

ప. వి :- చాదయః, అసత్త్వే.

వృ :- అద్రవ్యార్థాశ్చాదయః నిపాతాః స్యుః.

ద్రవ్యవాచకములుకాని 'చ' మున్నగునవి [1]నిపాతము లనబడును. దేనిలో లింగము, సంఖ్య అన్వయించునో అది ద్రవ్యము. చ మున్నగు నవ్యయములలో లింగములేదు. సంఖ్యకు అన్వయముండదు కనుక నవి ద్రవ్యవాచకములుకావు. కనుక నవి నిపాతములు.

సూ :- ప్రాదయః ౧-౪-౫౮

వృ :- ఏతేఽపి తథా.

ప్ర మున్నగునవికూడ నిపాతములగును. ఈ నిపాతసంజ్ఞకు ప్రయోజనము తరువాతి సూత్రమున చెప్పబడును.

1. లింగసంఖ్యాన్వయిత్వం ద్రవ్యత్వమ్.

సూ :- నిపాత ఏకాజనాఙ్ ౧-౧-౧౪

ప. వి :- నిపాతః, ఏకాచ్, అనాఙ్.

వృ :- ఏకోఽజ్ నిపాత ఆఙ్ వర్జః ప్రగృహ్యః స్యాత్.

ఇ ఇన్ద్రః. ఉ ఉమేశః.

ఆఙ్ అనునది తప్ప మిగిలిన ఏకాచ్చులుగ (ఒకే అచ్చురూప ములో) నున్న నిపాతములు ప్రగృహ్య సంజ్ఞకములగును.

[1]ఇ ఇన్ద్రః :- (ఇతడు ఇంద్రుడా !) ఇ + ఇన్ద్రః అనుచోట ఇ అనునది విస్మయార్థకమగు నిపాతము. అది ఒకే అచ్చుగ నున్నది. కనుక ప్రకృత సూత్రముచే నిది ప్రగృహ్యమై పిదప ప్రకృతి భావము వచ్చి ఇ ఇన్ద్రః అనియే యుండును. సవర్ణదీర్ఘము రాదని భావము.

[2]ఉ ఉమేశః :- (ఇతడు శివుడని తోచుచున్నది.) ఉ + ఉమేశః అనుచోట ఉ అనునది తలంచుట, వితర్కించుట అను నర్థములుకల నిపాతము. అది ఒకే అచ్చుగ నున్నది కనుక ప్రకృత సూత్రముచే ప్రగృహ్యసంజ్ఞయు, ప్రకృతి భావమును వచ్చి ఉ ఉమేశః అను రూపమేర్పడును. సవర్ణదీర్ఘము రాదు.

వా :- వాక్యస్మరణయోరఙిత్.

వాక్యమునను, స్మరణార్థమునను ప్రయోగింపబడు 'ఆ' అఙిత్తు. అనగా ఆఙ్ కాదు

ఆ ఏవం ను మన్యసే :- (నీ విట్లు తలచుచున్నావా ?) ఇట ఆ అనునది వాక్యరూపార్థమున ప్రయోగింపబడినది కనుక నిది 'వాక్య స్మరణయో రఙిత్' అను పై వార్తికానుసారము ఈ ఆ అనునది ప్రత్యేకమగు నిపాతమేకాని ఆఙ్ రూప ఆ కాదు. కనుక నిది అనాఙ్ అగుటచే

---

1 ఇ విస్మయే 2. ఉ వితర్కే

ప్రకృతిసూత్రముచే ప్రగృహ్యసంజ్ఞయు. పిదప ప్రకృతి భావమును వచ్చి ఆ ఏవం ను మన్యసే అనియే యుండును. ఆ ఏవం అనుచోట వృద్ధి రాదని భావము.

ఆ ఏవం కిల తత్ :- (ఆ ! అది ఇట్లుండెనుకదా !) ఇట ఆ అనునది స్మరణార్థమున ప్రయోగింపబడుటచే పై నియమానుసారము ఆఙ్ లోని ఆకారము కాదు. స్వతంత్రమగు ఆఙ్ భిన్నమైన నిపాతము. కనుక నిదియు ప్రగృహ్యసంజ్ఞకమై ప్రకృతిభావము వచ్చి ఆ ఏవం కిల తత్ అని యగును. ఆ ఏవం అను చోట వృద్ధి రాదని భావము.

వృ :- అన్యత్ర ఙిత్. ఈషదుష్ణమ్ ఓష్ణమ్.

వాక్యార్థమునందును, స్మరణార్థము నందును గాక ఇతరార్థముల యందు ప్రయోగింపబడు ఆ అనునది ఙిత్తు. అనగా అది ఆఙ్ అని భావము. ప్రకృతసూత్రములోని అనాఙ్ అను పదముచే నీ ఆఙ్ అను దానికి ప్రగృహ్యసంజ్ఞ నిషేధింపబడినది.

ఓష్ణమ్ :- (గోరువెచ్చని) ఆ + ఉష్ణమ్ అను చోట 'ఆ' అను నిపాత మునకు వాక్యార్థముకాని, స్మరణార్థముకాని లేదు. ఇట ఆ అను దానికి కొంచెమని యర్థము ! పై వాక్యానుసారమిది ఆఙ్ అగుటచే ప్రగృహ్యసంజ్ఞరాదు. కనుకనే ప్రకృతిభావమురాక 'ఆద్గుణః' అని గుణము వచ్చి ఓష్ణమ్ అని యగును.

ఆ మఱియు ఆఙ్ అను నీ రెండును నిపాతములు. ఈ రెంటిలో ఆఙ్ అనువానికి ప్రగృహ్యసంజ్ఞ నిషేధింపబడి శుద్ధమగు (ఙకారములేని) ఆకారమునకు ప్రగృహ్యసంజ్ఞ వచ్చునని తెలుపబడినది. కాని ఆ. మఱియు ఆఙ్ అను నీ రెండును ప్రయోగమున 'ఆ' అను రూపముననే కన బడును. అట్లైనచో నిది ఆఙ్, ఇది ఆ అను విషయము నెట్లు గ్రహింప వలెనో యీ క్రింది శ్లోకమున తెలుపబడినది.

ఈషదర్థే క్రియాయోగే మర్యాదాఽభివిధౌ చ యః ।
ఏతమాతం జితం విద్యాత్ వాక్యస్మరణయో రజిత్॥

ఈషత్ (కొంచెము) అను నర్థమునను, క్రియాయోగమునను, మర్యాదార్థమునను, అభివిధియను నర్థమునను ప్రయోగింపబడు ఆ అను దానిని ఆజ్ (జిత్) అని భావింపవలెను. ఇట్లే వాక్యమునను, స్మరణార్థమునను ప్రయోగింపబడు ఆ అనునది శుద్ధ ఆకారము (అజిత్) అనియు ఎఱుంగవలెను.

ఈషదర్థము :- ఆ + ఉష్ణమ్ = ఓష్ణమ్.
క్రియాయోగము :- ఆ + అగచ్ఛత్ = ఆగచ్ఛత్
[1]మర్యాదార్థము :- ఆ + అమ్ముద్రేః = ఆమ్ముద్రేః.
[2]అభివిధ్యర్థము :- ఆ + ఇన్ద్రాత్ = ఏన్ద్రాత్.

ఈ ఉదాహరణములో నున్న ఆ అనునది ఆజ్ కనుక ప్రగృహ్య సంజ్ఞ రాదు కనుకనే ప్రకృతిభావమురాక సంధి వచ్చి ఓష్ణమ్, ఆగచ్ఛత్ అను రూపములు సిద్ధించును.

సూ :- ఓత్ ౧-౧-౧౫

వృ :- ఓదన్తః నిపాతః ప్రగృహ్యః స్యాత్.

ఓకారాన్తమగు నిపాతము ప్రగృహ్యమగును.

---

1. మర్యాద అనగా అవధి. "తేన వినా మర్యాదా" అనుటచే ఆమ్ముద్రేః అస్య రాజ్యమ్ అనుచోట రాజ్యమునకు సీమగా చెప్పబడిన సముద్రమును గ్రహింపకూడదు. 'రాజ్యసీమలో సముద్రము చేరదు.
2. అభివిధియనగను అవధియే. "తేన సహ అభివిధిః" అనుటచే ఏన్ద్రాత్ హరిభక్తిః అనుచోట హరిభక్తికి అవధిగా చెప్పబడిన హరిని కూడ గ్రహింపవలెను. ఇన్ద్రునికి కూడ హరిభక్తి కలదని యర్థము.

అహో ఈశాః :- (ఏమి ఈశ్వరులా !) అహో + ఈశాః అనుచోట అహో అనునది 'చాదయోఽసత్త్వే' అను సూత్రముచే నిపాతమైనది. ఇది ఓకారాంతము అగుటచే ప్రగృహ్యసంజ్ఞయు, తద్వారా ప్రకృతి భావము వచ్చి అహో ఈశాః అని యగును. ఏచోఽయవాయావః అను సూత్రముచే అవాదేశము రావని భావము.

ఇట్లే [1]అహో + అహోభిః అనుచోటను ప్రకృత సూత్రముచే అహో అను నిపాతము ప్రగృహ్యమై ప్రకృతిభావముచే అహో అహోభిః అనియే యుండును. సంధి రాదని భావము.

సూ :- సంబుద్ధౌ శాకల్యస్యేతావనార్షే ౧-౧-౧౬

ప. వి. :- సంబుద్ధౌ, శాకల్యస్య, ఇతౌ, అనార్షే

వృ :- సంబుద్ధి నిమిత్తక ఓకారో వా ప్రగృహ్యః అవైదికే ఇతౌ పరే.
విష్ణో ఇతి, విష్ణఇతి, విష్ణవితి.

[2]సంబుద్ధి యనగ సంబోధన ప్రథమావిభక్తి ఏకవచనము. అట్టి సంబుద్ధిని నిమిత్తముగ చేసికొనివచ్చు ఓకారము అవైదికమగు (వేద సంబంధము లేని) ఇతి శబ్దము పరమగునపుడు వికల్పముగ ప్రగృహ్య మగును

విష్ణో ఇతి :- (ఓ విష్ణూ ! అని) విష్ణో + ఇతి అను చోట విష్ణో అనునది విష్ణుశబ్దము సంబోధన ప్రథమైక వచనాంతము. విష్ణు శబ్దములోని ఉకారమునకు సంబుద్ధి (సంబోధన ఏకవచనము) పరమగునపుడు గుణము (ఓకారము) వచ్చి విష్ణో అని యగును కనుక విష్ణో అను

1 అహో అహోభిర్మహిమాహిమాగమే (నైషధము-ప్రథమసర్గ 41శ్లోకము

2 ఏకవచనం సంబుద్ధిః—సంబోధనే ప్రథమాయాః ఏకవచనం సంబుద్ధి సంజ్ఞం స్యాత్.

శబ్దములోని ఓకారము సంబుద్ధి నిమిత్తకమైనది. దానికి అవైదికమగు (లౌకికమగు) ఇతిశబ్దము పరమగుటచే ప్రకృత సూత్రముచే ప్రగృహ్య సంజ్ఞ వచ్చి పిదప ప్రకృతిభావముచే విష్ణో ఇతి అని యేర్పడును.

విష్ణఇతి :- ఈ సూత్రముచే వచ్చు ప్రగృహ్య సంజ్ఞ వికల్పము కనుక విష్ణో + ఇతి అనుచోట ప్రగృహ్య సంజ్ఞ రాని పక్షమున 'ఏచోఽయవాయావః' అను సూత్రముచే ఓకారమునకు అవాదేశమువచ్చి విష్ణవ్ ఇతి అను యగును. పిదప 'లోపః శాకలస్య' అను సూత్రముచే వ్ అనునది లోపించి విష్ణ ఇతి అను రూపమేర్పడును.

విష్ణవితి :- లోపః శాకల్యస్య అను సూత్రముచే వచ్చు లోపము వికల్పమగుటచే నది (వకారలోపము) రాని పక్షమున విష్ణవితి అను రూపమేర్పడును.

సూ :- మయ ఉఞో వో వా ౮-౩-౩౩

ప. వి :- మయః, ఉఞః, వః, వా.

వృ :- మయః పరస్య ఉఞః వో వా స్యాదచి.

మయ్ ప్రత్యాహార వర్ణములకు పరమందున్న ఉఞ్ అనువానికి అచ్చు పరమైనచో వకారము వికల్పముగ ఆదేశమగును.

కిమ్వుక్తమ్ :- కిము + ఉక్తమ్ అనుచోట కిము అను పదములోని మకారము మీది ఉకారము ఉఞ్. అది మయ్యునకు (మకారమునకు) పరముగా నున్నది ఈ ఉఞునకు పరముగా అచ్చును (ఉక్తమ్‌లోని ఉకారము) ఉన్నది కనుక కిములోని మకారముమీది ఉకారస్థానమున వకార మాదేశమై కిమ్ + వ్ + ఉక్తమ్ = కిమ్వుక్తమ్ అను రూపమేర్పడును.

ఈ సూత్రముచే వచ్చు వకారాదేశము వికల్పము కనుక నది రాని పక్షమున "నిపాతఏకాజనాఙ్" అను సూత్రముచే ఉ(ఞ్) అను నిపాతము ప్రగృహ్యమై పిదప ప్రకృతి భావముచే (సంధిరాక) కిము ఉక్తమ్ అనియే యుండును.

వృ :- వస్యాసిద్ధత్వాన్న అనుస్వారః.

వకారాదేశ మసిద్ధమగుటచే అనుస్వారము రాదు.

కిమ్ + వ్ + ఉక్తమ్ అనుచోట మకారమునకు హల్లు (వకారము) పరమగుటచే. మోఽనుస్వారః అను సూత్రముచే మకారస్థానమున అనుస్వారము (బిందువు) ఆదేశముగ ప్రాప్తించినది. మోఽనుస్వారః అను సూత్రదృష్ట్యా మయ ఉఞో వో వా అను సూత్రముచే వచ్చిన వకారాదేశము పూర్వత్రాసిద్ధమ్ అను సూత్రముచే అసిద్ధమగుటచే హల్లు పరముండమి కనుక మకారమునకు అనుస్వారాదేశము రాదు.

సూ :- ఇకోఽసవర్ణే శాకల్యస్య హ్రస్వశ్చ ౬-౧-౧౨౭

పది :- ఇకః, అసవర్ణే, శాకల్యస్య, హ్రస్వః, చ.

వృ :- పదాన్తా ఇకః హ్రస్వా వా స్యురసవర్ణేఽచి.

పదాన్తములగు ఇక్కులు అసవర్ణములగు అచ్చులు పరమగునప్పుడు వికల్పముగ హ్రస్వములగును.

చక్రిఅత్ర :- (విష్ణువిచట) చక్రీ + అత్ర అనుచోట చక్రి అనునది సుబన్తమగుటచే పదము. దాని చివరి ఈ అను ఇక్కును, పరమందు అ అను అసవర్ణమగు అచ్చును ఉండుటచే క్రీలోని ఈకారము హ్రస్వమై చక్రి అత్ర అను రూపమేర్పడును.

ఈ సూత్రముచే ఇక్కునకు వచ్చు హ్రస్వాదేశము వికల్పమగుటచే నది రాని పక్షమున చక్రీ + అత్ర అనుచోట 'ఇకోయణచి' అను

సూత్రముచే యణాదేశమువచ్చి 'చక్ర్యత్ర' అను అను రూపమేర్పడును.

వృ :- హ్రస్వవిధిసామర్థ్యాన్న స్వరసన్ధిః.

హ్రస్వవిధాన సామర్థ్యమువలన స్వరసంధి (అచ్సంధి) రాదు.

చక్రీ + అత్ర అనుచోట ప్రకృత సూత్రముచే క్రీ లోని ఈకారమునకు హ్రస్వము (ఇకారము) ఆదేశమై చక్రి అత్ర అను రూపమేర్పడును. ఇట హ్రస్వము వచ్చిన పిదప 'ఇకోయణచి' అను సూత్రముచే యణాదేశము రావచ్చునుకదా? అను నాశంక కలుగును. కాని హ్రస్వము వచ్చిన పిదప యణాదేశమే వచ్చినచో హ్రస్వమును విధించి ప్రయోజనముండదు. దీర్ఘమగు ఈకారమునకే యణాదేశము వచ్చుటకు వీలున్నదికదా? కనుక దీర్ఘములగు ఇక్కులకు హ్రస్వాదేశమును చెప్పిన పక్షమున ఎట్టి స్వరసంధియు రాదని భావము.

వృ :- పదాన్తా ఇతి కిమ్? గౌర్యౌ.

పదాన్తాః అను పదమెందులకు? గౌర్యౌ అనుచోట అసాధు రూపము సిద్ధించకుండుటకొఱకు.

గౌరీ శబ్దముపై ప్రథమావిభక్తిలోని, ద్వితీయావిభక్తిలోని గాని [1]ఔ అను ద్వివచనప్రత్యయము వచ్చిన గౌరీ + ఔ అని యుండును. సూత్రమున పదాన్తాః అను పదము లేనిచో ఇక్కులకు అసవర్ణములగు అచ్చులు పరమగుచో హ్రస్వము లాదేశములగునని సూత్రార్థము వచ్చును. అనగా దీర్ఘములగు ఇక్కులు పదాన్తమున నుండవలసిన నియమ

1. ప్రథమాద్వివచనమున ఔ అను ప్రత్యయమును, ద్వితీయాద్వివచనమున ఔట్ అను ప్రత్యయమును వచ్చును. ఔట్ అను ప్రత్యయమున 'ట్' అనునది ఇత్తై 'ఔ' మాత్రమే మిగులును.

మందురు. అట్లయిన గౌరీ + వా అనుచోటను రేఫముమీది ఈకారమునకు ప్రగృహ్యమాదేశమై (యణాదేశము రాక) గౌరి వా అను అసంధిరూప మేర్పడును. సూత్రమున పదాన్తాః అను పదమున్నచో ఇక్కడ పదాన్త మున ఉన్నప్పుడే ప్రగృహ్యము వచ్చునని తెలియు. గౌరీ + వా అనుచోట గౌరీ అనునది సమస్తము కానప్పుడే రేఫముమీది ఈకారము పదాన్తము కాదు. కనుక ఇట ఇక్కడనకు ప్రగృహ్యాదేశము రాదు. యణాదేశమే వచ్చి గౌర్వా అను రూపమేర్పడును.

గమనిక :- సూత్రమున పదాన్తాః అనుపదము చేయకున్న ప్రకృతసూత్ర మునే ప్రగృహ్యాదేశము సిద్ధించుటచే ప్రగృహ్యాదేశము రానిపక్షమున యణాదేశముచే వచ్చి గౌర్వా అను రూపము సిద్ధించినను పక్షమున గౌరి వా అను అసంధిరూపము కూడ ఏర్పడవలసివచ్చును. కనుక సూత్ర మున పదాన్తాః అను పదముంచబడెను

సూ :- అచో రహాభ్యాం ద్వే ౮-౪-౪౬

ప. చ్ఛే :- అచః, రహాభ్యాం, ద్వే.

వృ :- అచః పరాభ్యాం రేఫహకారాభ్యాం పరస్య యరః ద్వే వా స్తః.

అచ్చునకు పరముగానున్న రేఫహకారములకు పరముగను యర్ ప్రత్యాహారవర్ణములకు ద్విత్వము వికల్పముగ వచ్చును.

గౌర్య్యౌ :- (ఇద్దరు గౌరులు) గౌరీ + ఔ అనుచోట రేఫముమీది ఈకార మునకు యణాదేశము వచ్చి గౌర్ + య్ + ఔ అని యుండును. ఇట గౌ రౌవి చెలను అచ్చునకు పరముగానున్న రేఫమునకు పరమైన యర్ ప్రత్యాహారవర్ణమగు యకారమునకు ప్రకృతసూత్రముచే ద్విత్వము వచ్చి గౌర్ + య్ + య్ + ఔ = గౌర్య్యౌ అనురూపమేర్పడును.

ఈ సూత్రముచేవచ్చు ద్విత్వము వికల్పము కనుక ద్విత్వమురాని పక్షమున గౌర్ + ఈ + ఔ = గౌర్యౌ అనురూపమగును.

ఇట్లే హర్యనుభవః, కార్యమ్ మున్నగుచోట్ల యకారమునకు; కర్మ మున్నగుచోట్ల మకారమున కీ సూత్రముచే ద్విత్వము వికల్పముగ వచ్చునని గ్రహింపవలెను.

వా :- న సమాసే

సమాసమున పదాన్తమందున్న ఇక్కులకు (ఇ, ఉ, ఋ, ఌలకు) అసవర్ణములగు అచ్చులు పరమగునపుడు హ్రస్వాదేశములు రావు.

ఇకోఽసవర్ణే అను సూత్రముచే పదాన్తమందున్న ఇక్కులకు విధింపబడిన హ్రస్వము సమాసమున రాదని భావము.

వాప్యశ్వః :- (బావియందలి గుఱ్ఱము) ఈ పదము సప్తమీతత్పురుషము. (వాప్యాం అశ్వః వాప్యశ్వః) వాపీ + అశ్వః అనియుండగా 'ఇకోఽసవర్ణే శాకల్యస్య హ్రస్వశ్చ' అను సూత్రముచే పకారముమీది పదాన్తమగు ఈకారమునకు హ్రస్వము ప్రాప్తించగా నీ వార్తికముచే నది నిషేధింపబడినది. కనుక యణాదేశమువచ్చి వాప్యశ్వః అను రూపమేర్పడును. హ్రస్వమే వచ్చినచో పిదప యణాదేశము రాక వాపి అశ్వః అను నసాధురూపమేర్పడెడివి. కనుకనే ఈ వార్తికముచే దీర్ఘమునకు హ్రస్వాదేశము నిషేధింపబడినది.

సూ :- ఋత్యకః ౬-౧-౧౨౮.

ప. వి :- ఋతి, అకః

వృ :- ఋతి పరే పదాన్తా అకః ప్రాగ్వద్వా.

హ్రస్వమగు ఋకారము పరమగునపుడు పదాన్తమందున్న అక్కులు ([1] ఆ. ఈ. ఊ. ౠ అనునవి) వికల్పముగ హ్రస్వము లగును.

బ్రహ్మఋషిః :- బ్రహ్మా + ఋషిః అను వ్యస్తరూపమున హ్మాలోని పదాన్తమగు అక్కునకు (ఆకారమునకు) హ్రస్వఋకారము పరమగుటచే ప్రకృతసూత్రముచే హ్రస్వమువచ్చి బ్రహ్మఋషిః అనియగును. హ్రస్వవిధానసామర్థ్యముచే పూర్వమువలెనే 'ఆద్గుణః' అను సూత్రముచే గుణము రాదు.

ఈ సూత్రముచే వచ్చు హ్రస్వము వికల్పమగుటచే హ్రస్వము రాని పక్షమున 'ఆద్గుణః' అను సూత్రముచే గుణము వచ్చి బ్రహ్మర్షిః అను రూప మేర్పడును.

పదాన్తాః కిమ్ ? ఆర్ఛత్

సూత్రార్థమున పదాన్తాః అను పదమెందులకు :ఆర్ఛత్ అనురూపము సిద్ధించుటకొఱకు.

సూత్రార్థమున పదాన్తాః అనుపదము లేనిచో ఆ + ఋచ్ఛత్ అను చోట ఆ అను అక్కు హ్రస్వఋకారము పరమందుండుటచే హ్రస్వమై పిదప వృద్ధిరాక అ + ఋచ్ఛత్ అను నసాధురూప మేర్పడును. పదాన్తాః అను పదమున్నచో ఆ + ఋచ్ఛత్ అనుచోట 'ఆ' అను ఉపసర్గము పదము కాకపోవుటచే పదాన్తమగు అక్కు కాదు. కనుక హ్రస్వమురాక వృద్ధివచ్చి ఆర్ఛత్ అనురూప మేర్పడును. కనుక పదాన్తాః అనుపదమవసరము.

ఇత్యచ్సంధిప్రకరణమ్

---

1. అక్ ప్రత్యాహారమున ఌకారమున్నను దానికి దీర్ఘము లేనందున ౡ అనునది గ్రహింపబడలేదు.

అథ హల్సంధిప్రకరణమ్

సూ :- స్తోః, శ్చునా, శ్చుః. ౮-౪-౪౦

వృ :- సకార తవర్గయోః శకారచవర్గాభ్యాం యోగే శకారచవర్గౌ స్తః. రామశ్శేతే. రామశ్చినోతి. సచ్చిత్. శార్ఙ్గిఞ్జయ.

సకారతవర్గములకు శకారచవర్గములతో యోగము (కలయిక) ఉన్నప్పుడు శకారచవర్గలు ఆదేశములగును.

ఈ సూత్రముచే సకారతవర్గముల స్థానములో శకారచవర్గములు విధింపబడుచున్నవి. కనుక సకారతవర్గములు స్థానులు. శకారచవర్గములు ఆదేశములు. ఈ స్థాన్యాదేశములకు రెంటికిని క్రమాన్వయమును చెప్పవలెను. అనగా సకారమునకు శకారము, తకారమునకు చకారము ఇత్యాదిగా ఆదేశములగునని భావము. సకారతవర్గములకు శకారచవర్గములతో యోగమున్నపుడే శకారచవర్గములు ఆదేశములగును. ఇవి నిమిత్తములగు శకారచవర్గములకును, ఉద్దేశములగు సకారతవర్గములకును క్రమాన్వయము చెప్పగూడదు. అనగా సకారమునకు శకారముతోదనేకాక చవర్గములోని యే వర్ణముతో యోగమున్నను శకార మాదేశమగునని భావము. ఇట్లే తవర్గమునకు చవర్గముతోదనేకాక శకారముతో యోగమున్నను చవర్గమాదేశమగును.

సకారతవర్గములకు శకారచవర్గములతో యోగముంటుట యనగా సకారతవర్గములు పూర్వమందుండి శకారచవర్గములు పరమందే యుండవలెనని కాదు. ఎట్లన యోగమన కలయిక. సకారతవర్గములకు శకారచవర్గ

లతో యోగమున్న పక్షమున్నచో శకారచవర్గలు పూర్వమందుండి సకార తవర్గలు పరమందున్నను సకారతవర్గలకు శకారచవర్గలతో యోగ మున్నట్లే. కనుక సకారతవర్గలకు శకార, చవర్గలలో నేవర్ణము పర మందున్నను, ఇట్లే శకారచవర్గలకు సకారతవర్గములలో నే వర్ణము పరమందున్నను సకారతవర్గలకు శకారచవర్గలు ఆదేశములగునని భావము.

ఇట సకారతవర్గములకు 'శ్చు' (శకారచవర్గలు) ఆదేశముగ విధింపబడుటచే దీనిని శ్చుత్వసంధి యని వ్యవహరింతురు.

రామశ్శేతే :- (రాముడు నిద్రించుచున్నాడు) రామస్ + శేతే అనుచోట సకారమునకు శకారముతో యోగముండుటచే ప్రకృతసూత్రముచే సకారస్థానమున [1]యథాసంఖ్య నియమముచే శకారమాదేశమై రామశ్ + శేతే = రామశ్శేతే అను రూపమేర్పడును.

రామశ్చినోతి :- (రాముడేరుకొనుచున్నాడు) రామస్ + చినోతి అనుచోట సకారమునకు చవర్గము (చకారము)తో యోగముండుటచే సకారస్థానమున శకారమాదేశమై రామశ్ + చినోతి = రామశ్చినోతి అని యగును.

సచ్చిత్ :- సత్ + చిత్ అని యుండగా సత్‌లోని తకారమునకు చిత్‌లోని చకారముతో యోగముండుటచే తకారస్థానమున చకారమాదేశమై సచ్ + చిత్ = సచ్చిత్ అను రూపమేర్పడును.

శార్ఙ్గిఞ్జయ :- (ఓ విష్ణూ! వర్ధిల్లుము) శార్ఙ్గిన్ + జయ అనుచోట నకారమునకు జకారముతో యోగముండుటచే నకారస్థానమున ఞకార మాదేశమై శార్ఙ్గిఞ్ + జయ = శార్ఙ్గిఞ్జయ అనురూప మేర్పడును.

---

1. యథాసంఖ్యమనుదేశః సమానామ్.

సూ :- శాత్ ८-४-४४

వృ :- శాత్ పరస్య తవర్గస్య శ్చుత్వం న స్యాత్. విశ్నః. ప్రశ్నః.
శకారమునకు పరముగనున్న తవర్గకు శ్చుత్వము రాదు.

విశ్నః :- (గమనము, భాషణము) విశ్ + నః అనుచోట శకారమునకు తవర్గము (నకారము)తో యోగముండుటచే నకారస్థానమున పై సూత్రముచే చవర్గము (ఞకారము) ఆదేశముగ ప్రాప్తించినది. కాని విశ్ + నః అనుచోట శకారమునకు తవర్గ (నకారము) పరమగుటచే ప్రకృత సూత్రముచే శ్చుత్వము నిషేధింపబడినది కనుక నకారమునకు ఞకారము రాక విశ్నః అనియే యుండును. విశ్ఞః అను రూపము కాదు.

ప్రశ్నః :- (అడుగుట) ప్రశ్ + నః అనుచోటను పై వలెనే శ్చుత్వము నిషేధింపబడి ఉన్నదున్నట్లుగ ప్రశ్నః అనియే యుండును.

"స్తోః శ్చునా శ్చుః" అను పూర్వసూత్రమున సకారతవర్గలకు శకారచవర్గలు పరమగునపుడేకాక; శకారచవర్గలకు సకారతవర్గలు పరమగునపుడును శ్చుత్వము ఆదేశమగునని చెప్పుట కీ సూత్రమే ప్రమాణము. సకారతవర్గలకు శకారచవర్గలు పరమగునపుడే శ్చుత్వము వచ్చినచో విశ్ + నః అనుచోట తవర్గకు శకారము పరముగ లేనందున శ్చుత్వమునకు ప్రసక్తియే యుండదు. ప్రసక్తియే లేనప్పుడు నిషేధము కుదురదు కదా! కనుక సకారతవర్గలకు శకారచవర్గలు పరమగునపుడని కాక సకారతవర్గలకు శకారచవర్గతో యోగమున్నపుడని చెప్పవలెను.

సూ:- ష్టునా, ష్టుః ८-४-४१

వృ:- స్తోః ష్టునా యోగే ష్టుః స్యాత్. రామష్షష్ఠః. రామష్టీకతే: పేష్టా తట్టీకా: చక్రిణ్ఢౌకసే.

సకారతవర్గలకు షకారటవర్గలతో యోగమున్నపుడు షకారటవర్గము లాదేశములగును.

ఈ సూత్రమునకు పూర్వ సూత్రమునకువలె స్థాన్యాదేశములకు (సకారతవర్గలు – షకారటవర్గలు) మాత్రమే యథాసంఖ్యాన్వయము. స్థానులకు (సకారతవర్గములకు) నిమిత్తములకు (షకారటవర్గములకు) ఇట్టి క్రమాన్వయములేదు. ఉదాహరణమునకు సకారమును తీసికొందము. దీనికి షకారముతోడనే కాక టవర్గములోని యే వర్ణముతో యోగమున్నను షకారమాదేశమగునని భావము. సకారతవర్గలకు షకారటవర్గలతో యోగమున్నపుడుటచే సకారతవర్గలకు షకారటవర్గలు పరమందున్నను ఇట్టే షకారటవర్గలకు సకారతవర్గలు పరమందున్నను సకారతవర్గముల స్థానమున షకార టవర్గములు ఆదేశములగునని భావము.

రామష్షష్ఠః : (రాముడారవవాడు) రామస్ + షష్ఠః అనుచోట సకారమునకు షష్ఠలోని మొదటి షకారముతో యోగముండుటచే సకార స్థానమున షకారమాదేశమై రామష్ — షష్ఠః అను రూపమేర్పడును.

రామష్టీకతే : (రాముడు పోవుచున్నాడు) రామస్ + టీకతే అనుచోట సకారమునకు ట వర్గము (టకారము) తో యోగముండుటచే సకార స్థానమున షకార మాదేశమై రామష్ + టీకతే = రామష్టీకతే అను రూప మేర్పడును.

పేష్టా : (పేషణము చేయువాడు. పేషణము చేయగలడు)। పేష్ + తా అనుచోట పేష్ లోని షకారమునకు తకారముతో (తవర్గముతో) యోగముండుటచే తకారస్థానమున టకారమాదేశమై పేష్ + టా = పేష్టా అని యగును.

తట్టీకా :- (అతనియొక్క టీక) తత్ + టీకా అను చోట తకారమునకు టకారముతో యోగముండుటచే ప్రకృతసూత్రముచే తకారస్థానమున టకారమాదేశమై తట్ + టీకా = తట్టీకా అని యేర్పడును.

చక్రిణ్ఢౌకసే :- (ఓ చక్రధారీ! పోవుచున్నావు) చక్రిన్ + ఢౌకసే అను చోట నకారమునకు (తవర్గకు) ఢకారముతో (టవర్గముతో) యోగ ముండుటచే నకారస్థానమున ణకారము (టవర్గము) ఆదేశమై చక్రిణ్ + ఢౌకసే = చక్రిణ్ఢౌకసే అను రూపమేర్పడును.

ఈ సూత్రమున షకార (ష్టు)ట వర్గలు ఆదేశములుగ విధింపబడుటచే దీనిని ష్టుత్వసంధి యందురు.

సూ :- న పదాన్తాట్టోరనామ్ ౮-౪-౪౨

ప. వి :- న, పదాన్తాత్, టోః, అనామ్.

వృ :- పదాన్తాట్టవర్గాత్ పరస్య అనామః స్తోః ష్టుర్న స్యాత్. షట్సన్తః, షట్ తే.

పదాన్తమగు టవర్గకు పరమైనదియు, నామ్ సంబంధము లేనిదియు అగు సకార తవర్గలకు షకార టవర్గలు ఆదేశములుగ రావు.

టవర్గమునకు సకార తవర్గలతో యోగమున్నపుడు సకార తవర్గముల స్థానమున క్రమముగా షకార టవర్గము లాదేశములగునని పై సూత్రమున చెప్పబడినది. కాని యా టవర్గము పదాన్తమందున్నచో షకార టవర్గములు రావని భావము.

షట్సన్తః :- (ఆరుగురు సజ్జనులు) షట్ + సన్తః అనుచోట టకారమునకు సకారముతో యోగముండుటచే పై సూత్రముచే సకారస్థానమున షకారమాదేశముగ ప్రాప్తించినది. కాని షట్ + సన్తః అను చోట టకారము పదాన్తమున నుండుటచే దానికి పరమందున్న సకారమునకీసూత్రముచే ష్టుత్వము నిషేధింపబడి షట్సన్తః అనియే యుండును.

షట్ తే :- (వారారుగురు) షట్ + తే అనుచోట టకారము పదాన్తమందుండుటచే దానికి పరమందున్న తకారమునకు ప్రకృత సూత్రముచే ష్టుత్వము నిషేధింపబడుటచే షట్ తే అనియే యుండును.

వృ :- పదాన్తాత్ కిమ్? ఈట్టే.

పదాన్తాత్ అను పదమెందులకు? ఈట్టే అనుచోట అసాధురూపము వారించుట కొరకు.

ఈ సూత్రమున పదాన్తాత్ అనుపదము లేనిచో టవర్గకు పరముందున్న సకారతవర్గములకు ష్టుత్వము రాదని సూత్రార్థము. అనగా ఈట్ + తే అనుచోటను టకారమునకు పరమందున్న తకారమునకును ష్టుత్వము (టకారము) రాక ఈట్ — తే = ఈట్తే అను రూపము సిద్ధింపదు. సూత్రమున పదాన్తాత్ అనుపదమున్నచో టవర్గము పదాన్తమున నున్నపుడే దానికి పరమందున్న సకారతవర్గములకు ష్టుత్వము రావని సూత్రమునకర్థము. ఈట్ — తే అనుచోట ఈట్ అనునది పదాన్తము కాకపోవుటచే పదము కానందున టకారము పదాన్తము కాదు కనుక నీసూత్రముచే ష్టుత్వనిషేధము రాక పై సూత్రముచే ష్టుత్వమే వచ్చి ఈట్టే అను రూపము సిద్ధించును.
వృ :- టోః కిమ్? సర్పిష్టమమ్.

టవర్గమునకు అను పదమెందులకు? సర్పిష్టమమ్ అనుచోట నసాధురూపము ఏర్పడకుండుటకు.

సూత్రమున టోః (టవర్గమునకు) అను పదములేనిచో పదాన్తమున టవర్గమున్నపుడే ష్టుత్వనిషేధము వచ్చునను నియమముండదు. అప్పుడు సర్పిష్ + తమమ్ అనుచోట పదాన్తమైన షకారమునకు పరముగనున్న తకారమునకు సూత్రముచే ష్టుత్వనిషేధమే వచ్చి అనగా ష్టుత్వము (టకారాదేశము) రాక సర్పిష్తమమ్ అను నసాధు రూపమేర్పడవలసి వచ్చును. సూత్రమున టోః అను పదమున్నచో పదాన్తమున టవర్గమున్నపుడే పరమందున్న సకారతవర్గములకు ష్టుత్వము ఆదేశముగ రాదని సూత్రమునకర్థము. సర్పిష్ + తమమ్ అనుచోట పదాన్తమున టవర్గములేకపోవుటచే నీసూత్రముచే ష్టుత్వనిషేధమురాక తకారస్థానమున ష్టుత్వము (టకారము) ఆదేశమై సర్పిష్టమమ్ అనురూపము సిద్ధించును.

ఈ సూత్రమునందలి అనామ్ అను పదమునకు "నామ్ అవయవముకాని" అని యర్థము. (నామ్ అనునది షష్ఠీబహువచన ప్రత్యయమగు ఆమ్‌కు పూర్వమందు నుడాగమము వచ్చి యేర్పడినరూపము) పదాన్తమగు టవర్గకు పరమైన తవర్గకు ఈ సూత్రముచే నిషేధింపబడిన ష్టుత్వనిషేధము నామ్‌లోని అవయవమగు నకారమునకు రాదని భావము. అనగా నామ్‌లోని నకారమునకు ష్టుత్వము (ణకారము) వచ్చునని తాత్పర్యము. ఈ విషయ మీక్రింది వార్తికమున సోదాహరణముగ వివరింపబడును.

వా:- అనామ్నవతి నగరీణామితి వాచ్యమ్. షణ్ణామ్. షణ్ణవతిః. షణ్ణగర్యః

పై సూత్రమున ష్టుత్వనిషేధము (ష్టుత్వము రాకుండుట) నామ్‌లోని నకారమునకు రాదని తెలుపబడినది. ఈవార్తికముచే నామ్ అనుదానితోపాటు నవతి,నగరీ అనుశబ్దములలోని నకారమునకును ష్టుత్వనిషేధము రాదని వార్తికకారుడు తెలుపుచున్నాడు. అనగా నవతి, నగరీ అను పదములలోనున్న నకారము పదాన్తమైన టవర్గకు పరమందున్నను ష్టుత్వనిషేధమురాక ష్టుత్వమే వచ్చునని తాత్పర్యము.

షణ్ణామ్:- (నలుగురియొక్క) షడ్ + నామ్ అనుచోట పదాన్తమందున్న టవర్గ (డకారము) మునకు తవర్గ(నకారము) పరమందుండుటచే నకారమునకు ష్టుత్వ నిషేధము వచ్చుచుండగ సూత్రము నందలి అనామ్ అనునిషేధముచే ష్టుత్వ నిషేధము రాక ష్టుత్వమే వచ్చి షడ్ + ణామ్ అని యగును. పిదప డకార స్థానమున అనునాసికము నిత్యముగ వచ్చి షణ్ + ణామ్ = షణ్ణామ్ అనురూపమేర్పడును.

షణ్ణవతిః : (తొంబదియారు) షడ్ + నవతిః అనియుండగా 'నపదాన్తాట్టోః' అను సూత్రముచే నకారమునకు ష్టుత్వ నిషేధము ప్రాప్తింపగా ప్రకృత వార్తికముచే ష్టుత్వ నిషేధమురాక ష్టుత్వమే (ణకారమే) వచ్చి షడ్ + ణవతిః అని యగును. పిదప డకార స్థానమున అనునాసికము వచ్చి షణ్ + ణవతిః = షణ్ణవతిః అను రూప మేర్పడును.

షణ్ణగర్యః :- (ఆరు నగరములు) షష్ + నగర్యః అని యుండగా పైవలెనే ష్టుత్వము వచ్చి షణ్ణగర్యః అను రూప మేర్పడును.

సూ:- తోః షి. 8-4-43

వృ:- న ష్టుత్వమ్. సన్షష్ఠః.

ష్టుత్వము రాదు.

తవర్గకు షకారము పరమగునప్పుడు ష్టుత్వమాదేశముగ రాదు.

సన్షష్ఠః:- (ఆఱవసజ్జనుడు) సన్ + షష్ఠః అనుచోట తవర్గకు (నకారమునకు) షకారముతో యోగముండుటచే తవర్గ స్థానమున (నకారస్థానమున) ష్టునా ష్టుః అను సూత్రముచే ష్టుత్వముచే ణకారము ఆదేశముగ ప్రాప్తించినది. ఈ సూత్రముచే తవర్గకు (నకారము) షకారము పరమందుండుటచే ష్టుత్వము నిషేధింపబడినది. కనుక సన్ + షష్ఠః అనుచోట నకారస్థానమున ష్టుత్వముచే ణకారమురాక సన్షష్ఠః అనియే యుండును. ష్టుత్వమేవచ్చినచో సణ్షష్ఠః అని కావలసి యుండును.

సూ:- ఝలాం జశోఽన్తే 8-2-39

ప ది :- ఝలాం, జశః, అన్తే

వృ :- పదాన్తే ఝలాం జశః స్యుః. వాగీశః.

పదాన్తమందున్న ఝల్ ప్రత్యాహారవర్ణములకు జశ్ ప్రత్యాహార వర్ణము (జబగడదలు) లాదేశము లగును.

వివ :- ఝల్ ప్రత్యాహారముచే వర్గలలోని ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ వర్ణములును, శ,ష,స, హలును గ్రహింపబడును. జశ్ ప్రత్యాహారముచే వర్గములలోని తృతీయ వర్ణములు గ్రహింపబడును. ఆయా వర్గములలోని వర్ణములకు ఆయా వర్గములలోని తృతీయ వర్ణములే ఆదేశము లగును. షకారస్థాన

మగు స్థానసామ్యముచే (ఝలాంజశోఽన్తే)దకారమాదేశ మగును. మిగిలిన వర్ణములకు సాధారణముగ ఉదాహరణములు లభించును.

వాగీశ -(బృహస్పతి) వాక్ + ఈశ అనుచోట వాక్ అను పదము చివర నున్న ఝల్లు (కకారము) స్థానమున జశ్ (గకారము) ఆదేశమై వాగ్ + ఈశ = వాగీశ అను రూప మేర్పడును

ఈ సూత్రముచే జశ్ జశ్త్వము విధింపబడుచున్నది కనుక జశ్త్వ సంధి యని యందురు

ఇట్లే జగత్ + ఈశ = జగదీశ అనియు కకుప్ + ఈశ = కకుబీశః అనియు రూపములీ సూత్రము చేత సిద్ధించును

సూ - యరోఽనునాసికేఽనునాసికో వా ౮-౪-౪౫

పదచ్ఛేదః యరః అనునాసికే అనునాసికః వా

వృత్తి - యరః పదాన్తస్య అనునాసికే పరే అనునాసికః వా స్యాత్ ఏతన్మురారిః ఏతద్మురారిః

పదాంతమందున్న యర్ ప్రత్యాహార వర్ణములకు అనునాసికము పరమైనపుడు అనునాసికము వికల్పముగా వచ్చును

యర్ ప్రత్యాహారముచే హకారము తప్ప మిగిలిన హల్లు లన్నియు గ్రహింపబడును

ఏతన్మురారి - (ఈ విష్ణువు) ఏతద్ + మురారి అనుచోట ఏతద్ లోని పదాంతమైన యర్ ప్రత్యాహార వర్ణమగు దకారమునకు అనునాసికము (నకారము)ఆదేశమై ఏతన్ + మురారి = ఏతన్మురారిః అయినగును

ఈ సూత్రముచే విధింపబడిన అనునాసికము వికల్పము కనుక నది రాని పక్షమున ఏతద్మురారి అనియే యుండును

ఇట్లే షట్ + మాసాః షణ్మాసాః అనియు దిక్ + మూర్ధం = దిఙ్మూర్ధం అనియు రూపము లెఱుగునది

వా - ప్రత్యయే భాషాయాం నిత్యమ్ తన్మాత్రమ్ చిన్మయమ్

లౌకిక ప్రయోగమున అనునాసిక వర్ణమాదియందుగల ప్రత్యయము పరమగునపుడు పదాన్తమందున్న యర్ ప్రత్యాహార వర్ణము-కు అనునాసికవర్ణము నిత్యముగ ఆదేశమగును

తన్మాత్రమ్ -(అంతమాత్రమే) తద్ + మాత్రమ్ అనుచోట పరమందున్న మాత్రఅనునది లౌకిక ప్రయోగములోని అనునాసికాది యగు ప్రత్యయము కనుక యర్ (దకారము) స్థానమున అనునాసికము నిత్యముగా వచ్చి తన్ + మాత్రమ్ = తన్మాత్రమ్ అని యేర్పడును ఈ వార్తికము లేనిచో పై సూత్రముచే వికల్పముగ అనునాసిక మాదేశమై అనునాసికము రాని పక్షమున తద్మాత్రమ్ అను నసాధు రూపము ఏర్పడ వలసి వచ్చును

చిన్మయమ్ -(జ్ఞాన స్వరూపము-చేతన స్వరూపము) చిద్ + మయమ్ అనుచోట చిద్ లోని పదాన్తమైన దకారమునకు మయ అను అనునాసికాది ప్రత్యయము పరమగుటచే నిత్యముగా అనునాసికము (నకారము) ఆదేశమై చిన్మయమ్ అను రూప మేర్పడును

ఇట్లే వాగ్ + మయమ్ మృద్ + మయమ్ అను చోట్లను నిత్యముగ అనునాసిక మాదేశమై వాఙ్మయమ్ మృణ్మయమ్ అను రూపము లేర్పడును

సూ -తోర్లి ౮-౪-౬౦

పవి -తోః లి

వృ -తవర్గస్య లకారే పరే పరసవర్ణః స్యాత్ తల్లయ విద్వాల్లిఖతి నస్య అనునాసికో లః

తవర్గమునకు లకారము పరమగునపుడు పరసవర్ణము వచ్చును

తల్లయ - (దానియొక్క నాశము) తద్ + లయః అనుచోట తవర్గకు (ద్ అనువర్ణమునకు) లకారము పరమగుటచే దకారస్థానమున పరసవర్ణమైన (లకార సవర్ణమైన) లకారమాదేశమై తల్ + లయః = తల్లయ అను రూపమేర్పడును

విద్వాల్లిఖతి - (విద్వాంసుడు వ్రాయుచున్నాడు) విద్వాన్ + లిఖతి అనుచోట తవర్గకు (నకారమునకు) లకారము పరమగుటచే పర సవర్ణమైన (లకార సవర్ణమైన) లకారమాదేశమై విద్వాల్ + లిఖతి అనియగును ఇట్లు అనునాసికమగు నకారస్థానమున వచ్చు లకారము కూడ అనునాసికముగనే వచ్చి విద్వాల్లిఖతి అని యగును

సూ - ఉదః స్థాస్తమ్భోః పూర్వస్య ౮-౪-౬౧

వృ - ఉదః పరయోః స్థాస్తమ్భోః పూర్వసవర్ణః స్యాత్

ఉత్ అను నుపసర్గమునకు పరములగు స్థా మరియు స్తంభ్ ధాతువుల స్థానమున పూర్వసవర్ణ మాదేశమగు

స్థా స్తంభ్ ధాతువులకు పూర్వమందున్న వర్ణముయొక్క సవర్ణము ఆదేశమగునని భావము

ఉద్ + స్థానమ్ ఉద్ + స్తమ్భనమ్ అనుచోట్ల ఉత్ అను ఉపసర్గ మునకు స్థా మరియు స్తంభ్ ధాతువులు పరమందున్నవి స్థానమ్ అనునది స్థా ధాతువుయొక్కయు స్తమ్భనమ్ అనునది స్తమ్భధాతువు యొక్కయు రూపములు కనుక ఈ స్థా స్తమ్భధాతువులకు పూర్వ సవర్ణము (దకార సవర్ణము) ఆదేశముగ వచ్చునని భావము

సూ - తస్మాదిత్యుత్తరస్య ౧-౧-౬౭

ప వి - తస్మాత్ ఇతి ఉత్తరస్య

వృ - పంచమీనిర్దేశేన క్రియమాణం కార్యం వర్ణాన్తరేణ అవ్యవహితస్య పరస్య జ్ఞేయమ్

పంచమీవిభక్తి నిర్దేశముచేవిధింపబడు కార్యము వర్ణాంతరములచే వ్యవధానములేని పరమునకు వచ్చును

ఏ సూత్రమున పంచమీవిభక్త్యంతమగు శబ్దమును నిర్దేశించి కార్యము విధింపబడునో అట్టి కార్యము ఆ పంచమీ విభక్త్యంతముచే బోధింపబడు వర్ణమునకు ఇతరవర్ణములతో వ్యవధానము లేక పరమందున్న వర్ణము స్థానమున వచ్చునని తాత్పర్యము ఉదః స్థాస్తమ్భోః అను పూర్వసూత్రమున ఉదః అను పంచమ్యంతపదమును నిర్దేశించి పూర్వ సవర్ణము ఆదేశముగ విధింపబడినది కనుక ప్రకృతసూత్రముచే ఉద్ మఱియు స్థా స్తంభ్ ధాతువుల నడుమ ఏవర్ణమును లేనప్పుడే పూర్వ సవర్ణమాదేశమగును ఉద్ + స్థానమ్ ఉద్ + స్తమ్భనమ్ అను చోట ఉద్ అను ఉపసర్గమునకును స్థా స్తమ్భ ధాతువులకును నడుమ ఏ వర్ణమును లేదు కనుక ప్రకృత సూత్రము ప్రవర్తించును

ఈ సూత్రము ప్రవర్తించినను స్థా స్తంభ్ ధాతువుల మొత్తమునకు పూర్వ సవర్ణము ప్రాప్తించినది పిదప అలోఽన్త్యస్య అను సూత్రముచే స్థా స్తమ్భ ధాతువుల అన్త్యవర్ణమునకు ఆదేశముగ ప్రాప్తించగా దానికి బాధకముగ నీ క్రింది సూత్రము చెప్పబడుచున్నది

సూ - ఆదేః పరస్య ౧-౧-౫౪

వృ - పరస్య యద్విహితం తత్తస్య ఆదేర్బోధ్యమ్

పరమందున్న పదమును కే కార్యము విధింపబడునో ఆ కార్యము పరపదముయొక్క మొదటి వర్ణము స్థానమున వచ్చునని తెలియవలెను

ఈ పరిభాషచే ఉద్ + స్థానమ్ ఉద్ + స్తమ్భనమ్ అనుచోట్ల పరమందున్న స్థా, స్తమ్భ అను వానికి విధింపబడిన పూర్వ సవర్ణము వాని ఆది వర్ణమగు సకారస్థానముననే వచ్చును స్థా స్తమ్భ అనువాని

మొత్తమునకు కాని చివరి వర్ణమునకు కాని పూర్వసవర్ణము ఆదేశము కాదని ఫలితార్థము

వృ - ఇతి సస్య థః

ఈ ప్రకారముగ సకారస్థానమున థకారము ఆదేశమగును

ఉద్ + స్థానమ్ అనుచోట ఉదః స్థాస్తమ్భోః అను సూత్రముచే వచ్చు పూర్వ సవర్ణము స్థా స్తమ్భ ధాతువుల లోలి వర్ణమగు సకార స్థానమున వచ్చునని పైన చెప్పబడినది ఇట పూర్వసవర్ణమనగా దకారమునకు సవర్ణమని భావము ఆస్య ప్రయత్నములు సమానముగ నై వర్ణములకుండునో అవి సవర్ణములు ఇట సకార స్థానమున పూర్వ సవర్ణము (దకార సవర్ణము) గ వచ్చు వర్ణమునకు సకారమున కే ప్రయత్నము లుండునో ఆ ప్రయత్నములుండవలెనని భావము సకారమునకు వివారము శ్వాసము అఘోషము మహాప్రాణము అను ప్రయత్నములు కలవు తవర్గలోని థకారమునకును ఈ ప్రయత్నము లుండుటచే ఇట సకార స్థానమున థకార మాదేశమై ఉద్ + థ్ + థానమ్ ఉద్ + థ్ + తమ్భనమ్ అనియు ఏర్పడును

సూ - ఝరో ఝరి సవర్ణే ८-४-६४

పద) హల్ ఝయః ఝరి సవర్ణే

వృ - హలః పరస్య ఝరో వా లోపః సవర్ణే ఝరి

హల్లునకు పరమందున్న ఝర్ ప్రత్యాహార వర్ణమునకు సవర్ణములగు ఝర్ ప్రత్యాహారవర్ణములు పరమగుచో లోపము వికల్పముగ వచ్చును

పై సూత్రముచే పూర్వ సవర్ణము వచ్చి ఉద్ + థ్ + థానమ్ ఉద్ + థ్ + తమ్భనమ్ అను రూపము లేర్పడును ఇట ఉద్‌లోని హల్లు

నకు (దకారమునకు) పరమందు ఝర్ ప్రత్యాహారవర్ణమును (థకారమును) దానికి పరమందు సవర్ణమైన ఝర్ ప్రత్యాహారవర్ణమును (థానమ్‌లోని థకారము తమ్భనమ్‌లోని తకారము) పరమందుండుటచే ప్రకృతసూత్రముచే పూర్వమందున్న థకారము లోపించి ఉద్ + థానమ్ ఉద్ + తమ్భనమ్ అనియు నగును

ఈ సూత్రముచే చెప్పబడిన కార్యము వికల్పము కనుక నిది రాని పక్షమున ఉద్ + థ్ + థానమ్ ఉద్ + థ్ + తమ్భనమ్ అనియే యుండును

సూ - ఖరి చ ८-४-५५

వృ - ఖరి ఝలాం చరః స్యుః

ఖర్ ప్రత్యాహారవర్ణములు (వర్గముల ప్రథమ ద్వితీయాక్షరములు మఱియు శషసలు) పరమగునపుడు ఝల్ ప్రత్యాహారవర్ణముల స్థానమున చర్ ప్రత్యాహారవర్ణము లాదేశమగును

వృ - ఇతి ఉదో దస్య త ఉత్థానమ్ ఉత్తమ్భనమ్

ఈ విధముగ ఉద్‌లోని దకారమునకు తకారమ్మాదేశమగును

ఉద్ + థానమ్ ఉద్ + తమ్భనమ్ అనుచోట్ల ఝల్లునకు (దకారమునకు) ఖర్ ప్రత్యాహారవర్ణములగు థకార తకారములు పరమగుటచే ఝల్లు స్థానమున (దకారస్థానమున) స్థానసామ్యముచే చర్ (తకారము) ఆదేశమై ఉత్ + థానమ్ = ఉత్థానమ్ అనియు ఉత్ + తమ్భనమ్ = ఉత్తమ్భనమ్ అనియు రూపము లేర్పడును

ఝరో ఝరి సవర్ణే అను పై సూత్రముచే థకారలోపము రాని పక్షమున ఉద్ + థ్ + థానమ్, ఉద్ + థ్ + తమ్భనమ్ అనుచోట్ల ఉద్ లోని దకారమునకును సకారస్థానమున పూర్వసవర్ణముగ వచ్చిన తకార

మునకును ప్రకృతసూత్రముచే చర్త్వము(తకారము)ఆదేశమై ఉత్ + త్ + థానమ్ (ఉత్థానమ్) అనియు ఉత్ + త్తంభనమ్ అనియు రెండు తకారములు గల రూపమేర్పడును

సూ - ఝయో హోఽన్యతరస్యామ్ ౮-४-౬౨

ప వి - ఝయ హః అన్యతరస్యామ్

వృ - ఝయః పరస్య హస్య వా పూర్వసవర్ణః

ఝయ్ ప్రత్యాహారవర్ణములకు (అనునాసికములు తప్ప మిగిలిన వర్గాక్షరములకు) పరమందున్న హకారమునకు పూర్వ సవర్ణము వికల్పముగ వచ్చును

వాగ్ఘరి - (వాక్కులో నిపుణుడు) వాగ్ + హరిః అనుచోట గకారము ఝయ్యై దానికి పరమందున్న హకారస్థానమున పూర్వసవర్ణము (గకార సవర్ణము) రావలెను హకార స్థానమున వచ్చు గకార సవర్ణమునకు హకారముతో ప్రయత్నసామ్య ముండవలెను ఆ ప్రయత్నములనే ఈ క్రింది వృత్తిలో వివరించుచున్నారు

వృ - నాదస్య ఘోషస్య సంవారస్య మహాప్రాణస్య తాదృశో వర్గ చతుర్థః వాగ్ఘరిః వాగ్హరిః

నాదము ఘోషము సంవారము మహాప్రాణము అను నీ ప్రయత్నములుకల హకారస్థానమున అవియే ప్రయత్నములుకల వర్గ చతుర్థాక్షరము (ఘకారము) ఆదేశముగ వచ్చును ఇట్లే హకారస్థానమున పూర్వమందున్న ఆయా వర్గముల చతుర్థాక్షరము లాదేశములగునని యెఱుగునది వాగ్ + హరిః అనుచోట హకారస్థానమున పూర్వమందున్న కవర్గయొక్క సవర్ణాక్షరమగు ఘకారమాదేశమై వాగ్ + ఘరిః = వాగ్ఘరిః అను రూపమేర్పడును

ఈ సూత్రముచే విధింపబడు ఛత్వ సవర్ణము వికల్పము కనుక నది రాని పక్షమున వాగ్హరిః అనియే యుండును

సూ - శశ్ఛోఽటి ८-४-६३

ప వి - శః ఛః అటి

వృ - ఝయః పరస్య శస్య ఛో వా అటి

ఝయ్ ప్రత్యాహార వర్ణమునకు పరమగు శకారమునకు అట్ ప్రత్యాహారవర్ణము పరమగునపుడు ఛకారము వికల్పముగ నాదేశమగును

ఉ - తద్ + శివ ఇత్యత్ర దస్య శ్చుత్వేన జకారే కృతే ఖరి చ ఇతి జకారస్య చకారః తచ్ఛివః తచ్శివః

తద్ + శివః అనుచోట దకారస్థానమున శ్చుత్వముచే జకారము పిదప ఖరి చ అను సూత్రముచే జకారమునకు చకారము ఆదేశమగును తచ్ఛివః - తద్ + శివః అనుచోట తవర్గకు (దకారమునకు) శకారముతో యోగముండుటచే స్తోః శ్చునా శ్చుః అను సూత్రముచే చవర్గము (జకారము) ఆదేశమై తజ్ + శివః అని యగును పిదప ఖరి చ అను సూత్రముచే జకారస్థానమున చర్త్వము(చకారము)ఆదేశమై తచ్ + శివః అని యగును ఇట ఝయ్యునకు (చకారమునకు) పరమందున్న శకారమునకు అట్ (శకారము మీది ఇకారము) పరమందుండుటచే శకార స్థానమున ప్రకృతసూత్రముచే ఛకారమాదేశమై తచ్ + ఛివః = తచ్ఛివః అను రూపమేర్పడును

ఈ సూత్రముచే శకారస్థానమున వచ్చు ఛకారాదేశము వికల్పమగుటచే నది రాని పక్షమున 'తచ్శివః అని యేర్పడును

వా - ఛత్వ మమీతి వాచ్యమ్ తచ్ఛ్లోకేన

అమ్ ప్రత్యాహారవర్ణములు పరమగునపుడు శకారమునకు ఛత్వము వచ్చునని చెప్పవలెను

శశ్ఛోఽటి అను పై సూత్రముచే శకారమునకు అట్ ప్రత్యాహార వర్ణము పరమందున్నపుడే ఛకారమాదేశమగునని చెప్పబడినది తచ్ + శ్లోకేన అనుచోట ఝయ్యునకు (చకారమునకు) పరమందున్న శకార మునకు పరమందు అట్ ప్రత్యాహార వర్ణము లేకపోవుటచే (లకారము అట్ ప్రత్యాహారమున చేరదు కనుక) శకారమునకు ఛత్వము రాకుండుటచె ఈ వార్తికముచే శకారమునకు అమ్ ప్రత్యాహార వర్ణము పరమందున్నపుడును ఛకారాదేశము విధింపబడినది తచ్ + శ్లోకేన అను చోట ఝయ్యునకు (చకారమునకు) పరమైన శకారమునకు అట్ ప్రత్యా హారవర్ణము పరముగలేకున్నను అమ్ ప్రత్యాహారవర్ణము (లకారము) పరమందుండుటచే శకారస్థానమున ఛకారము వచ్చి తచ్ + ఛ్లోకేన = తచ్ఛ్లోకేన అను రూపమేర్పడును

సూ - మోఽనుస్వారః ౮-౩-౨౩

వి - మః అనుస్వార

వృ - మాన్తస్య పదస్య అనుస్వారో హలి హరిం వన్దే

మకారాన్తమగు పదమునకు హల్లు పరమగునపుడు అనుస్వారము ఆదేశమగును

ఈ సూత్రమున మః (మకారాన్తమగు పదముయొక్క) అను షష్ఠీవిభక్త్యన్తమగు పదమును నిర్దేశించి అనుస్వారము విధింపబడుటచే అలోఽన్త్యస్య అను పరిభాషచే మకారాన్తమగు పదమునకు మొత్తము

నకు కాక దాని చివరి వర్ణము (మకారము) స్థానమున అనుస్వారము వచ్చునని భావము

హరింవన్దే - (విష్ణువును నమస్కరించుచున్నాను) హరిమ్ + వన్దే అను చోట హరిమ్ అనునది మకారాన్తమగు పదము దాని చివరనున్న మకారమునకు హల్లు (వన్దేలోని వకారము) పరమగుటచే మకార స్థానమున అనుస్వారము (సున్న) ఆదేశమై హరిం వన్దే అనియగును

సూ - నశ్చాపదాన్తస్య ఝలి ౮-౩-౨౪

ప వి - నః చ అపదాన్తస్య ఝలి

వృ - నస్య మస్య చ అపదాన్తస్య ఝలి అనుస్వారః యశాంసి ఆక్రంస్యతే

పదాన్తముకాని నకారమునకును మకారమునకును ఝల్ ప్రత్యాహారవర్ణము పరమగునపుడు అనుస్వారమాదేశమగును

యశాంసి - (యశస్సులు) యశాస్ + సి అనుచోట యశాస్‌లోని నకారము పదాన్తము కాదు దానికి పరమందు ఝల్లు (సకారము) ఉన్నది కనుక ప్రకృతసూత్రముచే నకారమునకు అనుస్వారమాదేశముగ వచ్చి యశాంసి అను రూపమేర్పడును

ఆక్రంస్యతే - (ఆక్రమింపబడును) ఆక్రమ్ + స్యతే అనుచోట ఆక్రమ్ లోని చివరి మకారము పదాన్తము కాకపోవుటచేతను దానికి పరమందు ఝల్లు ఉండుటచేతను ప్రకృతసూత్రముచే మకారస్థానమున అనుస్వారము వచ్చి ఆక్రంస్యతే అను రూపమేర్పడును

వృ - ఝలి కిమ్ ? మన్యసే

ఝలి అను పదమెందులకు ? మన్యసే అనుచోట అసాధు రూపమేర్పడకుండుట కొఱకు

సూత్రమున ఝలి అను పదముచేరినచో అపదాన్తమైన (పదాన్తములుకాని) నకారమకారములు స్థానమున అనుస్వారము వచ్చునని సూత్రార్థమేర్పడును అనగా పరమందు ఝల్లు ఉండవలసిన నియమముండదు అప్పుడు మన్ + యతే అనుచోట పదాన్తముకాని నకారస్థానమునను అనుస్వారమాదేశమై మంయతే అను అసాధు రూపమేర్పడవలసి వచ్చును సూత్రమున ఝలి అను పదమున్నచో మన్ + యతే అనుచోట పరమందున్న యకారము ఝల్లు కాదు కనుక నకారమునకు అనుస్వారమును వారింపవచ్చును

సూ - అనుస్వారస్య యయి పరసవర్ణః ౮-౪-౫౮

అనుస్వారమునకు యయ్ ప్రత్యాహార వర్ణములు (శ ష స హ లు తప్ప మిగిలిన హల్లులు) పరమగునపుడు పరసవర్ణము వచ్చును

శాన్తః - శామ్ + త అనుచోట నశ్చాపదాన్తస్య ఝలి అను సూత్రముచే మకారస్థానమున అనుస్వారము వచ్చి శాం + తః అని యగును ఇట శాం లోని అనుస్వారమునకు యయ్యు (తకారము) పరమందుండుటచే పరసవర్ణము (తకారసవర్ణము)గ తవర్గములో అనునాసికమగు నకారమాదేశమై శాన్తః = శాన్తః అని యేర్పడును

సూ - వా పదాన్తస్య ౮-౪-౫౯

ఉ ది - త్వఙ్కరోషి త్వంకరోషి

పదాన్తమందున్న అనుస్వారమునకు పరసవర్ణము వికల్పముగ వచ్చును

పై సూత్రముచే అనుస్వారమున కంతట పరసవర్ణాదేశము నిత్యముగ వచ్చుచుండగ నీ సూత్రముచే నా యనుస్వారము పదాన్తమైనచో దానికి నిత్యముగ కాక వికల్పముగ విధింపబడు చున్నది

త్వఙ్కరోషి - (నీవు చేయుచున్నావు) త్వమ్ + కరోషి అనచోట త్వమ్ లోని మకారమునకు మోఽనుస్వారః అను సూత్రముచే అనుస్వారమాదేశమై త్వం + కరోషి అనియగును త్వం లోని అనుస్వారము పదాన్తమగుటచే ప్రకృతసూత్రముచే దానికి పర (కకార) సవర్ణమగు ఙకారమాదేశమై త్వఙ్ + కరోషి = "త్వఙ్కరోషి అను రూపమేర్పడును

ఈ పరసవర్ణాదేశము వికల్పము కనుక అది రాని పక్షమున త్వం కరోషి అనియే యుండును

సూ - మో రాజి సమః క్వౌ. ౮-౩-౨౫

ప ఛే - మ రాజి సమ క్వౌ

వృ - క్విబన్తే రాజతౌ పరే సమో మస్య మ ఏవ స్యాత్

సమ్రాట్

క్విప్ ప్రత్యయాన్తమగు రాజతి ధాతువు పరమగునప్పుడు సమ్ అను ఉపసర్గము మకారమునకు మకారమే ఆదేశమగును

ఈ సూత్రముచే సమ్ లోని మకారమునకు మకారమే వచ్చునని చెప్పుటచే దానికి అనుస్వారము ఆదేశముగ రాదని భావము అనగా మోఽనుస్వారః అను అనుస్వార విధాయకసూత్రమునకిది యపవాద సూత్రము

సమ్రాట్ - (చక్రవర్తి) సమ్ + రాట్ అనుచోట సమ్ అను ఉపసర్గమునకు పరముగ రాట్ అను పదమున్నది ఇది రాజ్ ధాతువుపైన క్విప్ ప్రత్యయము రాగా సిద్ధించిన రూపము కనుక ప్రకృత సూత్రముచే సమ్ అను ఉపసర్గలోని మకారమునకు మకారమే ఆదేశమై సమ్‌రాట్ = సమ్రాట్ అను రూపమేర్పడును మోఽనుస్వారః

ఆ సూత్రముచే మకారమునకు అనుస్వారమాదేశమై సంరాట్ అను రూ పేర్పడదని భావము

సూ - హే మపరే వా ౮-౩-౨౬

వృ - మపరే హకారే పరే మస్య మో వా కిమ్హ్మలయతి కింహ్మలయతి

మకారము పరముందుగల హకారము పరమగునప్పుడు మకారమునకు మకారము వికల్పముగ ఆదేశమగును

మొదట హకారమును తరువాత మకారమును ఆ తరువాత మఱల మకారమును ఉన్నచో మొదటి మకారమునకు మకారము వికల్పముగ ఆదేశమగునని భావము

కిమ్హ్మలయతి - (ఏది కదులుచున్నది ?) కిమ్ + హ్మలయతి అనుచోట కిమ్ లోని మకారమునకు పరము హకారము దానికి పరము మకారము ఉండుటచే ప్రకృతసూత్రముచే తొలి మకారమునకు మకారమే ఆదేశమై కిమ్హ్మలయతి అనియే యుండును

మకారము కు మకారాదేశము వచ్చుట వికల్పము కనుక నదిరాని పక్షమున మోఽనుస్వారః అను సూత్రముచే మకారమునకు అనుస్వార మాదేశమై కింహ్మలయతి అని యేర్పడును

వా - యవలపరే యవలా వా. కియ్ఁహ్యః కిం హ్యః కివ్ఁ యతి కింహ్వలయతి కిల్ఁహ్లాదయతి కింహ్లాదయతి

యకారము వకారము లకారము ఇవి పరముగాగల హకారము పరమగునప్పుడు మకారమునకు యకార వకార లకారములు వికల్పముగ నాదేశములగును.

మకారమునకు యకారము పరమందుండిన హకారము పరమగు నప్పుడు యకారమును, వకారము పరముగాఁ గల హకారము పరమగు నప్పుడు వకారమును, లకారము పరముగాఁగల హకారము పరమగునప్పుడు లకారమును వికల్పముగా ఆదేశములగునని భావము.

కిఁయ్ హ్యః - (నిన్న ఏమి?) కిమ్ + హ్యః అనుచోట కిమ్‌లోని మకారమునకు యకారము పరమందుండు హకారము పరమందుండుటచే యకారాదేశమై కిఁయ్ హ్యః అని యగును.

యకారాదేశము వికల్పము కనుక రాని పక్షమున మకారమునకు అనుస్వారాదేశమై కిం హ్యః అను రూపమేర్పడును.

కిఁవ్ హ్వలయతి - కిమ్ + హ్వలయతి అనుచోట మకారమునకు వకారము పరమందుండిన హకారము పరముగానుండుటచే మకారస్థానమున వకారాదేశమై కిఁవ్ హ్వలయతి అను రూపమేర్పడును.

మకారమునకు వకారాదేశము రానిపక్షమున అనుస్వారము వచ్చి కిం హ్వలయతి అని యగును.

కిఁల్ హ్లాదయతి - కిమ్ + హ్లాదయతి అనుచోట మకారమునకు లకారపరకమైన హకారము పరమందుండుటచే మకారస్థానమున లకారాదేశమై కిఁల్ హ్లాదయతి అని యగును.

మకారమునకు లకారాదేశము రాని పక్ష[illegible]రము వచ్చి కిం హ్లాదయతి అని యగును.

సూ - నపరే నః ౮-౩-౨౭

వృ - నపరే హకారే పరే మస్య నో వా

మకారమునకు నకారము పరమందుండిన హకారము పరమగు నకారము వికల్పముగ ఆదేశమగును.

కిన్హ్నుతే - (ఏమి దాచుచున్నారు ?) కిమ్ + హ్నుతే అనుచోట మకారమునకు నకారము పరమందుగల నకారము పరమగుటచే మకారస్థానమున నకారమాదేశమై కిన్ + హ్నుతే = కిన్హ్నుతే అను రూపమేర్పడును

ఈ నకారాదేశము వికల్పము కనుక నదిరాని పక్షమున మకారమునకనుస్వారమాదేశమై కింహ్నుతే అని యగును

సూ - డ సి ధుట్ ౮-౩-౨౯

వృ - డాత్ పరస్య సస్య ధుడ్వా స్యాత్

డకారమునకు పరమైన సకారమునకు ధుట్ అను ఆగమము వికల్పముగ వచ్చును

ఈ సూత్రముచే డకారమునకు పరమందున్న సకారమునకు ధుట్ అను ఆగమము విధింపబడుచున్నది ఆ ధుట్ అను ఆగమము సకారమునకు పూర్వమున రావలెనా ? లేక పరమున రావలెనా ? అను శంక కలుగును (ధుడాగమము సకారమునకు పూర్వము వచ్చినను పరము వచ్చినను సకారమునకు వచ్చినట్లే కదా ?) కనుక ఈ యాశంక క్రింది సూత్రముచే తొలిగింప బడుచున్నది

సూ - ఆద్యన్తౌ టకితౌ ౧-౧-౪౬

వృ - టిత్కితౌ యస్యోక్తౌ తస్య క్రమాత్ ఆద్యన్తావయవౌ స్తః [illegible] [illegible] ఇట్పృక్తే

టిత్తును కిత్తును అను ఆగమములు ఎవని స్థానమున విధింపబడునో వానికి క్రమముగ ఆద్యవయవముగను అన్తావయవముగను వచ్చును

టకారమిద్వర్ణముగ కలది టిత్తు కకారమిద్వర్ణముగ కలది కిత్తు ఈ రెండును ఆగమముల అను పదమునకు విశేషణములు ఏవం

టిత్తైన ఆగమము దేనికి విధింపబడినదో దానికి పూర్వావయవముగను కిత్తైన ఆగమము దేనికి విధింపబడినదో దానికి అన్తావయవముగను వచ్చు నని భావము పై సూత్రముచే డకారమునకు పరమందున్న సకారమునకు ధుడాగమము విధింపబడినది ధుట్ అను నీయాగమము టిత్తగుటచే ప్రకృతసూత్రముచే సకారమునకు పూర్వావయవముగ వచ్చునని తెలియవలెను

షట్త్సన్తః - (ఆఱుగురు సజ్జనులు లేక పండితులు) షడ్ + సన్తః అనుచోట డః సి ధుట్ అను పై సూత్రముచే డకారమునకు పరమందున్న సకారమునకు విధింపబడిన ధుడాగమము టిత్తగుటచే ప్రకృత సూత్రముచే సకారమునకు పూర్వావయవముగవచ్చి షడ్ + ధ్ + సన్తః అని యగును ఇట మొదట షకారమునకును పిదప ధకారమునకు ఖరి చ అనుసూత్రముచే చర్త్వము వచ్చి షట్ + త్ + సన్తః = షట్ త్సన్తః అని యగును

ధుడాగమము వికల్పమగుటచే రానిపక్షమున షడ్లోని డకారమునకు చర్త్వముచే టకారమువచ్చి షట్సన్తః అని యగును

సూ - సంఖ్య ८-३-३०

౦ వి - న శ్చ

వృ - నాన్తాత్ పరస్య సస్య ధుడ్వా స్యాత్ సన్త్సః సన్సః

నకారాన్తమగు పదమునకు పరమందున్న సకారమునకు ధుట్ అను నాగమము వికల్పముగ వచ్చును

సన్త్సః - (అతడు పండితుడు) సన్ + సః అనుచోట సన్ అను పదము నకారాన్తము దీని చివరనున్న నకారమునకు సకారము పరమందుండుటచే సకారమునకు ప్రకృతసూత్రముచే ధుడాగమము వచ్చి సన్ + ధ్ + సః అని యగును పిదప ఖరి చ అను సూత్రముచే

ధకారస్థానమున చర్త్వము (తకారము) ఆదేశమై న్ + త్ + సః = సన్త్స అని యగును

ఈ ధుడాగమము రాని పక్షమున సన్స అనియే యుండును

సూ - ఙ్ణోః కుక్టుక్ శరి ౮-౩-౨౮

వా స్త్రః

వికల్పము వచ్చును

ఙకారణకారములకు శర్ ప్రత్యాహారవర్ణములు (శ ష సలు) పరమగునపుడు కుక్ టుక్ అను ఆగమములు క్రమముగ వికల్పముగ వచ్చును

ఈ సూత్రములోనికి వా (వికల్పముగ) అనునది తప్ప ఇతరములేవియు పై సూత్రమునుండి అనువర్తింపక పోవుటచే వృత్తిలో వాస్త్రః (వికల్పముగవచ్చును) అని మాత్రమే చెప్పబడినది

కుక్ టుక్ అను నీ యాగమములు రెండును కిత్తులగుటచే ఙకారణకారములకు అన్త్యావయవములుగ వచ్చును యథాసంఖ్యమ్ అను సూత్రముచే ఙకారమునకు కుక్ అను ఆగమమును ణకారమునకు టుక్ అను నాగమమును వచ్చునని భావము

కుక్ అను ఆగమములో చివరి కకారము దానికి పూర్వమందున్న ఉకారమును ఇత్తులై లోపించి క్ అని మాత్రమే మిగులును ఇట్లే టుక్ అను నాగమములో కకార ఉకారములు ఇత్తులగుటచే లోపించి ట్ అని మాత్రమే మిగులును

ఈ సూత్రమున ఉదాహరణములు తరువాతి వార్తికమున చూడుడు

వా - చయో ద్వితీయాః శరి పౌష్కరసాదేరితి వాచ్యమ్ ప్రాఙ్ఖ్ షష్ఠః ప్రాఙ్క్షష్ఠ ప్రాఙ్షష్ఠ సుగణ్ఠ్షష్ఠ సుగణ్ట్షష్ఠః సుగణ్షష్ఠ

పౌష్కరసాది మతమున చయ్ ప్రత్యాహారవర్ణములకు ద్వితీయాక్షరములు వచ్చును

పౌష్కరసాది యనునదొక వ్యాకరణాచార్యుని పేరు అతని మతమున చయ్ ప్రత్యాహారవర్గములకు (వర్గ ప్రథమాక్షరములగు కచట తపలకు) శర్ (శ ష సలు) పరమగునపుడు వికల్పముగా వర్గ ద్వితీయాక్షరములు (ఖ ఛ ఠ థ ఫ లు) ఆదేశములుగ వచ్చును ఈ ద్వితీయాక్షరము లాదేశమగుట పౌష్కరసాది మతములోనే కనుక పాణిని మతమున నవి రావని భావము ఏమంచ ఈ కార్యము వికల్పము తాత్పర్యము అట్లైనచో వికల్పార్థమును బోధించు వా విభాషా అను పదమును ప్రయోగింపక ఆచార్యుని నామమును నిర్దేశించుట అతనిపై పూజ్యభావమును వ్యక్తముచేయుట కొఱకు

ప్రాఙ్షష్ఠ - ప్రాఙ్ + షష్ఠ అనుచోట ఙకారమునకు శర్ (షకారము) పరమందుండుటచేపై సూత్రముచే కుక్ అను ఆగమమువచ్చి ప్రాఙ్ + క్ + షష్ఠ అని యగును ఇట చయ్యునకు(కకారమునకు) శర్(షకారము) పరముందుండుటచే ప్రకృతవార్తికముచే ద్వితీయాక్షరము (ఖకారము)ఆదేశమై ప్రాఙ్ + ఖ్ + షష్ఠః = ప్రాఙ్ఖ్షష్ఠ అను రూపమేర్పడును

ఈ వార్తికముచే విధింపబడు ద్వితీయాక్షరము వికల్పము కనుక నది రానిపక్షమున ప్రాఙ్ + క్ + షష్ఠ ప్రాఙ్క్షష్ఠ అను రూపమేర్పడును

కుగాగమమే రానిపక్షమున ప్రాఙ్ + షష్ఠ = ప్రాఙ్షష్ఠ అనియే యుండును

సుగణ్ట్షష్ఠః - సుగణ్ + షష్ఠః అనుచోట ణ కారమునకు శర్ (షకారము) పరమందుండుటచే పై సూత్రముచే టుక్ అనునాగమమువచ్చి సుగణ్ + ట్ + షష్ఠ అని యగును ఇట పై వలెనే ప్రకృత వార్తికముచే టకారమునకు ద్వితీయాక్షరము (ఠకారము) ఆదేశమై సుగణ్ఠ్షష్ఠ అని యగును

టకారస్థానమున వికల్పమగు ఠకారము రానిపక్షమున సుగణ్ట్షష్ఠః అను రూపమేర్పడును

టుగాగమమే రానిచో సుగణ్షష్ఠః = సుగణ్షష్ఠః అను రూపమేర్పడును

సూ - ౪౭. శుక్.౮-౩-౩౧

వృ - పదాన్తస్య నస్య శే పరే తుగ్వా స్యాత్

సఞ్ఛమ్భుః, సఞ్చ్ఛమ్భుః సఞ్చ్శమ్భుః సఞ్శమ్భుః

పదాన్తమందున్న నకారమునకు శకారము పరమైనచో తుగాగమము వికల్పముగ వచ్చును

తుక్ అను నీ ఆగమములో త్ మాత్రమే మిగులును

సన్ + శమ్భుః అనుచోట పదాన్తమందున్న నకారమునకు శకారము పరమందుండుటచే ప్రకృతసూత్రముచే తుగాగమము నకారమునకు అన్త్యావయవముగవచ్చి సన్ + త్ + శమ్భుః అని యగును మొదట తకారమునకును తరువాత నకారమునకును శ్చుత్వము(ఞ చలు) ఆదేశమై సఞ్ + చ్ + శమ్భుః అని యగును ఇట శశ్ఛోఽటి అను సూత్రముచే ఝయ్యునకు (చకారమునకు) పరమైన శకారమునకు ఛకారమాదేశమై సఞ్ + చ్ + ఛమ్భు = సఞ్చ్ఛమ్భుః' అను రూపమేర్పడును

శశ్ఛోఽటి అను సూత్రముచే వచ్చు ఛత్వము వికల్పమగుటచే అది రానిపక్షమున సఞ్చ్శమ్భుః అను రూపమేర్పడును

ప్రకృతసూత్రముచే వచ్చు తుగాగమము వికల్పమగుటచే నది రాని పక్షమున పఞ్శమ్యః అను రూపమేర్పడును

తుగాగమము ఛత్వము ఈ రెండునువచ్చిన సఞ్ + చ్ + ఛమ్యః అనురూపమున ఝరోఝరి సవర్ణే అనుసూత్రముచే చకారము లోపించి సఞ్ఛమ్యః అని యగును

ఇట తుగాగమము ఛత్వము చలోపము ఈ మూడును వికల్పమగుటచే పై నాలుగురూపములు సిద్ధించునని భావము

సూ - ఙమో హ్రస్వాదచి ఙముణ్ణిత్యమ్ ౮-౩-౩౨

ప వి - ఙమః హ్రస్వాత్, అచి ఙముట్ నిత్యమ్

వృ - హ్రస్వాత్ పరో యో ఙమ్ తదన్తం యత్ పదం తస్మాత్పరస్య అచః నిత్యం ఙముడాగమ స్యాత్. ప్రత్యఙ్ఙాత్మా సుగణ్ణీశః సన్నచ్యుతః

హ్రస్వముకు పరమందుండు ఙమ్ అంతమందుగల పదమునకు పరమైన అచ్చునకు నిత్యముగ ఙముట్ అనునాగమము వచ్చును

ఙమ్ అనునది ప్రత్యాహారము దీనిచే ఙ ణ న అను వర్ణములు గ్రహింపబడును ఙమన్తమనగా ఙ ణ న అను వర్ణములు అన్తమందు కలది ఈ ఙ ణ నలు హ్రస్వమునకు పరమందుండు టయేకాక ఙమన్తమైనది పదసంజ్ఞకమునై యుండవలెను అట్టి ఙమన్తమగు పదమునకు పరమందున్న అచ్చునకు ఙముట్ అనునాగమమువచ్చును

ఙముట్‌లోని చివరి టకారము ఙమ్ ప్రత్యాహారములోని మూడు వర్ణములతో (ఙ ణ నలతో) అన్వయించుటచే ఙుట్ ణుట్ నుట్ అను నాగమములు వచ్చునని తాత్పర్యము

ఈ యాగమములలో చివరి టకార ఉకారములిత్తులై లోపించి
ఙ్ ణ్ న్ అని మాత్రమే మిగులును

ప్రత్యఙ్ఙాత్మా -ప్రత్యఙ్ + ఆత్మా అనుచోట పూర్వమందున్న ప్రత్యఙ్ అనుదానిలో చివరనున్న ఙమ్ (ఙకారము) హ్రస్వమునకు పరముగ నున్నది ఙమన్తమగు ప్రత్యఙ్ అనునది పదము కూడ కనుక దానికి పరమందున్న ఆ అనునచ్చునకు ఙముట్ అనునాగము వచ్చి ప్రత్యఙ్ + ఙ్ + ఆత్మా = ప్రత్యఙ్ఙాత్మా అను రూపమేర్పడును

ఇట్లే సుగణ్ + ఈశ సన్ + అచ్యుతః అను చోట్లను ఙముడా గమముచే క్రమముగ ణకార నకారము లాగమములై సుగణ్ + ణ్ + ఈశః = సుగణ్ణీశః సన్ + న్ + అచ్యుతః = సన్నచ్యుతః అను రూపములు సిద్ధించును

ఈ సూత్రమందలి నిత్యమ్ అను పదమునకు సామాన్యముగ అని యర్థము అనగా కొన్నిచోట్ల ఙముడాగమము రాకపోవచ్చునని భావము కనుకనే తిఙ్ + అన్త సన్ + ఆది మున్నగు ఉదాహరణ ములలో ఙముడాగమము రాదు తిఙన్త సన్నాది అను రూపము లేర్పడవు

ఇట్లే ఇకోయణచి ఇత్యాది సూత్రములలో యణ్ + అచి అను చోటను ఙముడాగమము రాదని తెలియవలెను

సూ -సమః సుటి. ౮-౩-౫

వృ -సమో రుః సుటి

సమ్ అను నుపసర్గకు సుడాగమము పరమగునపుడు రు అను నా దేశము వచ్చును

రు అనునాదేశములో ర్ అని మాత్రమే మిగులును

సమ్ + కర్తా అనుచోట సమ్ అనుదానికి కృధాతువుతో యోగముం డుటచే సద్యు ఉపసర్గ యగును సమ్పర్యుపేభ్యః కరోతౌ భూషణే అను సూత్రముచే కృధాతువునకు సుడాగమము వచ్చి సమ్ + స్ + కర్తా అని యగును ఇట సమ్ అను నుపసర్గకు పరమందు సుడాగమముండుటచే సమ్‌లోని మకారమునకు ప్రకృతసూత్రముచే రు ఆదేశమై స + స్ + కర్తా అని యగును తరువాతి ప్రక్రియ క్రింది సూత్రము లలో తెలుపబడును

సూ - అత్రాఽనునాసికః పూర్వస్య తు వా ౮-౩-౩

ప వి - అత్ర అనునాసికః పూర్వస్య తు వా

వృ - అత్ర రుప్రకరణే రోః పూర్వస్య అనునాసికో వా స్యాత్

ఈ రుప్రకరణమున విధింపబడు రు అను ఆదేశమునకు పూర్వ మందున్న వర్ణమునకు అనునాసికము వికల్పముగ వచ్చును

అష్టాధ్యాయిలో 8వ యధ్యాయము 2వ పాదమునందలి ససజుషోరు అను సూత్రముచే విధింపబడిన రుత్వమొకటి అదే అధ్యాయములో 3వ పాదము మొదలుకొని కానా మ్రేడితే (8-3-92) అను సూత్రము వఱకు విధింపబడిన రుత్వము మఱొకటి ఈ రెంటిలో రెండవ ప్రకరణమున (మూడవ పాదము మొదటినుండి 92వ సూత్రము వఱకు) విధింపబడిన రుత్వమునకు పూర్వమందున్న వర్ణమునకు అనునాసికము వికల్పముగ వచ్చును ససజుషోరుః అను సూత్రముచే విధింపబడు రుత్వమునకు పూర్వమందున్న వర్ణమునకు మాత్రమనునాసికము రాదని భావము

సర్ + స్ + కర్తా అనుచోట నీ సూత్రముచే రు కు పూర్వ మందున్న అకారము అనునాసికమై సఁర్ + స్ కర్తా అని యగును ఈ

అనునాసికము వికల్పమగుటచే నిదిరాని పక్షమున ఈ క్రింది సూత్రముచే అనుస్వారము వచ్చును

సూ - అనునాసికాత్పరోఽనుస్వారః ౮-౩-౪

ప వి - అనునాసికాత్ పరః అనుస్వారః

వృ - అనునాసికం విహాయ రోః పూర్వస్మాత్ పరః అనుస్వారాగమః

అనునాసికమువచ్చు పక్షమును వదలి రుకు పూర్వమందున్న వర్ణమునకు అనుస్వారము ఆగమముగ వచ్చును

పై సూత్రముచే రుకు పూర్వమందున్న వర్ణమునకు అనునాసికము రాని పక్షమున ఈ సూత్రముచే అనుస్వారము ఆగమముగ వచ్చును

సర్ + స్ + కర్తా అను అనునాసికము రాని రూపమున రుకు పూర్వమందున్న అకారమునకు అనుస్వారము వచ్చి సంర్ + స్ + కర్తా అని యగును

పై సూత్రముచే అనునాసికము వచ్చిన పక్షమున సఁర్ + స్ + కర్తా అనియు ప్రకృత సూత్రముచే అనుస్వారాగమము వచ్చిన పక్షమున సంర్ + స్ + కర్తా అనియు నగును

సూ - ఖరవసానయోర్విసర్జనీయః ౮-౩-౧౫

ప వి - ఖరవసానయోః విసర్జనీయః

వృ - ఖరి అవసానే చ పదాన్తస్య రేఫస్య విసర్గః

ఖర్ ప్రత్యాహార వర్ణములు పరమందున్నను అవసానమందున్నను పదాన్తమైన రేఫకు విసర్గము ఆదేశమగును

పై సూత్రమున చెప్పబడిన సర్ + స్ + కర్తా సంర్ + స్ + కర్తా అనురెండు చోట్లను ఖర్ (సకారము) పరమందుండుటచే రేఫ

స్థానమున విసర్గమువచ్చి స + ్ + కర్తా సః + ్ + కర్తా అని యగును

వా - సంపుంకానాం సో వక్తవ్య సస్స్కర్తా సంస్స్కర్తా

సమ్ పుమ్ కాన్ అను ఈ మూడు శబ్దముల యొక్క విసర్గమునకు సకారాదేశము చెప్పదగినది

సః + స్ + కర్తా సం + స్ + కర్తా అను రెండు చోట్లనున్న విసర్గలు సమ్ అను దానికి సంబంధించినవే కనుక విసర్గమునకు సకారమాదేశమై సస్ + స్ + కర్తా = సస్స్కర్తా అనియు సంస్ + స్ + కర్తా = సంస్స్కర్తా అనియు రెండు రూపము లేర్పడును సంస్కర్తా అనగ సంస్కరించు వాడని యర్థము

సూ - పుమః ఖయ్యమ్పరే.

ప ది - పుమః ఖయి అమ్పరే

వృ - అమ్పరే ఖయి పుమః రుః పుస్కోకిల పుంస్కోకిల

అమ్పరకమైన ఖయ్యు పరమగునపుడు పుమ్ శబ్దమునకు రు ఆదేశమగును

ఇది అలోఽన్త్యస్య అను పరిభాషచే ఆదేశముగ వచ్చు రు పుమ్ శబ్దమునకు మొత్తమునకు కాక అన్త్యమగు మకారమునకే వచ్చును

పుమ్ + కోకిలః అనుచోట పుమ్ శబ్దమునకు అమ్ (ఓకార) పరకమైన ఖయ్యు (కకారము) పరమందుండుటచే పుమ్ శబ్దములోని మకారమునకు ప్రకృత సూత్రముచే రు ఆదేశమగును (ఈ రు' లో ఉకారమిత్తై లోపించి ర్ మాత్రమే మిగులును) ఏవంచ పుర్ + కోకిలః అని

యగును పిదప సంపుంస్కాం అనుచోటవలెనే అనునాసికానుస్వార ములును రేఫస్థానమున విసర్గమును ఆ విసర్గ స్థానమున సం పుంకానాం అను వార్తికముచే సకార మాదేశమై పుం + కోకిల = పుంస్కో కిలః పుంస్కోకిలః అను రూపము లేర్పడును పుంస్కోకిల అనగా మగ కోకిల పుమాన్ కోకిల అని విగ్రహ వాక్యము

ఇట్లే పుంస్పుత్రః పుంస్పుత్ర ఇత్యాది రూపముల నెఱుంగునది

సూ - నశ్ఛవ్యప్రశాన్ ౮-౩-౭

ప వి - న ఛవి అప్రశాన్

౭) అమ్పరే ఛవి నాన్తస్య పదస్య రు నతు ప్రశాన్ శబ్దస్య అమ్పు రకమైన ఛవ్ ప్రత్యాహార వర్ణములు (ఛ ఠ థ చ ట తలు) పరమగునపుడు నకారాన్తమగు పదమునకు రు ఆదేశమగును ప్రశాన్ శబ్దమునకు మాత్రము రు ఆదేశముగ రాదు

అలోఽన్త్యస్య అను పరిభాషచే నకారాన్తమైన పదమునకు మొత్తమునకు కాక చివర వర్ణమగు నకారమునకు మాత్రమే రు ఆదేశమగును సూత్రమున అప్రశాన్ అనుటచే ప్రశాన్ శబ్దములోని నకారమునకు రు ఆదేశముగ రాదని భావము

చక్రిన్ + త్రాయస్వ అనుచోట చక్రిన్ అను నకారాన్త పదము నకు అమ్పరమైన (రేఫపరమైన) ఛవ్ (తకారము) పరమందుడుటచే నకార స్థానమున రు ఆదేశముగ వచ్చి చక్రిర్ + త్రాయస్వ అని యగును సంస్కర్తా అనుచోట వలెనె పర్యాయముగ అనునాసికాను స్వారములును రు స్థానమున ఖరవసానయో అను సూత్రముచే విసర్గ మును ఆదేశమై చక్రి + త్రాయస్వ చక్రిం: త్రాయస్వ అనురూపము లేర్పడును తరువాతి ప్రక్రియ క్రింది సూత్రమున వివరింపబడుచున్నది

సూ - విసర్జనీయస్య సః ८-३-३४

వృ - ఖరి

చక్రిస్త్రాయస్వ చక్రింస్త్రాయస్వ

ఖర్ ప్రత్యాహారవర్ణము పరమగునప్పుడు విసర్గకు సకారము ఆదేశముగ వచ్చును

చక్రిః + త్రాయస్వ చక్రింః + త్రాయస్వ అను ఈ రెండుచోట్లను విసర్గకు ఖర్ (తకారము) పరమగుటచే విసర్గ స్థానమున సకారము వచ్చి చక్రిస్ త్రాయస్వ = చక్రిస్త్రాయస్వ చక్రింస్ + త్రాయస్వ = చక్రింస్త్రాయస్వ అనురూపము లేర్పడును చక్రిన్ = ఓ విష్ణూ త్రాయస్వ = రక్షింపుము అనియర్థము

అప్రశాన్ కిమ్ ? ప్రశాన్తనోతి

సూత్రమున అప్రశాన్ అను పదమెందుకు ? ప్రశాన్తనోతి అను రూపము సిద్ధించుటకు

నశ్ఛవ్యప్రశాన్ అను సూత్రమున అప్రశాన్ అను పదములేనిచో ప్రశాన్ + తనోతి అనుచోట అమ్పరమైన (అకార పరమైన) ఛవ్ (త కారము) పరమందుండుటచే నకారమునకు రుత్వ మాదేశముగ వచ్చి చక్రింస్త్రాయస్వ అను రూపము వలె ప్రశాంస్తనోతి అను నసాధురూప మేర్పడవలసి వచ్చును. కనుక సూత్రమునందలి అప్రశాన్ అను పదము సార్థకము

పదాన్తస్య ఇతికిమ్ ? హన్తి

పదాన్తస్య అనుపదమెందుకు ? హన్తి అనురూపము సిద్ధించుట కొఱకు

నశ్ఛవ్యప్రశాన్ అను సూత్రమున నకారాన్తమైన పదమునకు రుత్వము వచ్చునని చెప్పబడినది అనగా న కారము పదాన్తమున

నుండపలెనని భావము పదాన్తస్య అను పదము లేకున్నను ప్రశాన్ + తనోతి అనుచోట నకారమునకు రుత్వము వచ్చుచుండగా పదాన్తస్య అను పదము వ్యర్థము కదా ? అనుసందేహము కలుగును అట్లైనచో (పదాన్తస్య అని చెప్పనచో) హన్ + తి అనుచోట పదాన్తము కాని నకారమునకును రుత్వము వచ్చి క్రమముగా హంస్తి అను నసాధురూప మేర్పడును పదాన్తస్య అను పదమున్నచో పదాన్తమైన నకారమునకే రుత్వము వచ్చుననుటచే హన్‌లోని నకారము పదాన్తము కాకపోవుటచే రుత్వమును వారించవచ్చును

సూ - నౄన్పే ౮-౩-౧౦

పవి - నౄన్ పే

వృ - నౄన్ ఇత్యస్య రుః వా స్యాత్ పే

నౄన్ అనుపదమునకు పకారము పరమగునపుడు రుత్వము వికల్పముగా వచ్చును

అలోఽన్త్యస్య అను పరిభాషా సూత్రముచే నౄన్ అనుపదము చివరివర్ణమగు న్ అనుదానికి రుత్వము వికల్పముగావచ్చునని భావము

నౄన్ + పాహి (నరులనురక్షించుము) అనుచోట నౄన్ అను పదము చివర నున్న నకారమునకు పకారము పరమందుండుటచే నకార స్థానమున ఈ సూత్రముచే రుత్వము వచ్చినౄర్ + పాహి అని కాగా రు కు పూర్వమందున్న ఋకారమునకు అనునాసికము వచ్చినచో నౄఁర్ + పాహి అనియు అనుస్వారము వచ్చినచో నౄంర్ + పాహి అనియు నేర్పడును పిదప రేఫస్థానమున విసర్గము ఆదేశమై నౄంః + పాహి నౄఁః పాహిఅను రూపము లేర్పడును పీని పరినిష్ఠిత రూపములు తరువాతి సూత్రమున నీయబడినవి

సూ - కుప్వోః ≍క≍పౌ, చ ౮-౩-౩౭

వృ - కవర్గే పవర్గే చ విసర్గస్య ౘకగపౌస్త చాత్ విసర్గః ~న్వా ᳵపాహి
న్వా పాహి న్వాం ᳵపాహి న్వాం పాహి ~న్వాన్ పాహి

కవర్గముగాని పవర్గముగాని పరమగునపుడు విసర్గమునకు ᳵ ᳶ అనునవి ఆదేశము లగును సూత్రమున చ అని యుండుటచే విసర్గము కూడ వచ్చునని భావము. కవర్గము పరమగునపుడు విసర్గమునకు జిహ్వామూలీయమును పవర్గము పరమగునపుడు ఉపధ్మానీయమును వచ్చును

సూత్రమున చ అని యుండుటచే జిహ్వామూలీయ ఉపధ్మానీయములతో పాటు పర్యాయముగ విసర్గమును వచ్చును

~న్వా + పాహి అనుచోట (అనునాసికము వచ్చినరూపమున) విసర్గ స్థానమున ప్రకృత సూత్రముచే ఉపధ్మానీయము వచ్చినచో న్వా ᳵ పాహి అని యగును

ఇట్లే అనుస్వారము వచ్చిన రూపమునను విసర్గకు ఉపధ్మానీయము వచ్చి న్వాం ᳵపాహి అనియగును

ఈ రెండు రూపములందును ఉపధ్మానీయము రాక విసర్గమే వచ్చినచో ~న్వాః పాహి ~న్వాం పాహి అనియగును

న్వాన్ పే అను సూత్రముచే రుత్వము వికల్పము కాన నది రాని పక్షమున న్వాన్ పాహి అనియే యుండును

సూ -తస్య పరమామ్రేడితమ్. ౮-౧-౨

వ వి -తస్య పరమ్ ఆమ్రేడితమ్

వృ -ద్విరుక్తస్య పరం ఆమ్రేడితం స్యాత్

రెండు మాఱులుచ్చరింపబడిన శబ్దముయొక్క రెండవరూపము ఆమ్రేడితమనబడును

కాన్ అనుశబ్దమును రెండు మార్లు ఉచ్చరించినచో కాన్ కాన్ అనియగును దీనిలో రెండవ రూపము (రెండవ కాన్ అనునది) ఆమ్రేడితమగునని భావము ఈ సంజ్ఞకు ప్రయోజనము తరువాతి సూత్రమున చెప్పబడుచున్నది

సూ-కానామ్రేడితే ౮-౩-౧౨

ప వి-కాన్ ఆమ్రేడితే

వృ-కాన్ నకారస్య రు స్యాత్ ఆమ్రేడితే కాఁస్కాన్ కాంస్కాన్

ఆమ్రేడితము పరమగునపుడు కాన్ అను శబ్దములోని నకారమునకు రుత్వము ఆదేశముగ వచ్చును

కాన్ + కాన్ (ఎవరినెవరిని) అనుచోట కాన్ లోని నకారమునకు ఆమ్రేడితము (రెండవ కాన్ అనునది) పరమగుటచే నకారస్థానమున రుత్వ మాదేశమై కార్ + కాన్ అనియగును పిమ్మట సంస్కర్తా అనుచోటవలెనె రుకు పూర్వమున అనుస్వారానునాసికములు పర్యాయముగను రేఫస్థానమున విసర్గమును విసర్గస్థానమున సకారమునువచ్చి కాఁస్కాన్ కాంస్కాన్ అనురూపము లేర్పడును

సూ-ఛే చ ౬-౧-౭౩

వృ-హ్రస్వస్య ఛే పరే తుగాగమః స్యాత్ శివచ్ఛాయా

హ్రస్వమునకు ఛకారము పరమగునపుడు సంహితలో తుగాగమము వచ్చును

తుక్ అను నాగమములో చివరి ఉకార కకారము లిత్సంజ్ఞకములై లోపించి త్ అని మాత్రమే మిగులును

శివచ్ఛాయా - (శివుని కాన్తి) శివ + ఛాయా అనుచోట వకారము మీది హ్రస్వమునకు (అకారమునకు) ఛాయా లోని ఛకారము పరముగ

నుండుటచే అకారమునకు తుగాగమము అన్త్యావయవముగ (కిత్తగుటచే) వచ్చి శివ + త్ + ఛాయా అనియగును పిదప తకార స్థానమున జశ్త్వముచే దకారము ఆ దకారస్థానమున శ్చుత్వముచే చకారము ఆదేశమై శివచ్ + ఛాయా = శివచ్ఛాయా అను రూప మేర్పడును

ఇట్లే వృక్షచ్ఛాయా తరుచ్ఛాయా అను రూపములు నెఱుంగునది

సూ - పదాన్తాద్వా ౬-౧-౭౬

ప వి - పదాన్తాత్ వా

వృ - దీర్ఘాత్ పదాన్తాత్ ఛే తుక్ వా స్యాత్ లక్ష్మీచ్ఛాయా లక్ష్మీఛాయా

పదాన్త మందున్న దీర్ఘమునకు ఛకారము పరమగునపుడు తుగాగమము వికల్పముగ వచ్చును

లక్ష్మీచ్ఛాయా - (లక్ష్మియొక్క కాన్తి) లక్ష్మీ + ఛాయా అను చోట లక్ష్మీపదము చివరనున్న దీర్ఘమునకు ఛ కారము పరమందుండుటచే తుగాగమము వచ్చి లక్ష్మీ + త్ + ఛాయా అని యగును పిదప వృక్షచ్ఛాయా అనుచోట వలెనే తకారమునకు జశ్త్వముచే దకారమును దకారమునకు శ్చుత్వముచే జకారమును జకారమునకు చర్త్వముచే చకారమును వచ్చి లక్ష్మీచ్ఛాయా అని యగును

ప్రకృత సూత్రముచే వచ్చు తుగాగమము వికల్పము కనుక వది రాని పక్షమున లక్ష్మీఛాయా అనియే యుండును

ఇతి హల్సంధి ప్రకరణమ్

— • —

అథ విసర్గసంధి ప్రకరణమ్

సూ - విసర్జనీయస్య సః ౮-౩-౩౪

వృ - ఖరి విష్ణుస్త్రాతా

విసర్గకు ఖర్ ప్రత్యాహారవర్ణము పరమగునప్పుడు సకారము ఆదేశముగ వచ్చును

విష్ణుస్త్రాతా - (విష్ణువు రక్షకుడు) విష్ణు + త్రాతా అనుచోట విసర్గమునకు ఖర్ ప్రత్యాహారవర్ణము (తకారము) పరమగుటచే సకారమాదేశమై విష్ణు + స్ + త్రాతా = విష్ణుస్త్రాతా అను రూపమేర్పడును

ఖర్ ప్రత్యాహారమున చేరు క ఖ ప ఫ అను వర్ణములు పరమగునపుడు మాత్రము విసర్గస్థానమున కుప్వోః ᳵకᳵపౌ చ అను సూత్రముచే కఖలకు పూర్వము జిహ్వామూలీయమును పఫలకు పూర్వము ఉపధ్మానీయమును వచ్చునని తెలియవలెను

రామ + కరోతి = రామᳵకరోతి రామ కరోతి
రామ + పచతి = రామᳵపచతి రామ పచతి

అను నీయుదాహరణములలో విసర్గస్థానమున సకారము రాక జిహ్వామూలీయము ఉపధ్మానీయమును వికల్పముగ వచ్చునని తెలియవలెను

సూ - వా శరి. ౮-౩-౩౬

వృ - శరి విసర్గస్య విసర్గో వా హరిః శేతే హరిశ్శేతే

శర్ ప్రత్యాహారవర్ణములు పరమగునపుడు విసర్గమునకు విసర్గము వికల్పముగ వచ్చును

రిః శేతే - (హరి నిద్రించు చున్నాడు) హరి + శేతే అనుచోట విసర్గమునకు శర్ ప్రత్యాహారవర్ణము (శకారము) పరమగుటచే ప్రకృత సూత్రముచే విసర్గమే ఆదేశమై హరి శేతే అనియగును ప్రకృత సూత్రముచే విసర్గకు వచ్చు విసర్గాదేశము వికల్పమగుటచే నది రాని పక్షమున పూర్వసూత్రముచే విసర్గస్థానమున సకారాదేశము వచ్చి హరిస్ + శేతే అనియగును పిదప శ్చుత్వముచే సకారమునకు శకారమాదేశమై హరిశ్శేతే అనురూపమేర్పడును

సూ - ససజుషో రుః ౮-౨-౬౬

ప వి - ససజుష రు

వృ పదాన్తస్య సస్య సజుషశ్చ రుః స్యాత్

పదాన్తమగు సకారమునకును సజుష్ శబ్దములోని షకారమునకును రు ఆదేశముగ వచ్చును రులోని ఉకారమిత్తై లోపించి ర్ అనునది మాత్రమే మిగులును

శివ అను శబ్దముపై ప్రథమావిభక్త్యేకవచనమున సు అను ప్రత్యయము చేర్చగా శివ + స్ అని యగును ఇట స్ అనునది పదాన్తమున నుండుటచే ప్రకృత సూత్రముచే దానికి రు ఆదేశమై శివ + ర్ అని యేర్పడగా రేఫస్థానమున విసర్గము వచ్చి శివః అని యగును

సూ - అతో రో రప్లుతాదప్లుతే ౬-౧-౧౧౩

ప వి - అత రో అప్లుతాత్ అప్లుతే

వృ - అప్లుతాదతః పరస్య రో ఉ స్యాత్ అప్లుతే అతి శివోఽర్చ్యః

ప్లుతముకాని హ్రస్వఅకారమునకు పరమైన రు అనుదానికి ప్లుతముకాని హ్రస్వ అకారము పరమగునపుడు రు స్థానమున ఉకారమాదేశమగును

శివోఽర్చ్యః - (శివుడు పూజ్యుడు) శివ + స్ + అర్చ్యః అనుచోట సకారమునకు పూర్వసూత్రముచే రు ఆదేశమై శివ + ర్ + అర్చ్య అని యగును ఇట వకారము మీది అప్లుతమగు అకారమునకు పరమందు రు అనునాదేశమును దానికి పరమందు అప్లుతమగు హ్రస్వాకారము (అర్చ్య లోని తొలి అకారము) ను పరమైయుండుటచే రు స్థానమున ప్రకృత సూత్రముచే ఉ కారమాదేశమై శివ + ఉ + అర్చ్య అనియగును పిదప గుణము వచ్చి శివో + అర్చ్యః అని కాగా ఏఙః పదాన్తాదతి అనుసూత్రముచే పూర్వరూపమేకాదేశమై శివోఽర్చ్య అను రూపమేర్పడును

సూ - హశి చ ౬-౧-౧౧౪

వృ - తథా శివోవన్ద్యః

అప్లుతమగు హ్రస్వాకారమునకు పరమగు రు అనుదానికి హశ్ (ప్రత్యాహార వర్ణము) ను పరమగుచో పూర్వమువలె ఉకారము ఆదేశమగును

శివోవన్ద్య -(శివుడు నమస్కరింపదగినవాడు) శివ + స్ + వన్ద్య అనుచోట పూర్వము వలె సకారమునకు ససజుషోరు అను సూత్రముచే రు ఆదేశమై శివ + ర్ + వన్ద్యః అనియగును ఇట శివ శబ్దము లోని వకారము మీది అప్లుతమగు హ్రస్వ అకారమునకు పరమంది రు ఆదేశమును దానికి పరమందు హశ్ (వన్ద్య లోని వకారము) ను ఉండుటచే ప్రకృతసూత్రముచే రు స్థానమున ఉకారమాదేశమై శివ + ఉ + వన్ద్యః అనియగును పిదప గుణము వచ్చి శివోవన్ద్యః అను రూపమేర్పడును

సూ - భో భగో అఘో అపూర్వస్య యోఽశి ౮-౩-౧౭

ప వి - భో భగో అఘో అపూర్వస్య యః అశి

వృ - ఏతత్పూర్వస్య రోర్యాదేశ అశి దేవా ఇహ దేవాయిహ

భోస్ భగోస్ అఘోస్ అనునవియు మరియు అవర్ణమును పూర్వమందు కల రు ఆదేశమునకు అశ్ పరమగునప్పుడు యకారము ఆదేశమగును

ఇట అవర్ణము పూర్వమందుకల రు ఆదేశమునకు యకార మాదేశమగుటను ఇట ఉదాహరించుచున్నారు

దేవా ఇహ - (దేవతలిచ్చట) దేవాస్ + ఇహ అనుచోట సకారమునకు ససజుషోరుః అను సూత్రముచే రుత్వమాదేశమై దేవార్ + ఇహ అని యగును ఇట దేవార్‌లోని ర్ అనుదానికి పూర్వమందు ఆకార ముండుటచే నిది ఆకార పూర్వమైనది పరమందు అశ్ (ఇహలోని ఇకారము) కలదు కనుక ప్రకృతసూత్రముచే రేఫ స్థానమున యకారమాదేశమై దేవాయ్ + ఇహ అని యగును లోపః శాకల్యస్య అను సూత్రముచే యకారమునకు లోపము వచ్చి దేవాఇహ అని యగును

ఈ యకారలోపము వికల్పమగుటచే నది రాని పక్షమున దేవా యిహ అను రూపమేర్పడును

వృ - భోస్ భగోస్ అఘోస్ ఇతి సాన్తా నిపాతాః తేషాం రోర్యత్వే కృతే

భోస్ భగోస్ అఘోస్ అను సంబోధనవాచకములు సకారాంత ములగు నిపాతములు వాని రుత్వమునకు యత్వము రాగా

భోస్ + దేవాః భగోస్ + నమస్తే అఘోస్ + యాహి అనుచోట్ల పూర్వపదము భో భగో అఘోస అను నిపాతముల చివరనున్న సకారమునకు ససజుషోరుః అను సూత్రముచే రుత్వమురాగా భోర్ + దేవా భగోర్ + నమస్తె అఘోర్ + యాహి అను రూపములేర్పడును ప్రకృతసూత్రముచే నిట రు స్థానమున యకారాదేశమురాగా భోయ్ +

దేవాః భగోః+నమస్తే అఘోః+యాహి అను రూపములేర్పడగా వీనిలోని యకారమును లోపింపజేయుటకు క్రిందిసూత్రము చెప్పబడు చున్నది

సూ - హలి సర్వేషామ్ ౮-౩-౨౨

వృ - భో భగో అఘో అపూర్వస్య యస్య లోపః స్యాత్ హలి

భో దేవాః భగోనమస్తే అఘోయాహి

భో భగో అఘో అవర్ణము ఇవి పూర్వమందు కల యకారము నకు హల్లు పరమగునపుడు లోపము వచ్చును

పై మూడుదాహరణములందును యకారమునకు పూర్వము క్రమ ముగ భో భగో అఘో అనునవియు పరమందు హల్లును ఉండుటచే యకా రలోపమువచ్చి భో దేవా భగో నమస్తే అఘో యాహి అను రూపము లేర్పడును

ఇట్లే భక్తా భజన్తి ఛాత్రా గచ్ఛన్తి మున్నగు రూపముల ప్రక్రియ వెలుంగునది

సూ - రోఽసుపి ౮-౩-౬౯

ప వి - రః అసుపి

వృ - అహ్నో రేఫాదేశః స్యాత్ నతు సుపి అహరహః అహర్గణః

అహన్ శబ్దమునకు రేఫాదేశము వచ్చును సుప్పు పరమగు చో రాదు

అహ్నః అను షష్ఠీవిభక్తి నిర్దేశముచే రేఫాదేశము విధింపబడు టచే అలోఽన్త్యస్య అను పరిభాషచే అహన్ శబ్దములోని చివరి వర్ణ మగు నకారమునకే రేఫాదేశము వచ్చునని భావము ఈ రేఫాదేశము సుప్పు (విభక్తి ప్రత్యయములు) పరమగు నపుడు రాదు

అహరహః - (ప్రతిదినము) అహన్ + అహః అనచోట అహన్ అను పూర్వపదమునకు సుప్పు పరముగ లేనందున నకారస్థానమున రేఫాదేశము వచ్చి అహర్ + అహః = అహరహ అను రూపమేర్పడును

అహర్గణః - (దినముల సముదాయము) అహన్ + గణః అను చోటను అహన్ శబ్దములోని నకారమునకు ప్రకృతసూత్రముచే రేఫమాదేశమై అహర్గణ అను రూపము సిద్ధించును

సూ - రో రి ८-३-१४

ప వి - ర రి

వృ - రేఫస్య రేఫే పరే లోపః స్యాత్

రేఫమునకు రేఫము పరమగుచో పూర్వ (మొదటి) రేఫమునకు లోపము వచ్చును

సూ - ఢ్రలోపే పూర్వస్య దీర్ఘోఽణః ६-३-१११

ప వి - ఢ్రలోపే పూర్వస్య దీర్ఘః అణః

వృ - ఢరేఫయో లోపనిమిత్తయోః పూర్వస్యాణో దీర్ఘ పునారమతే హరీరమ్య శంభూరాజతే

ఢకారరేఫముల లోపమునకు నిమిత్తములగు ఢకారరేఫములు పరమగునప్పుడు పూర్వమందున్న అణ్ణునకు దీర్ఘము వచ్చును

ఢో ఢే లోప అను సూత్రముచే ఢకారమునకు ఢకారము పరమగునప్పుడు లోపము విధింపబడినది ఇప్లే రోరి అను పై సూత్రముచే రేఫమునకు రేఫము పరమగునప్పుడు లోపము విధింపబడినది ఈ ఢకార రేఫముల లోపమునకు పరమందున్న ఢకార రేఫములు క్రమముగా విమి

త్తములైనవి అచ్చే నిమిత్తముగా పరమగునపుడు పూర్వమందున్న అణ్ణ నకు (అ ఇ ఉ ఋ ఌ) దీర్ఘము వచ్చునని సూత్రార్థము

పునారమతే - (మరల రమించు చున్నాడు) పునర్ + రమతే అనుచోట రేఫమునకు రేఫము పరమగుటచే పై సూత్రముచే పూర్వరేఫమునకు లోపము వచ్చి పున + రమతే అనియగును ఇట రమతే లోని రేఫము పూర్వమందున్న రేఫముయొక్క లోపమునకు నిమిత్తమగుటచే పూర్వ మందున్న నకారము మీది అణ్ణునకు (అకారమునకు) ఈ సూత్రముచే దీర్ఘము వచ్చి పునారమతే అనియగును

హరీరమ్య - (విష్ణువు రమణీయుడు) హరిస్ + రమ్య అనుచోట నకార స్థానమున రుత్వమును దానికి పైసూత్రముచే లోపమును పిదప ప్రకృత సూత్రముచే రి లోని ఇకారమునకు దీర్ఘమును వచ్చి హారీరమ్య అని యగును

శమ్భూరాజతే - (శివుడు శోభిల్లుచున్నాడు) శంభుస్ + రాజతే అనుచోట ము పైవలెనే సకారస్థానమున రుత్వమును దానికి లోపమును ప్రకృతి సూత్రముచే పూర్వమందున్న అణ్ణునకు దీర్ఘమును రాగా శమ్భూరాజతే అను రూప మేర్పడును

వృ - అనః కిమ్? లృఢః వృఢః

ఈ సూత్రమున అనః అను పదమెందులకు? తృఢః వృఢః ఇత్యాది స్థలములలో ప్రకృత సూత్రముచే దీర్ఘము రాకుండుటకొఱకు

తృఢః - (హింసించెను) తృహ్ + ఢ అనుచోట ఢోఢే లోపః అను సూత్రముచే పూర్వఢకారము లోపించి తృఢః అనియగును సూత్రమున అణః అను పదము లేనిచో ఢకారలోపమునకు నిమిత్తమగు ఢకారము పర మగుటచే తృలోని ఋవర్ణమునకు దీర్ఘము ప్రాప్తించును అణ్ అను పదమున్నచో తృలోని ఋ అణ్ణు కాకపోవుటచే దీర్ఘము రాదు

వృత్తిః -(సంసిద్ధుడు) సూత్రమున అజ్ అను పదముండుట చేతనే పై
వలె ఇచటను ఋలోని ఋకారమునకు దీర్ఘము రాదని తెలియవలెను

వృ - పునస్ + రథః ఇత్యత్ర రుత్వే కృతే హశిచ ఇత్యుత్వే రోరి ఇతి
లోపే చ ప్రాప్తే

పునస్ + రథ అనుచోట రుత్వము చేయగా హశిచ అను సూత్రముచే ఉత్వమును రోరి అను సూత్రముచే లోపమును ప్రాప్తింపగా

పునస్ + రథ అనుచోట పునస్‌లోని సకారమునకు రుత్వము రాగా పునర్ + రథ అగును ఇట్లు ఆదేశముగ వచ్చిన ఉత్వమునకు పరమందు హశ్శు (రథ లోని రేఫము) పరమగుటచే దానికి హశిచ అను సూత్రముచే ఉత్వమును ఇట్లే రుత్వమునకు రేఫము (రథ లోనిది) పరమగుటచే లోపమును ప్రాప్తించినవి కనుక వీనిలోనేది రావలెనో ఈ క్రింది సూత్రమున వివరించుచున్నాడు

సూ - విప్రతిషేధే పరం కార్యమ్ ౧-౪-౨

వృ - తుల్యబలవిరోధే పరం కార్యం స్యాత్ ఇతి లోపే ప్రాప్తే
తుల్యబల విరోధమేర్పడినపుడు పరకార్యము వచ్చును

వేఱువేఱుగా ఇతరోదాహరణములతో ప్రవర్తించిన (చరితార్థములైన) రెండు సూత్రములొకే లక్ష్యమున ప్రవర్తించినచో దానిని తుల్యబల విరోధమందురు (అన్యత్రాన్యత్ర లబ్ధావకాశయోః శాస్త్రయోరేకస్మిన్ లక్ష్యే సమావేశః) రోరి అను సూత్రము పునర్ + రమతే అనుచోట చరితార్థమైనది ఇచట పునర్ లోని రేఫము రు కానందున హశి చ అనునది ప్రవర్తించదు ఇట్లే హశిచ అను సూత్రము శివర్ + వన్ద్య అనుచోట చరితార్థమైనది ఇచట పరమందు రేఫము లేకపోవుటచే రోరి ప్రవర్తించదు కనుక ఈ రెండు సూత్రములును భిన్నభిన్న

లక్ష్యము-లో చరితార్థములై మనర్ + రథః అనుచోట ఒకేసారి ప్రాప్తించినది కనుక తుల్యబల విరోధమేర్పడినది కనుక ప్రకృత సూత్రముచే పరసూత్రమగు రోరి అను సూత్రమే ప్రాప్తించినది

వృ -పూర్వత్రాసిద్ధమ్ ఇతి రోరి ఇత్యస్య అసిద్ధత్వాత్ ఉత్వమేవ మనోరథః

పూర్వత్రాసిద్ధమ్ అనుసూత్రముచే రోరి అనునది అసిద్ధమగు టచే ఉత్వమే వచ్చును

హశిచ (6- -1 4) అనునది సపాదసప్తాధ్యాయి లోనిది రోరి (8-3- 4) అను నది త్రిపాది లోనిది కనుక పై సూత్రము చే పరకార్య మైన రోరి అనునది ప్రాప్తించినను పూర్వత్రాసిద్ధమ్ అనుసూత్ర ముచే త్రిపాదిలోనిదగు రోరి అనునది హశిచ అను సూత్రము దృష్ట్యా అసిద్ధమగుటచే ఇట హశిచ అను సూత్రమే ప్రవర్తించి రు నకు ఉత్వమే ఆదేశమగును ఏవంచ మనర్ + రథ అను చోట మనర్ లోని రేఫ స్థానమున ఉకారమును పిదప గుణమును ఆదేశమై మనోరథః అను రూపమేర్పడును

సూ -ఏతత్తదోః సులోపోఽకోరనఞ్సమాసే హలి ౧-౧-౩౨

ప వి -ఏతత్తదో సులోపః అకో అనఞ్సమాసే హలి ఏషవిష్ణు సశంభు

వృ -అకకారయోరేతత్తదో యః సుః తస్య లోపో హలి న తు నఞ్ సమాసే ఏషవిష్ణుః సశంభుః

కకారములేని ఏతద్ తద్ అను శబ్దములను అను దానికి (ప్రథమావిభక్త్యేకవచనప్రత్యయమునకు)హల్లు పరమగునపుడు లోపము వచ్చును నఞ్ సమాసమున మాత్రము ఈః సులోపము రాదు

ఏషవిష్ణుః -(ఇతడు విష్ణువు) ఏష + స్ + విష్ణుః అను చోటనున్న ఏష అను ఏతచ్ఛబ్దమున కకారము లేదు ఇది నఞ్ సమాసమునను లేదు ఈ ఏతచ్ఛబ్దముయొక్క సు అను దానికి పరమందు హల్లు (వకారము) ఉన్నది కనుక ప్రకృత సూత్రముచే 'సు అనునది లోపించి "ఏషవిష్ణుః అను రూపమేర్పడును

సశంభుః -(అతడు శివుడు) స + స్ + శంభుః అనుచోట స అనునది కకారములేని తచ్ఛబ్దరూపము ఇది నఞ్ సమాసమునను లేదు పరమందు హల్లు (శకారము) ఉండుటచే సస్‌లోని చివరి సకారము నకు పైపలెనే లోపము వచ్చి సశంభుః " అను రూపమేర్పడును

వృ -అకోః కిమ్? ఏషకోరుద్ర

సూత్రమున అకో (కకారములేనివి) అను పదమెందుకు? ఏషకోరుద్రః అనుచోట అసాధురూపమేర్పడకుండుట కొఱకు

సూత్రమున అకో (కకారములేనివి) అను పదము లేనిచో ఏషక + స్ + రుద్ర అనుచోట ఏషక అనునది ఏతచ్ఛబ్దరూపమే యగుట చేతను నఞ్ సమాసమున లేక పోవుట చేతను పరమందు ర అను హల్లు ఉండుటచేతను ప్రకృత సూత్రముచే సులోపము వచ్చి ఏషక రుద్రః అను నసాధురూప మేర్పడ వలసి వచ్చును కనుక సూత్రమున అకో అను పదముండవలెను అప్పుడు కకారములేని ఏతత్తచ్ఛబ్ద ముల సు అను దానికే లోపము వచ్చునని తెలియును ఏషక + స్ + రుద్రః అనుచోట ఏషక అనునది ఏతచ్ఛబ్దరూపమే యైనను అందు కకారముండుటచే ఈ సూత్రము ప్రవర్తించదు సులోపము రాదు సకారమునకు రుత్వమును దానికి ఉత్వమును పిదప గుణమును వచ్చి ఏషకోరుద్రః అను రూపమేర్పడును

వృ -అనఞ్ సమాసే కిమ్? అసః శివః

అనఞ్ సమాసే అను పదమెందులకు? అస శివ అనుచోట అసాధు రూపమేర్పడకుండుట కొఱకు

సూత్రమున అనఞ్ సమాసే అను పదములేనిచో అస+స్+శివ అనుచోట కకారరహితమగు తచ్ఛబ్దముయొక్క సు అనుదానికి హల్లుపరమందుండుటచే లోపము వచ్చి అస శివః అను అసాధురూపమేర్పడును కనుక అనఞ్ సమాసే (నఞ్ సమాసమున రాదు) అని చెప్పవలెను ఐనచో అస+స్+శివ అనుచోట స అను తచ్ఛబ్దరూపము నఞ్ సమాసమున నుండుటచే సులోపము రాదు సకారమునకు రుత్వమును రుత్వమునకు విసర్గమును వచ్చి అసః శివః అని యగును

వృ - హలి కిమ్? ఏషోఽత్ర

హలి అను పదమెందులకు? ఏషోఽత్ర అనుచోట అసాధురూపమేర్పడ కుండుట కొఱకు

ఈ సూత్రమున హలి అను పదము లేనిచో ఏష+స్+అత్ర అనుచోట ఏషస్ లోని సకారమునకు లోపము వచ్చి ఏష అత్ర అని కావలసి వచ్చును హలి అనుపదమున్నచో ఏషస్ లోని సకారమునకు హల్లు పరమగునపుడే సులోపము వచ్చునని తెలియును ఏషస్+అత్ర అనుచోట ఏషస్ లోని సకారమునకు అచ్చు (అకారము) పరమగుటచే లోపము రాదు సకారమునకు రుత్వమును ఉత్వమును గుణమును పూర్వరూపమును వచ్చి ఏషోఽత్ర అని యగును

సూ - సోఽచి లోపే చేత్పాదపూరణమ్. ౬-౧-౧౩౪

ప వి - సః అచి లోపే చేత్ పాదపూరణమ్

వృ - స ఇత్యస్య సోర్లోపః స్యాదచి పాదశ్చేల్లోపే సత్యేవ పూర్యేత
సేమామవిడ్ఢిప్రభృతిమ్ సైష దాశరథీ రామః

స అను శబ్దముపై ప్రథమా విభక్త్యేకవచనమున వచ్చు సు ప్రత్యయమునకు అచ్చు పరమగునపుడు లోపము వచ్చును ఎచట సులోపము వచ్చిననే కాని పద్యపాదము పూర్తియగుట సంభవించునో అచట మాత్రమే ఈ లోపము వచ్చును సులోపము రాకుండ ఇతర కార్యములచే పాదపూరణము జరుగుట సంభవించుచో నీ సులోపము రాదని భావము.

సేమామవిడ్ఢి ప్రభృతిమ్ - "సేమామవిడ్ఢి ప్రభృతిం య ఈశిషే" అనునది జగతి యను వైదికచ్ఛందస్సుయొక్క పాదము ఈ ఛందస్సులో ప్రతి పాదమున పంద్రెండక్షరము లుండవలెను ఈ పాదమందలి సేమామ్ అను పదమును తీసికొనుడు స + సు + ఇమామ్ అని యుండగా సస్‌లోని చివరి సకారమునకు అచ్చు (ఇవర్ణము) పరమగుటచే ప్రకృత సూత్రముచే లోపము వచ్చి స + ఇమామ్ అని యగును పిదప గుణము వచ్చి సేమామ్ అను రూపమేర్పడును ఇట సులోపము వచ్చిననకాని పాదపూరణము సిద్ధించుటలేదు ఎట్లన సస్ లోని సు లోపించనిచో దానికి రుత్వమును రుత్వమునకు యకారమును యకారమునకు వికల్పముగ లోపమును వచ్చి 'సఇమామవిడ్ఢిప్రభృతిం య ఈశిషే అని యగును ఐనచో ఈ పాదమున పంద్రెండక్షరములకు బదులు పదమూడక్షరములై పాద పూరణము కాకున్నది సులోపము చెప్పిననే కాని పాదపూరణము జరుగుటలేదు కనుక సులోపమును చెప్పవలెను

విశేషము - సులోపము రాని పక్షమున సిద్ధించిన సఇమామ్ అను చోట పూర్వము వచ్చిన యకారలోపము అసిద్ధమగుటచే అకార ఇకారములకు యకారముతో వ్యవధానముండుటచే గుణము రాదు పాదపూరణము సంభవించదు

సైష దాశరథీ రామ -ఇది అనుష్టుప్ ఛందస్సు యొక్క పాదము ఈ ఛందస్సు ప్రతిపాదములోను ఎనిమిదక్షరము లుండవలెను ఇంటి సైష అను పదమును తీసికొనుడు సస్+ఏష అనుచోట ప్రస్తుత సూత్రముచే సస్‌లోని సకారమునకు అచ్చు పరమగుటచే లోపమును పిదప వృద్ధియును వచ్చి సైష అను రూపమేర్పడినది ఇట సులోపము వచ్చిననే కాని పాదపూరణము జరుగుటలేదు ఎట్లన సస్+ఏషః అనుచోట సస్‌లోని సు లోపించనిచో పై వలెనే సకారమునకు రుత్వమును రుత్వమునకు యకారమును యకారమునకు వికల్పముగ లోపమునువచ్చి సఏష దాశరథీ రామః అనియగుచున్నది పాదమున ఎనిమిదక్షరములకు బదులు తొమ్మిదక్షరములై పాదపూరణము కాకున్నది సులోపమును చెప్పిననే కాని సైష అని యేర్పడి ఎనిమిదివర్ణములచే పాదపూరణము జరుగుటలేదు కనుక సులోపమును చెప్పవలెను

ఇతి విసర్గసంధి ప్రకరణమ్

అథ కృదన్త ప్రకరణమ్

(కృత్యప్రక్రియా)

సూ- ధాతోః ౩-౧-౯౧

వృ -ఆతృతీయా న్తం యే ప్రత్యయాస్తే ధాతోః పరే స్యు కృదతిఙ్ ఇతి కృత్సంజ్ఞా

తృతీయాధ్యాయము చివరివరకు చెప్పబడు ప్రత్యయములు ధాతువునకు పరముగ వచ్చును కృదతిఙ్ అను సూత్రముచే కృత్సంజ్ఞ వచ్చును

ఇది అధికారసూత్రము ఈ సూత్రము తరువాతనున్న తృతీయాధ్యాయములోని సూత్రము లన్నిటియందు అధికరించుటచే ఆ సూత్రములచే విధింపబడు ప్రత్యయములన్నియు ధాతువునకు పరముగ వచ్చునని భావము అట్టిప్రత్యయములలో తిఙ్లు కాని కృత్ప్రత్యయములు కృత్యప్రత్యయము లనబడును తిఙ్లనగ ధాతువులమీద ప్రథమాదిపురుషములలో వచ్చు తిప్ తస్ మున్నగునవి

సూ -వాఽసరూపోఽస్త్రియామ్ ౩-౧-౯౪

ప వి -వా అసరూప అస్త్రియామ్

వృ -అస్మిన్ ధాత్వధికారేఽ సరూపోఽ పవాదప్రత్యయ ఉత్సర్గస్య బాధకో వా స్యాత్ స్త్ర్యధికారోక్తం వినా

స్త్రియాం అను అధికారమున చెప్పబడిన ప్రత్యయములు తప్ప ధాతోః అను అధికారసూత్రమున చెప్పబడిన అసరూప (భిన్నరూప) మైన ప్రత్యయము ఉత్సర్గమునకు వికల్పముగ బాధకమగును

సామాన్యముగ అపవాదసూత్రముత్సర్గ (సామాన్య) సూత్రమును నిత్యముగ బాధించును అనగా అపవాదము ప్రవర్తించినపుడు ఉత్సర్గము ప్రవర్తించదు కాని అపవాద ప్రత్యయము అసరూపమై స్త్రియాం అను నధికారములో లేనిచో నది ఉత్సర్గమును వికల్పముగ బాధించును అనగా అపవాద ప్రత్యయముతోబాటు ఉత్సర్గప్రత్యయములును వచ్చును ఎట్లన "ణ్వుల్ తృచౌ" అను సూత్రముచే ధాతువులన్నిటిపైన ణ్వుల్ తృచ్ అను ప్రత్యయములు విధింపబడినవి కనుక నిది ఉత్సర్గము ఇగుపధ జ్ఞాప్రీకిరః " అను సూత్రముచే కొన్ని ధాతువులకు మాత్రము క ప్రత్యయము విధింపబడినది కనుక నిది అపవాదము ఈ రెండు ప్రత్యయములు (ణ్వుల్ తృచ్ క అనునవి) అసరూపములగుటచే అపవాదము వికల్పముగ బాధకమై అపవాద ప్రత్యయమగు క ప్రత్యయముతోబాటు ఉత్సర్గప్రత్యయములగు ణ్వుల్ తృచ్ ప్రత్యయములు కూడ వచ్చునని భావము

ఉత్సర్గప్రత్యయము అపవాద ప్రత్యయము ఈ రెండు సరూపములైనచో అపవాద ప్రత్యయమేకాని ఉత్సర్గప్రత్యయము రాదు ఎట్లన కర్మణ్యణ్ అను సామాన్య సూత్రముచే అణ్ ప్రత్యయమును ఆతోఽనుపసర్గేకః అనునపవాద సూత్రముచే క ప్రత్యయమును విధింపబడుచున్నవి ఈ రెండు ప్రత్యయములందును అ అనునదియే మిగులుటచే నివి సరూపములు కనుక క ప్రత్యయము అణ్ ప్రత్యయమును నిత్యముగ బాధించును క ప్రత్యయముతో పాటు అణ్ ప్రత్యయము రావని భావము

ఇట్లే స్త్రియాం అను నధికారమందున్న ఉత్సర్గాపవాదములలో అపవాదముత్సర్గమును నిత్యముగ బాధించును ఎట్లన స్త్రియాం క్తిన్ అను సామాన్య సూత్రముచే క్తిన్ ప్రత్యయమును అప్రత్యయాత్ అను అపవాదసూత్రముచే అ ప్రత్యయమును విధింపబడుచున్నవి ఈ

రెండును అపరూపములేయైనను స్త్రియాం అనునధికారములో నుండుటచే అపవాదము త్వర్గమును నిత్యముగ బాధించును ఆ ప్రత్యయముతో పాటు క్తిన్ ప్రత్యయము రాదని భావము

సూ - కృత్యాః ३-१-९५

వృ - ణ్వుల్ తృచౌ ఇత్యత ప్రాక్ కృత్యసంజ్ఞా స్యుః

ణ్వుల్ తృచౌ అను సూత్రమువఱకు చెప్పబడిన ప్రత్యయములు కృత్యసంజ్ఞకములగును

ఈ సూత్రము మొదలుకొని ణ్వుల్ తృచౌ అనుసూత్రమునకు పూర్వమందున్న చిత్యాగ్ని చిత్యేచ అను సూత్రము వఱకు విధింప బడిన తవ్యత్ తవ్య అనీయర్ కేలిమర్ యత్ క్యప్ ణ్యత్ అను వీ యేడు కృత్యప్రత్యయము లనబడును

సూ - కర్తరి, కృత్. ३-४-६७

వృ - కృత్ప్రత్యయః కర్తరి స్యాత్ ఇతి ప్రాప్తే

కృత్ప్రత్యయము కర్త్రర్థమున వచ్చును అని ప్రాప్తింపగా

కృదతిఙ్ అను సూత్రముచే తిఙ్ భిన్నప్రత్యయములు కృత్ప్రత్య యములనుటచే తవ్యత్ తవ్య అను పైన చెప్పబడిన ఏడు కృత్యప్రత్య యములును కృత్ప్రత్యయములే కనుక ప్రకృతసూత్రముచే నివి కర్త్రర్థమున రావలసి యుండగా దీనికపవాదముగ నీ క్రింది సూత్రము చెప్పబడుచున్నది

సూ - తయోరేవ కృత్య క్తఖలర్థాః ३-४-७०

వ వి - తయోః ఏవ కృత్య క్త ఖ-ర్థాః

వృ - ఏతే భావకర్మణోరేవ స్యుః

ఇవి భావార్థమునందును కర్మార్థమునందును మాత్రమే వచ్చును

కృత్యప్రత్యయములు క్తప్రత్యయము ఖలర్థకప్రత్యయము ఇవి సకర్మకధాతువులపైన కర్మార్థమునందు అకర్మకధాతువులపైన భావార్థమందు వచ్చును కర్త్రర్థమున రావని భావము

సూ-తవ్యత్తవ్యానీయరః. 3-1-96

వృ-ధాతోరేతే ప్రత్యయాః స్యుః ఏధితవ్యమ్ ఏధనీయమ్ త్వయా భావే ఔత్సర్గికమేకవచనం క్లీబత్వంచ చేతవ్యశ్చయనీయో వా ధర్మస్త్వయా

తవ్యత్ తవ్య అనీయర్ అను నీ మూడు ప్రత్యయములు సకర్మకధాతువులపై కర్మార్థమునను అకర్మకధాతువులపై భావార్థమునను వచ్చును

ఏధితవ్యం -(త్వయా) ఏధ (వృద్ధౌ) ధాతువు అకర్మకము కనుక దానిపై ప్రకృత సూత్రముచేత భావార్థమున తవ్యత్ తవ్య అను ప్రత్యయములను వానికి పూర్వము ఇడాగమమును వచ్చి ఏధ్+ఇ+తవ్య = ఏధితవ్య అని యగును భావార్థమున సామాన్య నపుంసక లింగమును ఏకవచనమును వచ్చి ఏధితవ్యమ్ అని యగును

ఏధనీయమ్ (త్వయా) -ఏధధాతువుపై ప్రకృతసూత్రముచే అనీయ (ర్) ప్రత్యయము వచ్చి నపుంసకలింగైక వచనమున ఏధనీయమ్ అని యగును

చేతవ్య - [2]చి(ఞ్) అను సకర్మకధాతువుపై కర్మార్థమున తవ్య (త్) తవ్య అను ప్రత్యయములురాగా చి+తవ్య అనియగును పిదవ

ఆర్ధధాతుకస్యేడ్వలాదేః అను సూత్రముచే

2 చిఞ్ = చయనే

గుణము వచ్చి చే+తవ్య అనియేర్పడి పులింగప్రథమైక వచనమున చేతవ్యః అని యగును

చయనీయ (ధర్మః) - చిధాతువుపై అనీయ (ర్) ప్రత్యయమును గుణమును వచ్చి చే+అనీయ అనియగును పిదప ఏచోఽ వాయావః అను సూత్రముచే ఏకారమునకు అయాదేశము వచ్చి పులింగప్రథమైకవచనమున చయనీయ అని యగును

వా - కేళిమర ఉపసంఖ్యానమ్.

పచేళిమా మాషాః పక్తవ్యా ఇత్యర్థ భిదేళిమాః సరళా భేత్తవ్యా ఇత్యర్థ కర్మణి ప్రత్యయః

తవ్యత్ మున్నగు ప్రత్యయములవలెనే సకర్మక ధాతువులపైన కర్మార్థమున కేళిమర్ అనుప్రత్యయమును చెప్పవలెను

పచేళిమాః (మాషాః) - పచ్ అను సకర్మకధాతువుపై ఈ వార్తికముచే కర్మార్థమున కేళిమర్ (ఏళిమ) అను ప్రత్యయము వచ్చి పచ్+ ఏళిమ = పచేళిమ అని కాగా పుంలింగ ప్రథమా బహువచనమున పచేళిమాః అని యగును

భిదేళిమా (సరళాః) సకర్మకమగు భిద్ ధాతువుపై కర్మార్థమున పై వలెనే కేళిమర్ (ఏళిమ) అను ప్రత్యయము వచ్చి భిదేళిమాః అని యగును

సూ - కృత్యల్యుటో బహుళమ్. ౩-౩-౧౧౩

ప వి - కృత్యల్యుటః బహుళమ్

డుపచష్ = పాకే

శ్లో -క్వచిత్ప్రవృత్తిః క్వచిదప్రవృత్తిః క్వచిద్విభాషా క్వచిదన్యదేవ
విధేర్విధానం బహుధా సమీక్ష్య చతుర్విధం బాహుళకం వదన్తి॥

స్నాత్యనేనేతి స్నానీయం చూర్ణమ్ దీయతే అస్మై దానీయో విప్రః

కృత్యప్రత్యయములు మఱియు ల్యుట్ ప్రత్యయము ధాతువుపై బహుళముగ వచ్చును

ఒకచో కార్యము నిత్యముగ ప్రవర్తించుట ఒకచో ప్రవర్తింపకుండుట ఒకచో వికల్పముగ ప్రవర్తించుట ఒకచో అన్యకార్యము వచ్చుట అని బహుళశబ్దమునకు నాలుగర్థములు అనగా బహుళమ్ అను పదముచే విధింపబడు కార్యము ఒకచోట నిత్యముగ ప్రవర్తించును ఒకచోట అసలు ప్రవర్తించదు ఒకచోట వికల్పముగా ప్రవర్తించును ఒకచోట ఈ కార్యము కాక మఱొక కార్యము వచ్చును

తయోరేవ కృత్యక్తఖలర్థాః" అను సూత్రముచే కృత్యప్రత్యయములు భావార్థమందును కర్మార్థమందును మాత్రమే వచ్చును కాని ప్రకృతసూత్రమున బహుళమ్ అను పదముండుటచే పైయర్థములందేకాక ఇతరకారకముల యర్థమునందును కృత్యప్రత్యయములు వచ్చును ఉదాహరణమునకు స్నాత్యనేన ఇతి స్నానీయం చూర్ణమ్ (దీనితో స్నానము చేయుదురు కనుక ఇది స్నానీయమైన చూర్ణము) అనుచోట కరణార్థమున కృత్యప్రత్యయము వచ్చినది

స్నానీయమ్ -స్నాధాతువుపై భావకర్మార్థములందేకాక కరణరూప కారకార్థమునను బహుళగ్రహణముచే అనీయ (ర్) అను కృత్యప్రత్యయము వచ్చి స్నా+అనీయ అనియగును పిదప సవర్ణదీర్ఘమువచ్చి నపుం లిం ప్ర ఏకవచనమున స్నానీయమ్ అని యగును

దీయతే అస్మై ఇతి దానీయోవిప్రః (ఇతరులకు దానముచేయ బడుచున్నది కనుక నితడు దానీయుడైన విప్రుడు) ఇట దా ధాతువుపై భావకర్మార్థములందే కాక బహుళగ్రహణముచే సంప్రదానార్థమునను అనీయర్ ప్రత్యయము వచ్చి పైవలెనే దానీయః అనురూపమేర్పడును

సూ-అచో యత్. ౩-౧-౯౭

ప వి-అచః యత్

వృ-అజన్తాద్ధాతోః యత్ స్యాత్

అజన్తమైన ధాతువుపై యత్ (య) ప్రత్యయము వచ్చును

చేయమ్-చి (చిఞ్) అనునది అజన్తమైన ధాతువు కనుక నీసూత్రముచే చి అను ధాతువుపై య(త్) ప్రత్యయమును ఇకారమునకు గుణమును వచ్చి న లిం ప్ర ఏకవచనమున చేయమ్ అని యగును

సూ-ఈద్యతి. ౬-౪-౬౫

ప వి-ఈత్ యతి

వృ-యతి పరే ఆత ఈత్ స్యాత్

యత్ప్రత్యయము పరమగునపుడు ఆకారమునకు ఈకారమాదేశమగును

దేయమ్-దా ధాతువు అజన్తమగుటచే పైసూత్రముచే యత్ప్రత్యయము వచ్చి దా+య అని యగును ఇట దాలోని ఆకారమునకు యత్ ప్రత్యయము పరమగుటచే ఈకారమాదేశమై దీ+య అని కాగా [2]గుణముచే దే+య అనియేర్పడి న లిం ప్ర ఏకవచనమున దేయమ్ అని యగును

డుదాఞ్ = దానే 2 సార్వధాతుకార్ధధాతుకయోః

గ్లేయమ్ - గ్లై అను ధాతువుపై పై సూత్రముచే యత్ ప్రత్యయమును గ్లై లోని ఐకారమునకు ఆకారమును ఆకారమునకు దేయమ్ అను చోటవలెనే ఈకారాదేశమును గుణమునువచ్చి న లిం ప్ర ఏకవచనమున గ్లేయమ్ అనురూప మేర్పడును

సూ - పోరదుపధాత్. ౩-౧-౯౮

ప వి - పోః అదుపధాత్

వృ - పవర్గాన్తాదదుపధాత్ యత్ స్యాత్ ణ్యతోఽపవాదః శప్యమ్ లభ్యమ్

పవర్గము అంతమందు కలదియు హ్రస్వాకారముపధగా కలదియు నగు ధాతువుపై యత్ ప్రత్యయము వచ్చును ఉపధయనగా చివరి వర్ణమునకు పూర్వమందుండు వర్ణము ఈ సూత్రము ఋహలోర్ణ్యత్ అను తరువాతి సూత్రముచే వచ్చు ణ్యత్ ప్రత్యయమున కపవాదము

శప్యమ్ - శప ధాతువు పవర్గాన్తము చివరి వర్ణమగు పకారమునకు పూర్వమందు హ్రస్వాకారముండుటచే అదుపధము కూడ కనుక శప ధాతువుపై య(త్) ప్రత్యయము వచ్చి న లిం ప్రథమైకవచమున శప్యమ్ అని యగును ణ్యత్ ప్రత్యయమే వచ్చినచో వృద్ధి వచ్చి అనిష్టరూపమేర్పడ వలసి వచ్చును

లభ్యమ్ - లభ్ అను ధాతువుపై పైవలెనే ప్రకృతసూత్రముచే యత్ ప్రత్యయము వచ్చి లభ్యమ్ అనురూపము సిద్ధించును

సూ - ఏతి, స్తు, శా, స్వృ, దృ జుషః, క్యప్. ౩-౧-౧౦౯

ప వి - ఏభ్యః క్యప్ స్యాత్

ఆదేచ ఉపదేశేఽశితి

ఇణ్ స్తు శాసు వృ దృ జుష్ అను వీయారు ధాతువులపై క్యప్(య) ప్రత్యయము వచ్చును

వీనిలో ఇ(ణ్) స్తు వృ దృ అను నాలుగు ధాతువులు అజన్తములగుటచే వీనిపై అచోయత్ అను సూత్రముచే యత్ ప్రత్యయమును శాస్ జుష్ అనుధాతువులు హలన్తములగుటచే వీనిపై ఋహలోర్ణ్యత్ అను సూత్రముచేత ణ్యత్ ప్రత్యయమును ప్రాప్తించు చుండగా ఈ సూత్రముచే వానికపవాదముగ క్యప్ ప్రత్యయము విధింపబడుచున్నది దీనికుదాహరణములు తరువాతి రెండు సూత్రములలో వివరింపబడును

సూ - హ్రస్వస్య. పితి. కృతి తుక్. ౬-౧-౭౧

ఉదా - ఇత్యః స్తుత్యః

హ్రస్వమునకు పకారమిత్తుగాకల కృత్ప్రత్యయము పరమగునపుడు తుగాగమము (త్) వచ్చును

ఇత్యః - ఇ(ణ్) ధాతువుపై "ఏతిస్తు అను సూత్రముచే క్యప్ (య) ప్రత్యయము వచ్చి ఇ + య అనియగును ఇట పరమందున్న క్యప్ ప్రత్యయము పకారమిత్తైన కృత్ప్రత్యయమగుటచే ఇ అను హ్రస్వమునకు తుగాగమము వచ్చి ఇత్ + య = ఇత్య అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున ఇత్యః అని యగును

స్తుత్యః - స్తు అను ధాతువుపై పైవలెనే క్యప్ ప్రత్యయమును స్తులోని ఉకారమునకు తుగాగమమును రాగా పుం ప్ర ఏకవచనమున స్తుత్యః అని యగును

వృత్యః అదృత్యః - వృధాతువు పైనను అజ్ పూర్వక దృధాతువు పైనను పైవలెనే క్యప్ ప్రత్యయమును తుగాగమమును వచ్చి అదృత్యః, వృత్యః అను రూపములేర్పడును

సూ - శాస ఇదఙ్ హలోః ౬-౪-౩౪.

ప వి - శాసః ఇత్ అఙ్హలోః

వృ - శాస ఉపధాయాః ఇత్ స్యాత్ అఙి హలాదౌ కిఙి చ శిష్యః

శాస్ ధాతువునకు అఙ్గుకాని కిత్తులేక ఙిత్తు ఐన ప్రత్యయముకాని పరమగునపుడు శాస్ ధాతువు ఉపధకు హ్రస్వ ఇకారమాదేశమగును

శిష్యః - శాస్ధాతువుపై ఏతిస్తుశాస్ అను సూత్రముచే క్యప్ప్రత్యయము వచ్చి శాస్+య అనియగును ఇట శాస్ధాతువునకు పరముగ పకారమిత్తుగా కల ప్రత్యయము (క్యప్) ఉండుటచే శాస్లోని ఉపధయగు అకారమునకు ఇకారాదేశము వచ్చి శ్+ఇ+స్+య = శిస్+య అని యగును పిదప సకారమునకు షకారమాదేశమై శిష్+య = శిష్యః అను పుం ప్ర ఏకవచనరూపమేర్పడును

జుష్యః - జుష్ధాతువుపై పైవలెనే క్యప్ ప్రత్యయము వచ్చి జుష్య అని యేర్పడును

సూ - మృజేర్విభాషా ౩-౧-౧౧౩

ప వి - మృజేః విభాషా

వృ - మృజేః క్యప్ వా స్యాత్ మృజ్యః

మృజ్ధాతువుపై క్యప్ ప్రత్యయము వికల్పముగ వచ్చును

మృజ్యః - మృజ్ధాతువుపై ఈ సూత్రముచే క్యప్(య) ప్రత్యయమువచ్చి పుం ప్ర ఏకవచనమున మృజ్యః అనియగును

సూ - ఋహలోర్ణ్యత్ ౩-౧-౧౨౪

ప వి - ఋహలోః, ణ్యత్.

వృ - ఋః ర్ణాత్ హలన్తాచ్చ ధాతోః ణ్యత్ స్యాత్ కార్యమ్ హార్యమ్ ధార్యమ్

ఋకారాన్తమను హలన్తమును అగు ధాతువుపై ణ్యత్ (య) ప్రత్యయము వచ్చును

కార్యమ్ - కృ(ఞ్) ధాతువు ఋకారాన్తము కనుక దానిపై ప్రకృత సూత్రముచే ణ్యత్ (య) ప్రత్యయము వచ్చి కృ + య అనియగును ణ్యత్ ప్రత్యయము ణిత్తగుటచే అచోఞ్ణితి అను సూత్రముచే ఋకారమునకు వృద్ధి (ఆకారము) రపరముగవచ్చి కార్ + య అని యేర్పడి నపుం లిం ప్ర ఏకవచనమున కార్యమ్ అనియగును

హృ ధృ అను ఋకారాన్త ధాతువులపై పై వలెనే ణ్యత్ ప్రత్యయమును, వృద్ధియు వచ్చి హార్యమ్ ధార్యమ్ అను రూపములేర్పడును

సూ - చజోః కు ఘిణ్ణ్యతోః ౭-౩-౫౨

వృ - చజోః కుత్వం స్యాత్ ఘితి ణ్యతి చ పరే

చకార జకారములకు ఘిత్తు (ఘకారమిత్తుగా కలది) కాని ణ్యత్ ప్రత్యయముకాని పరమగుచో కుత్వము (కవర్గము) ఆదేశమగును

స్థానేఽన్తరతమః అను పరిభాషచే చకారస్థానమున కకారమును జకారస్థానమున గకారమును ఆదేశముగ వచ్చునని భావము

మార్గ్యః - మృజేర్విభాషా అనుసూత్రముచే మృజ్ ధాతువుపై వచ్చు క్యప్ ప్రత్యయము వికల్పము కనుక నది రాని పక్షమున "ఋహలోర్ణ్యత్ అనుసూత్రముచే ణ్యత్ ప్రత్యయమువచ్చి మృజ్ + య అనియగును ఇట మృజ్‌లోని జకారమునకు పరముగ ణ్యత్ ప్రత్యయముండుటచే ప్రకృతసూత్రముచే కవర్గములోని గకారమాదేశమై మృగ్ + య అనియగును తరువాత నీక్రిందిసూత్రము ప్రవర్తించును

సూ - మృజే ర్వృద్ధిః ౭-౨-౧౧౪

ప ది - మృజేః వృద్ధిః

వృ - మృజేరికో వృద్ధిః సార్వధాతుకార్ధధాతుకయోః మార్గ్యః

సార్వధాతుకము కాని ఆర్ధధాతుకముకాని పరమగునపుడు మృజ్ ధాతువు ఇక్కునకు (ఋకారమునకు) వృద్ధి వచ్చును

మృగ్ + య అని యుండగా ప్రకృతసూత్రముచే మృగ్‌లోని ఇక్కునకు (ఋకారమునకు) వృద్ధి (అకారము) రపరముగ వచ్చి పుం ప్ర ఏకవచనమున మార్గ్యః అని యగును

సూ - భోజ్యం భక్ష్యే. ౭-౩-౬౯

వృ - భోగ్యమన్యత్

భక్ష్యము (తినుటకు యోగ్యమైనది) అనునర్థము గమ్యమైనపుడు జకారమునకు కుత్వమురాని భోజ్యమ్ అను రూపము నిపతింపబడుచున్నది అనగా ఏ యర్థమున భోజ్ + య అనుచోట "చజోః కు" అను సూత్రముచేత కవర్గము (గకారము) ఆదేశముగ రాదని భావము అనుభవింప దగినది అనునర్థము గమ్యమైనపుడు మాత్రము జకారమునకు కవర్గము (గకారము) ఆదేశమై భోగ్యమ్ అనురూపమేర్పడును కనుక భోజ్యం అనుపదమునకు తినదగినదనియు భోగ్యం అనుపదమునకు అనుభవింపదగినదనియు అర్థములు

ఇతి కృత్యప్రక్రియా.

అథ కృదన్త ప్రకరణమ్

సూ - ణ్వుల్తృచౌ ౩-౧-౧౧౩

వృ - ధాతోరేతౌ స్తః కర్తరి కృదితి కర్త్రర్థే

ధాతువుపై ణ్వుల్ (వు) తృచ్ (తృ) అను ప్రత్యయములు వచ్చును కర్తరికృత్ అను సూత్రముచే నీప్రత్యయములు కర్త్రర్థమున వచ్చునని భావము

యువోరనాకౌ ౭-౧-౧

ప వి యువో అనాకౌ

వృ - యు వు ఏతయోః అనాకౌ స్తః కారకః, కర్తా

యు వు అను ఈ రెంటికి అన అక అనునాదేశములు క్రమముగ వచ్చును

కారక - కృధాతువుపై ణ్వుల్తృచౌ అను సూత్రముచే ణ్వుల్ (వు) ప్రత్యయమురాగా కృ + వు అని యుండగా ఈసూత్రముచే వు అను ఆదేశమురాగా కృ + అక అనియగును ఇట పరమందున్న ణ్వుల్ ప్రత్యయము ణిత్తగుటచే అచోఞ్ణితి అను సూత్రముచే కృలోని ఋకారమునకు వృద్ధి (ఆకారము) రపరమై వచ్చి క్ + ఆర్ + అక = కారక అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున కారకః అనియగును

కర్తా - కృ ధాతువుపై ణ్వుల్తృచౌ అను సూత్రముచే కర్త్రర్థమున తృచ్ (తృ) ప్రత్యయము రాగా కృ + తృ అని యుండగా సార్వధాతు

కార్ధధాతుకయోః అను సూత్రముచే కృలోని ఋకారమునకు గుణము (అకారము) రపరముగ వచ్చి క్+అర్+తృ= కర్తృ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున కర్తా అని యగును

సూ -నన్దిగ్రహిపచాదిభ్యో ల్యుణిన్యచః ३-१-१३४

ప వి -నన్దిగ్రహిపచాదిభ్యః ల్యుణిన్యచః

వృ -నన్ద్యాదేర్ల్యుః గ్రహ్యాదేర్ణిని పచాదేరచ్ స్యాత్

నన్దయతీతి నందనః జనమర్దయతీతి జనార్దనః లవణః గ్రాహీ, స్థాయీ, మంత్రీ పచాదిరాకృతిగణః

నంద్ మున్నగు ధాతువులపై ల్యు (యు) ప్రత్యయమును గ్రహ్ మున్నగు ధాతువులపై ణిని (ఇన్) ప్రత్యయమును పచ్ మున్నగు ధాతువులపై అచ్ (అ) ప్రత్యయమును కర్త్రర్థమున వచ్చును

నన్దనః -(నన్దయతీతి) ణిచ్ ప్రత్యయాన్తమగు నద్ (టునది సమృద్ధౌ) ధాతువునకు నుమాగమము వచ్చి నన్ది యగును ఇట ప్రకృతసూత్రముచే ల్యుప్రత్యయమును ణేరనిటి అను సూత్రముచే ణిచ్చునకు (ఇకారమునకు) లోపము వచ్చి నన్ద్+యు అని యుండును పిదప యువోరనాకౌ అను సూత్రముచే 'యు అనుదానికి అన అను నాదేశము వచ్చి నన్ద్+అన = నన్దన అనియగును పుం ప్ర ఏకవచనమున నన్దనః అని సిద్ధించును

జనార్దనః -(జనం అర్దయతీతి) జన శబ్దముపపదముగాగల అర్ద్ ధాతువుపై ప్రకృతసూత్రముచే ల్యుప్రత్యయమును దానికి యువోరనాకౌ అనుసూత్రముచే అన అను ఆదేశమును వచ్చి జన+అర్దన అని యగును పిదప సవర్ణదీర్ఘము వచ్చి పుం ప్ర ఏకవచనమున జనార్దనః అనియగును

లవణః - లూ (ఞ్) ధాతువుపై పైవలెనే ల్యుప్రత్యయమును దానికి అవాదేశమును లూ లోని ఊ కారమునకు గుణమును (ఓకారము) అవాదేశమునువచ్చి లవ్ + అన = లవన అని యగును నంద్యాది గణములో నివతించుటవలన నకారమునకు ణకారము వచ్చి పుం ప్ర ఏకవచనమున లవణః అని యగును

గ్రాహీ - గ్రహధాతువుపై కర్త్రర్థమున ప్రకృత సూత్రముచే ణిని (ఇన్) ప్రత్యయము వచ్చి గ్రహ్ + ఇన్ అనికాగా ఉపధావర్ణమగు అకారమునకు వృద్ధివచ్చి గ్రాహ్ + ఇన్ = గ్రాహిన్ అని యగును పుం ప్ర ఏకవచనమున గ్రాహీ అనియగును

స్థాయీ - ష్ఠా ధాతువునందలి షకారమునకు సకారముకాగా షకారమును నిమిత్తముగ జేసికొనివచ్చిన ష్టుత్వము (ఠకారమును) కూడ నివర్తించి స్థా అనియుండును ఇది గ్రహ్యాదియగుటచే దీనిపై ణిని (ఇన్) ప్రత్యయమువచ్చి స్థా + ఇన్ అనికాగా అకారమునకు నివర్తనముచే యుగాగమము వచ్చి స్థా + య్ + ఇన్ = స్థాయిన్ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున స్థాయీ అని యగును

మంత్రీ — ణిజన్తమగు మత్రి ధాతువునకు నుమాగమును ణిని(ఇన్) ప్రత్యయమును వచ్చి మంత్రి + ఇన్ అనికాగా ణేరనిటి అను సూత్రముచే మంత్రిలోని ణిచ్పునకు (ఇకారమునకు) లోపమువచ్చి పుం ప్ర ఏకవచనమున మంత్రీ అని యగును

సూ - ఇగుపధజ్ఞాప్రీకిరః, కః. ౩-౧-౧౩౫

వృ - ఏభ్యః కః స్యాత్ బుధః కృశః జ్ఞః ప్రియః కిరః

ఇక్కు (ఇ ఉ ఋ ౡ వర్ణములు) ఉపధగా గల ధాతువులపైనను జ్ఞా ప్రీ కౄ అను ధాతువులపైనను కర్త్రర్థమందు కప్రత్యయము వచ్చును కప్రత్యయమున కకారమిత్తైలోపించి అ మాత్రమే మిగులును

బుధః -బుధ్ అను ధాతువు ఇగుపధము కనుక ప్రకృత సూత్రము చే దీనిపై క (అ) ప్రత్యయము వచ్చిబుధ్+అ= బుధ అనికాగా పుం ప్ర ఏకవచనమున బుధ అని సిద్ధించును.

కృశః -కృశ్ ధాతువును ఇగుపధమే కనుక ప్రకృతసూత్రముచే కప్రత్యయము వచ్చిపైవలెనే కృశ అని యగును

జ్ఞః -జ్ఞా ధాతువుపై ప్రకృతసూత్రముచే క (అ) ప్రత్యయము రాగా జ్ఞా+అ అనికాగా ఆతో లోప ఇటిచ అను సూత్రముచే జ్ఞా లోని ఆకారమునకు లోపము వచ్చి జ్ఞ్+అ= జ్ఞ అని కాగా పుం ప్ర ఏకవచనమున జ్ఞ అని సిద్ధించును

ప్రియ -ప్రీ ధాతువుపై ప్రకృతసూత్రముచే క (అ) ప్రత్యయము రాగా ప్రీ+అ అనియగును పిదప "అచిశ్నుధాతు" అను సూత్రముచే ప్రీలోనిఈకారమునకు ఇయ అను నాదేశమురాగా ప్రియ్+అ= ప్రియ అని కాగా పుం ప్ర ఏకవచనమున ప్రియః అను రూపము సిద్ధించును

కిరః - కౄధాతువుపై ప్రకృత సూత్రముచే క (అ) ప్రత్యయమురాగా 'ఋత ఇద్ధాతోః' అను సూత్రముచే ఋకారమునకు వచ్చు ఇకారము రపరముగ ఆదేశమై కిర్+అ= కిర అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున కిరః అను రూపము సిద్ధించును

ఈ సూత్రముచే విధింపబడు క ప్రత్యయము కిత్తగుటచే కిఙిచ అను సూత్రముచే గుణము నిషేధింపబడుటచే బుధః కృశః ఇత్యాదులలో గుణము రాదని తాత్పర్యము

సూ - ఆతశ్చోపసర్గే ३-१-१३६

ప వి - ఆతః చ ఉపసర్గే

ఉపసర్గే ఉపపదే ఆదన్తాద్ధాతోః కః స్యాత్ ప్రజ్ఞః సుగ్లః

ఉపసర్గము ఉపపదముగ నున్నపుడు ఆకారాన్తమగు ధాతువుపై క ప్రత్యయము వచ్చును

ప్రజ్ఞః - ప్రపూర్వక జ్ఞాధాతువు ఆకారాన్తమగుటచే ప్రకృత సూత్రముచే క ప్రత్యయమును ఆతో లోప ఇటిచ అను సూత్రముచే ఆకార లోప మును రాగా ప్రజ్ఞ్ + అ = ప్రజ్ఞ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున ప్రజ్ఞః అని యగును

సుగ్లః - సు అను ఉపసర్గము పూర్వమందు గల గ్లై అను ధాతువులోని ఐకారమునకు ఆదేచ ఉపదేశేఽశితి' అను సూత్రముచే ఆకారమా దేశమై సుగ్లా అని యగును ఇట గ్లా అనునది ఆకారాన్తమగుట చే క ప్రత్యయమును ఆకార లోపమును వచ్చి పుం ప్ర ఏకవచ నమున సుగ్లః అని సిద్ధించును

సూ - గేహే, కః ౩-౧-౧౪౪

వృ - గేహే కర్తరి గ్రహేః కః స్యాత్ గృహమ్

గేహము (గృహము) అను నర్థమున గ్రహధాతువుపై కర్త్రర్థము న కప్రత్యయము వచ్చును

గ్రహ ధాతువుపై ప్రకృత సూత్రముపై కప్రత్యయము వచ్చి గ్రహ + అ అనికాగా "గ్రహిజ్యావ్యధి" అను సూత్రముచే గ్రహలోని రేఫముస్థానమున సంప్రసారణము (ఋకారము) వచ్చి గృహ + అ = గృహ అని యేర్పడి నపుం లిం ఏకవచనమున గృహమ్ అనియగును సంప్రసారణమనగా యణ్ణుల స్థానమున ఇక్కులు వచ్చుట

సూ - కర్మణ్యణ్ ౩-౨-౧

పవి - కర్మణి అణ్.

వృ - కర్మణ్యుపపదే ధాతోరణ్ ప్రత్యయః స్యాత్ కుంభం కరోతీతి కుంభకారః

కర్మ ఉపపదముగనున్నపుడు ధాతువుపై అణ్ ప్రత్యయము వచ్చును అణ్ ప్రత్యయమున ణకారమిత్తై అకారము మిగులును

కుంభ + అమ్ + కృ అను చోట కుంభ + అమ్ అను కర్మ ఉపపదముగనుండుటచే కృధాతువుపై అణ్ (అ) ప్రత్యయము వచ్చి కుంభ + అమ్ + కృ + అ అని కాగా అచోఞ్ణితి' అను సూత్రముచే ఋకారమునకు వృద్ధి (ఆకారము) రపరముగ వచ్చి కుంభ + అమ్ + కార అనియగును ఇది సమాసమగుటచే కృత్తద్ధిత సమాసాశ్చ అను సూత్రముచే ప్రాతిపదిక సంజ్ఞయు, తద్ద్వారా సుపోధాతుప్రాతిపదికయోః అను సూత్రముచే కుంభశబ్దము మీది సుప్పునకు (అమ్ అను విభక్తిప్రత్యయమునకు) లోపము వచ్చి కుంభకార అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున కుంభ కార అని సిద్ధించును

సూ -ఆతోఽనుపసర్గే కః ౩-౨-౩

ప వి - ఆతః అనుపసర్గే కః

వృ - ఆదన్తాద్ధాతోరనుపసర్గాత్ కర్మణ్యుపపదే కః స్యాత్ అణోఽపవాదః ఆతో లోప గోదః ధనదః కంబలదః

ఉపసర్గములేని ఆకారాన్తమగు ధాతువుపై కర్మవాచక పదముపపదముగానున్నపుడు క ప్రత్యయము వచ్చును. కర్తరికృత్ అను సూత్రముచే ఇది కర్త్రర్థమున వచ్చును కర్మణ్యణ్ అనుపై సూత్రముచేవచ్చు అణ్ ప్రత్యయమునకిది అపవాదము

గోదః - గాం దదాతి అనునర్థమున గో అను కర్మవాచకముపపదముగనున్నదా ధాతువుపై క ప్రత్యయము వచ్చి గోదా + అ అనియగును ఆతోధాతోః అనుసూత్రముచే దాలోని ఆకారమునకు లోపము వచ్చి పుం ప్ర ఏకవచనమున గోదః అనియగును

ఇక్లే ధనం దదాతి అనునర్థమున ధనదః అనియు కంబలం దదాతి అనునర్థమున కంబలదః అనియు రూపములు సిద్ధించును

వృ -అనుపసర్గే కిమ్? గోసందాయః

సూత్రమందలి అనుపసర్గే అను పదము గోసందాయః అను చోట నసాధురూ పమేర్పడకుండుట కొఱకు అనుపసర్గే అనుపదములేనిచో గో + సమ్ + దా అనుచోటను కప్రత్యయము వచ్చి గోసందః అని కావలసి వచ్చును అనుపసర్గే అని యున్నచో ఉపసర్గము పూర్వమందుండుటచే విట కప్రత్యయమును వారింపవచ్చును

వా -మూలవిభుజాదిభ్యః కః.

వృ - మూలాని విభుజతి మూలవిభుజో రథః ఆకృతిగణోఽయమ్ మహీధ్రః కుధ్రః

మూలవిభుజ మున్నగు వానిపై క ప్రత్యయము వచ్చును ఇది యాకృతి గణము

మూలవిభుజః - మూలాని విభుజతి అనునర్థమున విపూర్వకభుజి ధాతువు పై ఈ వార్తికముచే క (అ) ప్రత్యయము రాగాపుం ప్ర ఏకవచన ము౦ మూల విభుజః అనియగును

మహీధ్రః - మూలవిభుజాదులు ఆకృతిగణమనుటచే మహీ అను శబ్దము పపదముగా గల వృధాతువుపై క (అ) ప్రత్యయమురాగా మహీధృ + అ అనికాగా యణాదేశముచే మహీధ్రః అనియగును

కుధ్రః - కు పూర్వక ధృధాతువుపై పైవలెనే కప్రత్యయము రాగా కుధ్రః అనియగును.

సూ ..చరేష్టః ౩-౨-౧౬

వృ - అధికరణే ఉపపదే కురుచరః

అధికరణ వాచకముపపదముగానున్నపుడు చరధాతువుపై కర్తృర్థ మున ట ప్రత్యయము వచ్చును

కురుచరః - కురుషు చరతి అనునర్థమున అధికరణ వాచకమగు కురు శబ్దము పపదముగాగల చర్ధాతువుపై ట (అ) ప్రత్యయమురాగా కురు చర్ + అ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున కురుచరః అని సిద్ధించును

సూ - భిక్షాసేనాదాయేషు చ ३-२-१७

భిక్షాచరః సేనాచరః ఆదాయేతిల్యబన్తమ్-ఆదాయచరః

భిక్షా సేనా ఆదాయ (ల్యబన్తము) ఇవి ఉప పదములుగా గల చర్ధాతువుపైనను ట (అ) ప్రత్యయము వచ్చును

భిక్షాచరః సేనాచరః -భిక్షాం చరతి సేనాయాం చరతి అను నర్థముల భిక్షా సేనా అను శబ్దములు పపదములుగా గల చర్ ధాతువుపై ట (అ) ప్రత్యయము వచ్చి భిక్షాచరః సేనాచరః అనురూపములేర్పడును

ఆదాయచరః - ఆదాయ అను ల్యబన్త శబ్దముపపదముగనున్న చరధాతు వుపై ట ప్రత్యయమురాగా ఆదాయచరః అనియగును

సూ - కృఞో హేతుతాచ్ఛీల్యానులోమ్యేషు. ३-२-२०

ప వి - కృఞః హేతుతాచ్ఛీల్యానులోమ్యేషు

వృ - ఏషు ద్యోత్యేషు కరోతేః టః స్యాత్.

హేతువు తాచ్ఛీల్యము (స్వభావము) ఆనులోమ్యము (అను కూలత) అను నర్థములు గమ్యములగునపుడు ట (అ) ప్రత్యయము వచ్చును

సూ అతః కృ-కమి-కంస-కుమ్భ-పాత్ర-కుశా-కర్ణీష్వనవ్య యస్య ८-३-४६

౫౨ - అతః కృ-కమి-కంస-కుమ్భ-పాత్ర-కుశా-కర్ణీషు అనవ్యయస్య
 అదుత్తరస్య అనవ్యయస్య విసర్గస్య సమాసే నిత్యం సాదేశః
కరోత్యాదిషు పరేషు-యశస్కరీ (విద్యా) శ్రాద్ధకరః వచనకర

సమాసమున కృధాతువు కమిధాతువు మఱియు కంస కుమ్భ
పాత్ర కుశా కర్ణీ అను పదములు పరమగునపుడు అవర్ణమునకు పర
మైనదియు అవ్యయ సంబంధికానిదియు నగు విసర్గము స్థానమున సకార
మాదేశమగును

యశస్కరీ - విద్యా (విద్యయశస్సును కలిగించునది) ఇట యశస్సునకు
విద్య కారణమనుటచే హేత్వర్థము ద్యోత్యమగుచున్నది కనుక
యశస్ అనుశబ్దము ఉపపదముగా గల కృధాతువుపై పూర్వ సూత్రము
చే ట (అ) ప్రత్యయము వచ్చి యశస్+కృ+ అ అనికాగా
'సార్వధాతు అను సూత్రముచే గుణము (అకారము) రపరముగ వచ్చి
యశస్+కర్+అ అనియగును పిదప సకారమునకు రుత్వమును
రుత్వమునకు విసర్గమును ఆదేశమై యశః+కర అనియగును ఇట
కృధాతువు పరమగుటచే ప్రకృత సూత్రముచే విసర్గమునకు సకారమా
దేశమై యశస్+కర అనికాగా స్త్రీ ప్ర ఏకవచనమున యశస్కరీ
అనియగును

శ్రాద్ధకరః - (శ్రాద్ధము చేయు స్వభావము కలవాడు)

ఇట తాచ్ఛీల్యము ద్యోత్యమగుటచే పూర్వసూత్రముచే ట ప్రత్యయ
ము రాగా పైవలెనే శ్రాద్ధకరః అనియగును

వచనకరః - (మాటను పాటించువాడు)

ఇట ఆనులోమ్యము ద్యోత్యమగుటచే పూర్వసూత్రముచే 'ట ప్రత్య
యము రాగా వచనకరః అనియగును

సూ - ఏజేః, ఖశ్ ౩-౨-౨౮

వృ - ణ్యన్తాదేజేః ఖశ్ స్యాత్

కర్మవాచకముపపదముగనున్నపుడు ణి జన్తమగు ఏజిధాతువుపై ఖశ్ (అ) ప్రత్యయమువచ్చును ణిచ్ ప్రత్యయము ప్రేరణార్థమున వచ్చును

సూ - అరుర్ద్విషద జన్తస్య, ముమ్ ౬-౩-౬౭

వృ -అరుషో ద్విషతోఽజన్తస్య చ ముమాగమః స్యాత్ ఖిదన్తే పరే నత్వవ్యయస్య శిత్వాత్ శబాదిః జనమేజయతీతి జనార్దన

అరుస్ (మర్మము) ద్విషత్ (శత్రువు) అను శబ్దములకును అవ్యయ భిన్నమగు అజన్తములకును ఖిదన్తమైన (ఖకారమిత్తైన ప్రత్యయము అంతమందుగల) పదము పరమగునపుడు ముమ్ (మ్) అను నాగమము వచ్చును

జనమేజయ - జనం ఏజయతి అను వర్థమున జనశబ్దముపపదముగా గల ణ్యన్తమగు ఏజిధాతువుపై పై సూత్రముచే ఖశ్ (అ) ప్రత్యయము రాగా జన + ఏజి + అ అని యగును కర్తరి శప్ అను సూత్రముచే శప్ ప్రత్యయమును ఏజి ధాతువులోని ఇకారము కు గుణముచే ఏకారమును దానికి అయాదేశము పరరూపమును రాగా జన + ఏజయ అని యగును ఇట జన అను అజన్త శబ్దమునకు ఖిదన్తము (ఏజయ) పరమగుటచే ఈ సూత్రముచే ముమాగమము వచ్చి జన + మ్ + ఏజయ అని కాగా పుం ప్ర ఏకవచనమున జనమేజయః అని సిద్ధించును

సూ - ప్రియవశే, వదః, ఖచ్ ౩-౨-౩౮

ప్రియ వశ అను శబ్దములుపపదములుగాగల వద్ ధాతువుపై ఖచ్ (అ) ప్రత్యయము వచ్చును

ప్రియంవదః - ప్రియం వదతి అను నర్థమున ప్రియ శబ్దము పూర్వపదముగా గల వద్ ధాతువుపై ఈ సూత్రముచే ఖచ్ (అ) ప్రత్యయమును పూర్వ సూత్రముచే ముమాగమమును రాగా ప్రియంవదః అని యగును ఇట్లే వశంవద అను రూపము నేర్పడునది

సూ - అన్యేభ్యోపి దృశ్యన్తే ౩-౨-౭౫

ప వి - అన్యేభ్యః అపి దృశ్యన్తే

వృ - మనిన్ క్వనిప్ వనిప్ విచ్ అను ప్రత్యయము ధాతువులపై వచ్చును

సూ - నేడ్వశి కృతి ౭-౨-౮

ప వి - న ఇట్ వశి కృతి

వృ - వశాదేః కృతః ఇట్ న స్యాత్-శౄ హింసాయామ్-సుశర్మా ప్రాతరిత్వా

వశ్ ప్రత్యాహార వర్ణమాది యందుగల కృత్ప్రత్యయమునకు ఇడాగమము రాదు

సుశర్మా - సుపూర్వకమైన శౄ(హింసాయాం) ధాతువుపై పై సూత్రముచే మనిన్ ప్రత్యయము (మన్) రాగా గుణముచే సు శర్ + మన్ అని యగును ఇట ఆర్ధధాతుకస్యేడ్వలాదేః అను సూత్రముచే మన్ ప్రత్యయమునకు ఇడాగమము వచ్చుచుండగా పరమందున్న మనిన్ ప్రత్యయము వశాదియగు కృత్ప్రత్యయమగుటచే ఇడాగమము నిషేధింపబడి సుశర్మన్ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున సుశర్మా అని సిద్ధించును

ప్రాతరిత్వా - ప్రాతర్ శబ్దము పూర్వపదముగాగల ఇ (ణ్) ధాతువుపై వనిప్(వన్) ప్రత్యయము రాగా ప్రాతర్ + ఇ + వన్ అనికాగా ఇ(ణ్)

ధాతువునకు హ్రస్వస్య అను సూత్రముచే తుగాగమమువచ్చి ప్రాతర్ + ఇ + త్ + వన్ = ప్రాతరిత్వన్ అని యేర్పడి ప్రం ప్ర ఏక వచనమున ప్రాతరిత్వా అని యగును

సూ - విడ్వనోరనునాసికస్యాత్. ౬-౪-౪౧

ప ఛే - విడ్వనోః అనునాసికస్య ఆత్

వృ - అనునాసికస్యాత్ విజాయతే ఇతి విజావా ఓణృ అపనయనే అవావా విట్-రుష రిష హింసాయామ్ రోట్ రేట్ సుగణ్

విట్ వన్ అను ప్రత్యయములు పరమగునపుడు అనునాసికము నకు ఆకారమాదేశముగ వచ్చును వన్ అనుదానిచే క్వనిప్ వనిప్ అను రెండు ప్రత్యయములు గ్రహింపబడును

విజావా - విజాయతే అనునర్థమున విపూర్వక జన్ ధాతువుపై పైసూత్ర ముచే వనిప్ (వన్) ప్రత్యయమురాగా విజన్ + వన్ అనిరాగా ప్రకృత సూత్రముచే జన్‌లోని అనునాసికమునకు (నకారమునకు) ఆకారమాదేశమై విజ + ఆ + వన్ అని యగును పిదప సవర్ణ దీర్ఘము వచ్చి ప్రం ప్ర ఏకవచనమున విజావా అని యగును

అవావా - ఓణృ(అపనయనే) ధాతువుపై పైసూత్రముచే వనిప్ ప్రత్యయము రాగా ఓణ్ + వన్ అనిరాగా ప్రకృత సూత్రముచే అనునాసికమగు ణకారస్థానమున ఆకారమాదేశమై ఓ + ఆ + వన్ అనియగును పిదప ఓకారమునకు అవాదేశము వచ్చి ప్రం ప్ర ఏకవచనమున అవావా అని సిద్ధించును

రోట్ - రుష(హింసాయాం) ధాతువుపై పైసూత్రముచే విట్ ప్రత్యయము రాగా విట్ ప్రత్యయము సర్వలోప మగుటచే రుష్ అని మేయుండును ఉ లోని ఉకారమునకు గుణమును విభక్తికార్యములును రాగా రోట్

అని యగును ఇట్లే రేట్ సుగణ్ అను రూపములను సాధింప వగును

సూ - క్విప్ చ. ౩-౨-౭౬

అయమపి దృశ్యతే ఉఖాస్రత్ పర్ణధ్వత్ వాహాభ్రట్

సుబన్తము ఉపపదముగ నున్నపుడు అన్నిధాతువులపై క్విప్ ప్రత్యయము వచ్చును క్విప్ ప్రత్యయమునందలి వర్ణములన్నియును లోపించును

ఉఖాస్రత్ - ఉఖాయాః స్రంసతే (వంటకుండ నుండి పడుచున్నది) అను సప్తమ్యన్త సుబంతమగు ఉఖాశబ్దముపైనున్న స్రంస్ ధాతువుపై ఈ సూత్రముచే క్విప్ ప్రత్యయము వచ్చును స్రంస్‌లోని నకారమునకు (నకారాదేశమగు అనుస్వారమునకు) అనిదితాం అను సూత్రముచే లోపమును వసుస్రంసు అను సూత్రముచే చివరి సకారమునకు దకారము ఆదేశమై ఉఖాస్రద్ అనికాగా ప్రథమ ఏకవచనమున ఉఖాస్రత్ అయియగును ఇట్లే "పర్ణధ్వత్" అను రూపమును సాధింపనది పర్ణాత్ ధ్వంసతే అని విగ్రహము "వాహాభ్రట్" అను రూపముకూడ ఇట్లే సిద్ధించును వాహాత్ భ్రశ్యతి అని విగ్రహము

సూ - సుప్యజాతౌ ణినిస్తాచ్ఛీల్యే. ౩-౨-౭౮

ప వి - సుపి అజాతౌ ణినిః తాచ్ఛీల్యే

వృ - అజాత్యర్థే సుపి ధాతోర్ణినిః తాచ్ఛీల్యే ద్యోత్యే ఉష్ణభోజీ

జాతివాచకముకాని సుబన్తము ఉపపదముగ నున్నపుడు తాచ్ఛీల్యము (స్వభావము) అను అర్థము గమ్యమైనచో ధాతువుపై ణిని (ఇన్) ప్రత్యయము వచ్చును

ఉష్ణభోజీ - ఉష్ణం భుఙ్క్తే తచ్ఛీలః (ఉష్ణమైన ఆహారమును తిను స్వభావముకలవాడు) అనుచోట తాచ్ఛీల్యము గమ్యమగుటచే ఉష్ణ శబ్దముపపదముగాగల భుజ్ ధాతువుపై ణిని (ఇన్) ప్రత్యయమువచ్చి ఉష్ణ + భుజ్ + ఇన్ అని యగును పిదప భుజ్‌లోని ఉకారమునకు ఉపధాగుణము వచ్చి ఉష్ణభోజిన్ అని యేర్పడి పుం ప్ర ఏకవచన మున ఉష్ణభోజీ అనియగును

సూ - మనః. ౩-౨-౮౨

వృ - సుపి మన్యతేః ణినిః స్యాత్

సుబన్తముపపదముగ నున్నపుడు మన్ + ధాతువుపై ణిని (ఇన్) ప్రత్యయము వచ్చును

దర్శనీయమానీ - దర్శనీయం ఆత్మానం మన్యతే (తనను సుందరునిగ తలంచుచున్నాడు) అనుచోట దర్శనీయం అనుసుబంతముపపదమ గుటచే మన్ ధాతువుపై ప్రకృతసూత్రముచే ణిని (ఇన్) ప్రత్యయము రాగా దర్శనీయ + మన్ + ఇన్ అని యగును పిదప అత ఉపధాయాః అను సూత్రముచే మన్‌లోని అకారమునకు వృద్ధి వచ్చి దర్శనీయ + మాన్ + ఇన్ = దర్శనీయమానిన్ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున దర్శనీయమానీ అని యగును

సూ - ఆత్మమానే ఖశ్చ. ౩-౨-౮౩

ప వి - ఆత్మమానే ఖశ్ చ

వృ - స్వకర్మకే మననే వర్తమానాత్ మన్యతేః సుపి ఖశ్ స్యాత్ చాత్ ణిని పండితమాత్మానం మన్యతే పణ్డితమ్మన్యః పండితమానీ

సుబన్తముపపదముగ నున్నపుడు స్వకర్మక మననము(తనసుతాను తలంచుట) అనునర్థముగల మన్ ధాతువుపై ఖశ్ ప్రత్యయమును ణిని ప్రత్యయమును వచ్చును

పండితమ్మన్యః - పండితం ఆత్మానం మన్యతే (తనను తాను పండితుడని తలచుచున్నాడు) అనునర్థమున పండితం అను సుబన్తమువపదము పై టచే ప్రకృతసూత్రముచే ఖశ్ (అ) ప్రత్యయము వచ్చి పండిత + మన్ + అ అని యగును దివాదిభ్యః శ్యన్ అను సూత్రముచే శ్యన్ (య) ప్రత్యయమును అరుర్ద్విషత్ అను సూత్రముచే ముమా గమమును పరరూపమును వచ్చి పండిత + మ్ + మన్ + య = పండితమ్మన్య అని యేర్పడి ప్రథమైకవచనమున పండితమ్మన్యః అని యగును

పండితమానీ -పండితమాత్మానం మన్యతే అని విగ్రహము మన్ధాతువుపై ఈ సూత్రముచే ణిని (ఇన్) ప్రత్యయము రాగా దర్శనీయమానీ అను రూపము సిద్ధించును

సూ -ఖిత్యనవ్యయస్య. ౬-౩-౬౬

ప వి -ఖితి అనవ్యయస్య

వృ -ఖిదన్తే పరే పూర్వపదస్య హ్రస్వః నతు అవ్యయస్య తతో ముమ్ కాలింమన్యా

ఖకారమిత్తైన ప్రత్యయము అంతమందుగల పదము పరమగు నపుడు పూర్వపదము చివరివర్ణమునకు హ్రస్వమువచ్చును అవ్యయము నకు మాత్రము రాదు

కాలింమన్యా -ఆత్మానం కాలీం మన్యతే అనునర్థమున మన్ ధాతువుపై పైసూత్రముచే ఖశ్ ప్రత్యయమును పిదప శ్యన్ ప్రత్యయమును ముమాగమమును రాగా కాలీ + మ్ + మన్య + అ అనియగును ఇట మన్య + అ అనుచోట పరరూపము వచ్చి మన్య అని యగును మన్యయను ఖిదన్తము (ఖకారమిత్తైన ఖశ్ ప్రత్యయము అంతమందు గల పదము) పరమగుటచే కాలీ శబ్దములోని చివరి దీర్ఘమునకు

(ఈకారమునకు) ఈ సూత్రముచే హ్రస్వము వచ్చి స్త్రీలింగమున కాలింపన్యా అనియగును

సూ - కరణే, యజః ౩-౨-౮౫

వృ - కరణే ఉపపదే భూతార్థయజే ర్ణినిః స్యాత్ సోమేన ఇష్టవాన్ సోమయాజీ అగ్నిష్టోమయాజీ

కరణవాచకపదముపపదముగనున్నప్పుడు భూతార్థమును దెలుపు యజ్ధాతువుపై కర్త్రర్థమున ణిని (ఇన్) ప్రత్యయము వచ్చును

సోమయాజీ - సోమేన ఇష్టవాన్ (సోమముచే యాగము చేసినవాడు) అనునర్థమున కరణవాచకమగు సోమ శబ్దముపపదముగ నుండుటచే భూతార్థవాచియగు యజ్ ధాతువుపై ఈ సూత్రముచే ణిని (ఇన్) ప్రత్యయమును అత ఉపధాయా అను సూత్రముచే యకారములోని అకారమునకు వృద్ధియు వచ్చి సోమయాజ్ + ఇన్ అని యగును ఇట్లే అగ్నిష్టోమేన ఇష్టవాన్ అనువర్థమున అగ్నిష్టోమయాజి అను రూపము సాధింపనగును

సూ - దృశేః క్వనిప్ ౩-౨-౯౪

వృ - కర్మణి భూతే పారం దృష్టవాన్ పారదృశ్వా

కర్మవాచ ముపపదముగ నున్నప్పుడు భూతార్థకమగు దృశ్ ధాతువుపై క్వనిప్ (వన్) ప్రత్యయము వచ్చును

పారదృశ్వా - పారం దృష్టవాన్ (పారమును చూచినవాడు) అనునర్థమున పారం అను కర్మవాచకముపపదముగ నుండుటచే భూతార్థకమగు దృశ్ ధాతువుపై ఈ సూత్రముచే క్వనిప్ (వన్) ప్రత్యయము వచ్చి పారదృశ్ + వన్ అనికాగా షం ప్ర ఏకవచనమున పారదృశ్వా అని యగును

సూ . రాజని యుధి కృఞః ౩-౨-౯౫

వృ - క్వనిప్ స్యాత్ యుధిరన్తర్భావితణ్యర్థ రాజానం యోధితవాన్ రాజయుధ్వా రాజకృత్వా

రాజన్ శబ్దముపపదమగునపుడు జిచ్ ప్రత్యయార్థము(ప్రేరణము) కల యుధ్ ధాతువుపై క్వనిప్ (వన్) ప్రత్యయము వచ్చును

రాజయుధ్వా - రాజానంయోధితవాన్ (రాజును యుద్ధముచేయ ప్రేరేపించినవాడు) అను నర్థమున రాజన్ శబ్దముపపదమగుటచే యుధ్ ధాతువుపై క్వనిప్ (వన్) ప్రత్యయమువచ్చి రాజన్ + యుధ్ + వన్ అని కాగా రాజన్‌లోని నకారమునకు నలోప అను సూత్రముచే లోపమువచ్చి రాజ + యుధ్ + వన్ = రాజయుధ్వన్ అనియగును పుం ప్ర ఏకవచనమున రాజయుధ్వా అని సిద్ధించును

రాజకృత్వా - రాజానం కృతవాన్ (రాజును చేసినవాడు) అనునర్థమున రాజన్ శబ్దముపపదమగుటచే కృధాతువుపై ఈ సూత్రముచే క్వనిప్ (వన్) ప్రత్యయమును నలోపమును హ్రస్వస్యపితి అను సూత్రముచే తుగాగమును రాగా రాజకృత్వన్ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున రాజకృత్వా అని యగును

సూ సహే చ ౩-౨-౯౬

కర్మణీతి నివృత్తమ్ సహాయోధితవాన్ సహయుధ్వా సహకృత్వా

ఈ సూత్రములోనికి కర్మణి అనుపదము అనువర్తింపదు కనుక కర్మవాచకపదము కాక సహ అను పదము ఉపపదముగ నున్నపుడు భూతార్థమున యుధ్ కృఞ్ ధాతువులపై క్వనిప్ ప్రత్యయము వచ్చునని సూత్రార్థము

సహయుధ్వా - సహ యోధితవాన్ అనునర్థమున సహ అను శబ్దముపపదము గాగల యుధ్ ధాతువుపై క్వనిప్ ప్రత్యయము వచ్చి సహ + యుధ్ + వన్ = సహయుధ్వన్ అని కాగా పుం ప్ర ఏకవచనమున సహయుధ్వా అనియగును కలిసి యుద్ధముచేయ ప్రేరేపించినవాడని యర్థము

సహకృత్వా - సహ కృతవాన్ (కలిసి చేసినవాడు) అను నర్థమున కృధాతువుపై క్వనిప్ ప్రత్యయమును తుగాగమమునురాగా సహకృత్వా అని సిద్ధించును

సూ - సప్తమ్యాం జనేర్డః ౩-౨-౯౭

వ ని - సప్తమ్యాం జనేః డః

సప్తమ్యన్తముపపదముగ నున్నపుడు జన్ ధాతువుపై భూతార్థమున డ(అ) ప్రత్యయము వచ్చును

సూ - తత్పురుషే, కృతి బహులమ్. ౬ ౩-౧౪

వృ - ఙే రలుక్. సరసిజమ్ సరోజమ్

తత్పురుషసమాసమున కృదన్తము పరమగునపుడు ఙి (ఇ) అను సప్తమ్యేకవచన ప్రత్యయమునకు బహుళముగా లుక్కు (లోపము) కాదు

సరసిజమ్ - సరసి జాతమ్ (సరస్సున పుట్టినది) అనునర్థమున సరస్ + ఇ + జన్ అనియుండగా సరస్ + ఇ అను సప్తమ్యన్తముపపదమగుటచే జన్ ధాతువుపై డ (అ) ప్రత్యయము వచ్చి సరస్ + ఇ + జన్ + అ అని కాగా జన్‌లో టికి (అన్ అనుదానికి) లోపము రాగా సరస్ + ఇ + జ్ + అ అని యగును ఇట ఇ అను సప్తమ్యేకవచన ప్రత్యయ

మునకు సుపోధాతు అను సూత్రముచే లోపము ప్రాప్తింపగా ఈ సూత్రముచే దానికి లోపము బహుళముగ రావని చెప్పుటచే లోపము రాని పక్షమున సరస్ + ఇ + జ్ + అ = సరసిజమ్ అనియు సకారమునకు రుత్వమును దానికి ఉత్వమును గుణమును రాగా సరోజమ్ అనియు రూపములు సిద్ధించును

సూ - ఉపసర్గే చ, సంజ్ఞాయామ్. ౩-౨-౯౯

వృ - ప్రజా స్యాత్సన్తతౌ జనే

ఉపసర్గముపపదముగ నున్నచో సంజ్ఞార్థమున జన్ ధాతువుపై డ (అ) ప్రత్యయము వచ్చును

సంతతి అను సంజ్ఞార్థమున ప్ర అను ఉపసర్గముపపదముగాగల జన్ ధాతువుపై ప్రకృతసూత్రముచే డ (అ) ప్రత్యయమును టి (అన్) లోపమును రాగా స్త్రీ ప్ర ఏకవచనమున ప్రజా అను రూపము సిద్ధించును

సూ - క్త క్తవతూ, నిష్ఠా ౧-౧-౨౬

వృ - ఏతౌ నిష్ఠాసంజ్ఞౌ స్తః

క్త క్తవతు అను ఈ రెండు ప్రత్యయములు నిష్ఠా సంజ్ఞకములు

సూ - నిష్ఠా ౩-౨ ౧౦౨

వృ - భూతార్థవృత్తేర్ధాతోః నిష్ఠా స్యాత్ తత్ర తయోరేవ ఇతి భావ కర్మణోః క్తః కర్తరి కృత్ ఇతి క్తవతుః ఉకావితౌ స్నాతం మయా స్తుతస్త్వయా విష్ణుః విశ్వం కృతవాన్ విష్ణుః

భూతకాలార్థమును తెలుపు ధాతువుపై నిష్ఠా (క్త-క్తవతు) ప్రత్యయములు వచ్చును వీనిలో క్తప్రత్యయము తయోరేవ అను సూత్రముచే భావ కర్మార్థములందును క్తవతు (తవత్) ప్రత్యయము కర్తరికృత్ అను సూత్రముచే కర్త్రర్థమందును వచ్చును

స్నాతమ్ - (మయా) భూతార్థకమగు స్నాధాతువుపై ఈ సూత్రముచే భావార్థమున క్త (త) ప్రత్యయము వచ్చి స్నా+త అని కాగా నపుం ప్ర ఏకవచనమున స్నాతమ్ అని యగును స్తుతః (త్వయా విష్ణుః) భూతార్థకమగు స్తుధాతువుపై కర్మార్థమున క్త (త) ప్రత్య యమురాగా స్తుతః అని యగును విశ్వం కృతవాన్ విష్ణుః - భూతా ర్థకమగు కృధాతువుపై కర్త్రర్థమున క్తవతు (తవత్) ప్రత్యయము వచ్చి కృ+తవత్ అని కాగా పుం ప్ర ఏకవచనమున కృతవాన్ అని సిద్ధించును

సూ - రదాభ్యాం నిష్ఠాతో నః పూర్వస్య చ దః ౮-౨-౪౨

ప ఛి - రదాభ్యాం నిష్ఠాతః నః పూర్వస్య చ దః

వృ - రదాభ్యాం పరస్య నిష్ఠాతస్య న స్యాత్ నిష్ఠాపేక్షయా పూర్వస్య ధాతోర్దస్య చ శౄ హింసాయామ్ ౠత ఇత్ రపరః ణత్వమ్-శీర్ణః భిన్నః ఛిన్నః

రేఫమునకును దకారమునకును పరమైన నిష్ఠా (క్త క్తవతు) ప్రత్యయములలోని తకారమునకును నిష్ఠా ప్రత్యయములకు పూర్వ మందున్న దకారమునకును నకారమాదేశమగును

శీర్ణః- శౄధాతువుపై పై సూత్రముచే క్త (త) ప్ర త్య య ము రాగా ౠత ఇత్ అను సూత్రముచే శౄలోని ౠకారమునకు రపరమైన ఇకారమును దానికి దీర్ఘమును రాగా శీర్+త అని యగును ఇట రేఫమునకు నిష్ఠాతకారము పరమగుటచే ఆ తకార మునకు ప్రకృత సూత్రముచే నకారమాదేశమై శీర్+న అని కాగా నకారమునకు రషాభ్యాం అను సూత్రముచే ణకారము వచ్చి పుం ప్ర ఏకవచనమున శీర్ణః అని యగును

భిన్నః - భిద్ ధాతువుపై క్త ప్రత్యయము వచ్చి భిద్ + త అని కాగా ప్రకృత సూత్రముచే క్త ప్రత్యయములోని తకారమునకును తత్పూర్వమగు ధాతువులోని దకారమునకును నకారమాదేశము కాగా భిన్ + న అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున భిన్నః అని సిద్ధించును ఇట్లే ఛిన్నః అను రూపమును సిద్ధించును

సూ - సంయోగాదేరాతో ధాతోర్యణ్వతః ౮-౨-౪౩

ఎ వి సంయోగాదేః ఆతః ధాతోః యణ్వత

వృ - నిష్ఠాతస్య నః స్యాత్ ద్రాణః గ్లానః

సంయోగమాదియందు గలదియు ఆకారమంతమందు గలదియు యణ్ణు (య వ ర లలు) కలదియు అగు ధాతువుపై నున్న క్త క్తవతు ప్రత్యయములలోని తకారమునకు నకారమాదేశమగును

ద్రాణః - ద్రా ధాతువుపై క్త ప్రత్యయముగా ద్రా + త అని యగును ఇట ద్రా అనునది సంయోగాది ఆకారాన్తము మఱియు యణ్ణు (రేఫము) కలది కనుక ప్రకృత సూత్రముచే క్త ప్రత్యయములోని తకారమునకు నకారము ఆదేశమై ద్రా + న అనికాగా నకారమునకు ణకారమాదేశమై పుం ప్ర ఏకవచనమున ద్రాణః అని యగును

గ్లానః - గ్లై (హర్షక్షయే) అను ధాతువుపై క్త ప్రత్యయమును గ్లైలోని ఐకారమునకు ఆకారమును ఆదేశమై గ్లా + త అని కాగా పైవలెనే ప్రకృత సూత్రముచే తకారమునకు నకారమాదేశమై గ్లానః అని యగును

సూ - ల్వాదిభ్యః ౮-౨-౪౪

వృ - ఏకవింశతేః లూఞాదిభ్యః ప్రాగ్వత్ లూనః జ్యాధాతుః గ్రహిజ్యేతి సంప్రసారణమ్

లూఞ్ స్త్వాఞ్ మున్నగు 2 ధాతువులపైవచ్చు క్త క్తవతు ప్రత్యయములలోని తకారమునకు పైవలెనే నకార మాదేశమగును

లూనః - లూ (ఞ్) ధాతువుపై క్త ప్రత్యయమురాగా దానిలోని తకారమునకీ సూత్రముచే నకారమాదేశమై లూనః అనియగును

సూ - హలః ౬-౪-౨

వృ - అంగావయవాత్ హలః పరం యత్ సంప్రసారణం తదన్తాంగస్య దీర్ఘః - జీనః

అంగావయవమైన హల్లునకు పరమగు సంప్రసారణముఅన్తమందు గల అంగమునకు దీర్ఘము వచ్చును అలోఽన్త్యస్య అను పరిభాషచే అంగముయొక్క చివరి వర్ణములకు దీర్ఘము వచ్చునని భావము

జీనః - జ్యా ధాతువుపై క్తప్రత్యయమును గ్రహిజ్యా అను సూత్రముచే సంప్రసారణమును (యకారస్థానమున ఇకారమును) పూర్వరూపమును ల్వాదిభ్య అను సూత్రముచే క్త ప్రత్యయతకారమునకు నకారమును రాగా జి + న అని యగును ఇట ప్రకృతసూత్రముచే జి అను అంగము యొక్క చివరి వర్ణమగు ఇకారమునకు దీర్ఘమురాగా పుం ప్ర ఏకవచనమున జీనః అనియగును

సూ - ఓదితశ్చ. ౮-౨-౪౫

వృ - ఓదితః చ - భుజో భుగ్నః టుఓశ్వి ఉచ్ఛూనః

ఓకారమిత్తుగాగల ధాతువుపై వచ్చు క్త క్తవతు ప్రత్యయముల లోని తకారమునకు నకారమాదేశమగును

భుగ్న - భుజో (కౌటిల్యే) అను ధాతువులోని ఓకారమిత్తై లోపింపగా భుజ్ అని మిగులును దీనిపై క్త ప్రత్యయమురాగా భుజ్ + త అని యగును భుజ్ ధాతువు ఓదిత్తు (ఓకారమిత్తుగాగలది) అగుటచే నీ

సూత్రముచే క్తిలోని తకారమునకు నకారము రాగా భుజ్ + న అని కాగా జకారమునకు గకారమాదేశమై పుం ప్ర ప్ర ఏకవచనమున భుగ్నః అను రూపమేర్పడును

ఉచ్ఛూనః - టుఓశ్వి (గతివృద్ధ్యోః) అను ధాతువున టు ఓ అను రెండును ఇత్తులై లోపించి శ్వి అని మిగులును కనుక నిది ఓదిత్తు ఉత్ అను ఉపసర్గపూర్వమందుగల ఔవిపై క్త ప్రత్యయమురాగా పైవలెనే నత్వము సంప్రసారణము పూర్వరూపము దీర్ఘమునురాగా ఉచ్ఛూనః అను రూపము సిద్ధించును

సూ - శుషః కః. ८-२-५१

వృ - నిష్ఠాతస్య కః స్యాత్, శుష్కః

శుష్ ధాతువుపై నుండు నిష్ఠా (క్త క్తవతు) ప్రత్యయముల తకారమునకు కకారమాదేశమగును

శుష్కః - శుష్ ధాతువుపై క్త(త) ప్రత్యయము వచ్చి శుష్ + త అని కాగా ఈ సూత్రముచే తకారమునకు కకారమాదేశమై పుం ప్ర ఏకవచనమున శుష్కః అని యగును

సూ - పచో వః. ८-२-५२

వ వి - పచ వః

పచ్ ధాతుపైనున్న నిష్ఠాతకారమునకు వకారమ్ము వచ్చును

పక్వ - పచ్ ధాతువుపై క్త ప్రత్యయమురాగా ప్రకృతసూత్రముచే తకారమునకు వకారమాదేశమై పచ్ + వ అని కాగా చకారమునకు కకారము వచ్చి పక్వః అని యగును

సూ - క్షాయో మః. ८-२-५३

ప వి - క్షాయః మ

క్షైధాతువుపై నున్న నిష్ఠా (క్త క్తవతు) ప్రత్యయముల తకారమునకు మకారమాదేశ మగును.

క్షామః - క్షైధాతువుపై క్తప్రత్యయమును క్షైలోని ఐకారమునకు ఆకారమును రాగా క్షా+త అనికాగా ప్రకృత సూత్రముచే తకారమునకు మకారమాదేశమైపై పుం ప్ర ఏకవచనమున క్షామః అని సిద్ధించును

సూ - నిష్ఠాయాం, సేటి. ౬-౪-౫౨

ణేర్లోపః భావితః భావితవాన్

ఇట్టుతో గూడిన నిష్ఠా (క్త క్తవతు) ప్రత్యయములు పర మగునప్పుడు ణి కి లోపము వచ్చును

భావితః - ణిచ్ ప్రత్యయాన్తమగు భూధాతువుపై క్త ప్రత్యయమురాగా భావి+త అనికాగా ఆర్ధధాతుకస్య అను సూత్రముచే ఇడాగమము వచ్చి భావి+ఇ+త అని కాగా ప్రకృత సూత్రముచే ణిచ్చునకు (వకారము మీది ఇకారమునకు) లోపమురాగా భావితః అనియగును

భావితవాన్ - భావి అను ణిజన్తరూపముపై క్తవతు ప్రత్యయమురాగా పైవలెనే ఇడాగమము ణి లోపము వచ్చి భావితవాన్ అని యగును

సూ - దృఢః, స్థూలబలయోః. ౭-౨-౨౦

వృ - స్థూలే బలవతి చ నిపాత్యతే

స్థూలమైనవాడు బలవంతుడు అనువర్థముల యందు దృఢః అను పదము నిపతింపబడును

దృఢః - దృహ (హింసాయాం) అను ధాతువునకు క్త ప్రత్యయమురాగా ప్రకృత సూత్రముచే దృఢః అనియగును

దృఢః అను రూపము నిపాతించుటచే దృహ్ధాతువునకు క్తప్రత్యయము పరమైనపుడు ఇడాగమము రాకుండుట ధాతువులోని హకారమునకు లోపమును క్త ప్రత్యయస్థానమున ఢకారమును వచ్చునని భావము

సూ - దధాతేర్హిః ౭-౪-౪౨

వృ - తాదౌ కితి హితమ్

తకారమాదియందుగల కిత్తైన ప్రత్యయము పరమగునపుడు ధా ధాతువునకు హి అను నాదేశమగును అనేకాల్లగుటచే హి అనునది ధా అను మొత్తము స్థానమున వచ్చును

ధా ధాతువుపై క్త ప్రత్యయము రాగా ప్రకృత సూత్రముచే ధా స్థానమున హి అను నాదేశము వచ్చి నపుం ఏకవచనమున హితమ్ అని యగును

సూ - దో దద్ఘోః ౭-౪-౪౬

ప వి - దః దథ్ ఘోః

వృ - ఘుసంజ్ఞకస్య దా ఇత్యస్య దథ్ స్యాత్ తాదౌ కితి చర్త్వమ్-దత్తః

ఘు సంజ్ఞకమగు దా ధాతువునకు తకారాదియగు కిత్ ప్రత్యయము పరమగునపుడు దథ్ అను ఆదేశము వచ్చును

దత్త - దా ధాతువుపై క్త (త) ప్రత్యయము రాగా ప్రకృత సూత్రముచే దా ధాతువునకు దథ్ అను నాదేశము వచ్చి దథ్+త అని కాగా ఖరిచ అను సూత్రముచే చర్త్వము వచ్చి పుం ప్ర ఏకవచనమున దత్తః అని యగును

సూ - లిటః కానజ్వా ౩-౨-౧౦౬

ప వి - లిటః కానచ్ వా.

ఛందసి లిట్ అను సూత్రముచే వచ్చు లిట్టునకు కానచ్ (ఆన) ప్రత్యయము వికల్పముగా వచ్చును

కృధాతువుపై ఛన్దసి లిట్ అను సూత్రముచే లిట్టురాగా దానికి సూత్రముచే కానచ్ (ఆన) ప్రత్యయమాదేశముగ వచ్చి కృ + ఆన అని యగును ఇట అభ్యాసకార్యము యణాదేశము మున్నగునవి ప్రవర్తించి పుం ప్ర ఏకవచనమున చక్రాణః అను రూపమేర్పడును

సూ - క్వసుశ్చ ३-२-१०८

ప వి - క్వసు చ

వృ - లిటః కానచ్ క్వసుశ్చ వా స్త తఙానావాత్మనేపదమ్—చక్రాణః

ఛన్దసి లిట్ అను సూత్రముచే వచ్చు లిట్టునకు కానచ్—ప్రత్యయము మఱియు క్వసుప్రత్యయము వచ్చును కానచ్ ప్రత్యయమురాగా సిద్ధించు రూపము పైన తెలుపబడినది

తఙానావాత్మనేపదమ్ అను సూత్రముచే తః ఆన అనునవి ఆత్మనే పద ధాతువులపై వచ్చును

క్వసు ప్రత్యయము రాగా సిద్ధించు రూపమీ క్రింది సూత్రమున వివరింపబడును

సూ - మ్వోశ్చ ८-२-६५

ప వి - మ్వో చ

వృ - మాన్తస్య తోః ధాతత్వం మ్వోః పరత జగన్వాన్

మకారముగాని వకారముగాని పరమగునపుడు మకారాన్తమగు ధాతువునకు నకారమాదేశమగును. అలోఽన్త్యస్య అను సూత్రముచే మకారాన్తమైన ధాతువుయొక్క చివరి వర్ణమునకు (మకారమునకు) నకారమగునని భావము

జగన్వాన్ - గమ్ధాతువుపై ఛన్దసి లిట్ అను సూత్రముచే వచ్చు లిట్టునకు క్వసుశ్చ అను సూత్రముచే క్వసు (వస్) అను నాదేశమురాగా గమ్ + వస్ అని యగును పిదవ ద్విత్వము అభ్యాస కార్యమురాగా జగమ్ + వస్ అని కాగా ప్రకృత సూత్రముచే మకారమునకు నకారమాదేశమై జగన్ + వస్ అని యగును నుమాగమము ఉపధాదీర్ఘము సకారలోపము వచ్చి జగన్వాన్ అను రూపము సిద్ధించును

సూ - లటః శతృశానచా వప్రథమాసమానాధికరణే ౩-౨-౧౨౪

ప వి - లటః శతృశానచౌ అప్రథమాసమానాధికరణే

వృ - అప్రథమాన్తేన సమానాధికరణే లటః ఏతౌ స్తః- శబాది పచన్తం చైత్రం పశ్య

ప్రథమావిభక్త్యన్తముకానిది సమానాధికరణముగ నున్నపుడు లట్టునకు శతృ (అత్) శానచ్ (ఆన) అను ప్రత్యయములు వచ్చును పరస్మైపది ధాతువులపై శతృప్రత్యయము ఆత్మనేపది ధాతువులపై శానచ్ ప్రత్యయము వచ్చునని తెలియవలెను

పచన్తం చైత్రం పశ్య - ఇట ప్రథమావిభక్త్యన్తముతో సామానాధికరణ్యము లేకుండుటచే (ద్వితీయాన్తమైన చైత్రం అను పదముతో సామానాధికరణ్యమున్నది కనుక) పచ్ ధాతువుపై లట్ స్థానమున శతృ (అత్) ప్రత్యయమును శప్ ప్రత్యయమును పరరూపమును రాగా పచత్ అని యేర్పడి పుం ద్వి ఏకవచనమున పచన్తమ్ అని యగును

సూ - ఆనే ముక్ ౭-౨-౮౨

వృ - అదన్తాంగస్య ముగాగమః స్యాత్ ఆనే పరే పచమానం చైత్రం పశ్య లడిత్యనువర్తమానే పునర్లడ్గ్రహణాత్ ప్రథమాసామానాధికరణ్యేపి క్వచిత్ సన్ ద్విజః

హ్రస్వాకార మంతమందుగల అంగమునకు ఆన అనునది పరమగునపుడు ముక్ అను నాగమము వచ్చును

పచమానం చైత్రం పశ్య - పచ్ ధాతువుపై వర్తమానార్థమున వచ్చు లట్టునకు పై సూత్రముచే శానచ్ (ఆన) ప్రత్యయమును శప్ ప్రత్యయమును పరరూపమును రాగా ప చ + ఆ న అవి యగును ఇట పచ అను హ్రస్వాకారాంతమగు అంగమునకు ఆన అనునది పరమగుటచే ముగామము (మ్) వచ్చి అం ద్వి ఏకవచనమున 'పచమానమ్ అని సిద్ధించును

లడిత్య క్వచిత్ - వర్తమానేలట్ అను సూత్రమునుండి లట్ అను పదమను వర్తించుచుండగా లటః శతృశానచౌ అను సూత్రములోని లటః అను పదము వ్యర్థమై "వ్యర్థం సత్ యత్కించిత్ జ్ఞాపయతి" అనున్యాయముచే ప్రథమా సామానాధికరణ్యమున్నచోటను శతృశానచ్ ప్రత్యయములు రావచ్చునని తెలుపుచున్నది కనుకనే సన్ ద్విజః అను చోట ద్విజః అను ప్రథమాంత సామానాధికరణ్యమున్నను అస్ ధాతువుపైనున్న లట్టునకు శతృప్రత్యయమువచ్చి సన్ అను రూపమేర్పడును

సూ - విదేః శతుర్వసుః ౭-౧-౩౬

వ వి - విదేః శతుః వసుః

వృ - వేత్తేః పరస్య శతుః వసురాదేశో వా విదన్ విద్వాన్

విద్ ధాతువునకు పరమందున్న శతృ ప్రత్యయమునకు వసు (వస్) అను నాదేశము వికల్పముగ వచ్చును

విద్వాన్ - విద్ ధాతువుపై వచ్చు లట్టునకు శతృ ప్రత్యయమును దానికి సూత్రముచే వసు (వస్) ఆదేశమును రాగా విద్+వస్ అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున విద్వాన్ అనియగును

విదన్ - వస్వాదేశము వికల్పమగుటచే నదిరాని పక్షమున విద్ ధాతువుపై శతృ (అత్) ప్రత్యయము వచ్చి విదన్ అని యగును

సూ - తౌ, సత్ ౩-౨-౧౨౭

వృ - తౌ శతృశానచౌ సత్సంజ్ఞౌ స్తః.

పై శతృ శానచ్ అను ప్రత్యయములు సత్ అను సంజ్ఞ కలవి

సూ - లృటః సద్వా ౩-౩-౧౪

ప వి - లృటః సత్ వా

వృ - వ్యవస్థిత విభాషేయమ్ తేన అప్రథమాసామానాధికరణ్యే ప్రత్యయోత్తర పదయోః సంబోధనే లక్షణ హేత్వోశ్చ నిత్యమ్-కరిష్యన్తం కరిష్యమాణం పశ్యం

ధాతువుపై భవిష్యదర్థమున వచ్చు లృట్టునకు సత్ - (శతృ శానచ్) ప్రత్యయములు వికల్పముగ వచ్చును

ఇది వ్యవస్థిత విభాషయగుటచే ప్రథమా విభక్త్యన్తముతో సామానాధికరణ్యము లేనప్పుడును ప్రత్యయము గాని ఉత్తర పదము గాని పరమగునపుడును సంబోధనమును లక్షణము హేతువు అను నర్థములయందును ఈ సత్ప్రత్యయములు నిత్యముగ వచ్చును ఇతరత్ర వికల్పముగ వగును

కరిష్యన్తమ్ కరిష్యమాణమ్ - కృధాతువుపై వచ్చు లృట్టునకు శతృ (అత్) శానచ్ (ఆన) ప్రత్యయములు రాగా కృ+అత్ కృ+ఆన అని కాగా స్య ఇడాగమము మరియు గుణము వచ్చి పుం ద్వి ఏకవచనమున కరిష్యన్తమ్ కరిష్యమాణమ్ అను రూపములు సిద్ధించును ఇట ప్రథమా సామానాధికరణ్యములేదు కనుక శతృ శానచ్చులు నిత్యముగ వచ్చినవి

సూ -ఆక్వే స్తచ్ఛీల-తద్ధర్మ-తత్సాధుకారిషు ౩-౨-౧౩౪

ప వి - ఆక్వేః తచ్ఛీల-తద్ధర్మ-తత్సాధు కారిషు

వృ - క్విపమభి వ్యాప్య వక్ష్య మాణాః ప్రత్యయాః తచ్ఛీలాదిషు కర్తృషు బోధ్యాః

"భ్రాజ భాస (౩-౧-౧౭౭) అను సూత్రముచే విధింపబడు క్విప్ ప్రత్యయము వఱకు చెప్పబడు ప్రత్యయము లన్నియు తచ్ఛీల తద్ధర్మ తత్సాధుకారిత అను నర్థములందు ధాతువుపై కర్త్రర్థమున వచ్చును తత్సాధుకారిత = ఒక పనిని బాగుగా జేయుట

సూ -తృన్. ౩-౨-౧౩౫

తచ్ఛీల తద్ధర్మ తత్సాధుకారిత అనునర్థముల యందు ధాతువుపై కర్త్రర్థమున తృన్(తృ)ప్రత్యయము వచ్చును కర్తా(కటాన్) - కటాన్ కరోతి తచ్ఛీలం అనునర్థమున ప్రకృత సూత్రముచే కృధాతువుపై తృ(న్) ప్రత్యయమురాగా కృ+తృ అనికాగా సార్వధాతుకా అను సూత్రముచే గుణమురాగా క్+అర్+తృ = కర్తృ అని యేర్పడి పుం ప్ర. ఏకవచనమున కర్తా అని యగును

సూ -జల్ప-భిక్ష-కుట్ట-లుంట-వృఙః, షాకన్ ౩-౨-౧౫౫

జల్ప భిక్ష కుట్ట లుంట వృఙ్ అను నీ యైదు ధాతువులపై పై తచ్ఛీలాద్యర్థములందు కర్త్రర్థమున షాకన్ (ఆక) అను ప్రత్యయము వచ్చును

సూ - షః ప్రత్యయస్య.

వృ - ప్రత్యయస్య ఆదిః షః ఇత్సంజ్ఞః స్యాత్ కుట్టాకః లుంటాకః వరాకః వరాకీ

ప్రత్యయముయొక్క ఆదియందున్న షకారము ఇత్తగును షాకన్ ప్రత్యయము ఆదియందు షకారముండుటచే ఇత్సంజ్ఞక మగును పిదప దానికిని నకారమునకును తస్యలోపః అను సూత్రముచే లోపము వచ్చి ఆక అని శేషించును

జల్పాకః - జల్పతి తచ్ఛీలః అనుసర్థమున జల్ప ధాతువుపై పై సూత్ర ముచే షాకన్ (ఆక) ప్రత్యయము వచ్చి జల్ప+ఆక = జల్పాక అని కాగా పుం ప్ర ఏకవచనమున జల్పాకః' అని సిద్ధించును ఇట్లే భిక్షాకః కుట్టాకః లుంటాకః వరాకః అను రూపములను తెలియ వలెను వరాకీ అనునది స్త్రీలింగ రూపము

సూ - సనాశంస భిక్ష ఉః. ౩-౨-౧౬౮

ఉదా - చికీర్షుః ఆశంసుః భిక్షుః

తచ్ఛీలాద్యర్థములందు సన్నన్తమగు ధాతువుపైనను ఆశంస భిక్షధాతువులపైనను కర్త్రర్థమున ఉ ప్రత్యయము వచ్చును

చికీర్షుః - చికీర్ష అను సన్నన్తమగు ధాతువుపై ఉ ప్రత్యయము అకార లోపమును రాగా చికీర్షు అని యేర్పడి పుం ప్ర ఏకవచనమున చికీర్షు అని సిద్ధించును ఇట్లే ఆశంస్ ధాతువుపై భిక్ష ధాతువుపై ఉ ప్రత్యయము రాగా ఆశంసుః భిక్షుః అని సిద్ధించును

సూ - భ్రాజ-భాస-ధుర్వి-ద్యు-తోర్జి - పృ-జు-గ్రావస్తువః క్విప్
విభ్రాట్ భాః. ౩-౨-౧౭౭

భ్రాజ్ భాస్ ధుర్ విద్యుత్ ఊర్జ్ పృ జు గ్రావ అను ఉపపదము కల స్తు-అను ఈ ఎనిమిది ధాతువులపై తచ్ఛీలాద్యర్థములలో క్విప్ ప్రత్యయము వచ్చును క్విప్ ప్రత్యయము సర్వలోపి

విభ్రాట్ - విపూర్వక భ్రాజ్ ధాతువుపై క్విప్ ప్రత్యయమురాగా విభక్తి కార్యములచే విభ్రాట్ అని యగును ఇట్లే భాస్ ధాతువుపై క్విప్పు రాగా భాః అని యగును

సూ -రాల్లోపః ౬-౪-౨౧

ప వి - రాత్ లోపః

వృ - రేఫాత్ చ్ఛ్వోః లోపః క్వౌ ఝలాదౌ క్ఙితి-ధూః విద్యుత్ ఊర్క్ పూః దృశిగ్రహణస్యాపకర్షాత్ జవతేః దీర్ఘః జూః గ్రావస్తుత్

క్విప్ ప్రత్యయముగాని ఝలాదియగు కిత్తులేక ఙిత్తుఅగు ప్రత్యయముగాని పరమగునపుడు రేఫమునకు పరమగు చ్ఛ్ వ్ అను వానికి లోపము వచ్చును

ధూః - ధుర్ అను ధ్వృ ధాతువు రూపముపై పై సూత్రముచే క్విప్పురాగా ఈ సూత్రముచే రేఫముపై నున్న వకారమునకు లోపము పిదప ఉకారమునకు దీర్ఘమునురాగా ధూర్ అని యగును ప్ర ఏకవచనమున ధూః అను రూప మేర్పడును

విద్యుత్ ఊర్క్ పూః అనునవి పూర్వ సూత్రముచే క్విప్పురాగా సిద్ధించిన రూపములు

వా - క్విబ్వచి ప్రచ్ఛ్యాయతస్తు కటప్రు జు శ్రీణాం దీర్ఘో-సంప్రసారణం చ వక్తీతి వాక్

వచ్ పృచ్ఛ్ ఆయత శబ్దము పూర్వమందుగలస్తు కటశబ్దముపపదముగ నున్న ప్రు జు శ్రి అను నీ యాఱు ధాతువులపై క్విప్ ప్రత్యయమును దీర్ఘమును వచ్చును సంప్రసారణమురాదు దీర్ఘాదేశము ఆపొంటికిని వచ్చును సంప్రసారణ నిషేధము మాత్రము ఒక పృచ్ఛ్ ధాతువునకు మాత్రమే

వాక్ - వచ్ ధాతువుపై దీనిచే క్విప్ ప్రత్యయము దీర్ఘా దేశము రాగా వాక్ అను రూపము సిద్ధించును

సూ - చ్ఛ్వోః శూడనునాసికే చ. ౬-౪-౧౯

వ ఏ - చ్ఛ్వో శూఠ్ అనునాసికే చ

సతుక్కస్య ఛస్య-వస్య చ క్రమాత్ శ్ ఊఠ్ ఇత్యాదేశౌ స్తః అనునాసికే క్వౌ ఝలాదౌ చ క్ఙితి పృచ్ఛతీతి ప్రాట్-ఆయతం స్తౌతి ఆయతస్తూః-కటం ప్రవతే కటప్రూః-జూరుక్తః - శ్రయతి హరిం శ్రీః

అనునాసికము క్విప్పు ఝలాదియగు కిత్తు లేక ఙిత్తు అగు ప్రత్యయము పరమగుచో చ్ఛ్ వ్ అనువానికి క్రమముగ శ్ ఊఠ్ అనునవి ఆదేశములగును

ప్రాట్ - (అడుగువాడు) పృచ్ఛధాతువుపై పై వార్తికముచే క్విప్ ప్రత్యయమును దీర్ఘమును సంప్రసారణ నిషేధమును రాగా ప్రాచ్ఛ్ అనియగును ఇట ప్రకృత సూత్రముచే చ్ఛ్ స్థానమున శ్ ఆదేశమై వ్ర ఏ వచనమున ప్రాట్ అనియగును

ఆయతస్తూః కటప్రూః శ్రీః అనురూపములు పై వాక్ శబ్దము వలె క్విప్ ప్రత్యయముచే సిద్ధించును

సూ - దామ్నీ, శస, యు, యుజ, స్తు, తుద సి సిచ, మిహ
పద దశ, నహః కరణే. ३-२-१८२

వృ - దాబాదేః ష్ట్రన్ స్యాత్ కరణేఽర్థే దాత్యనేన దాత్రమ్ నేత్రమ్

దాప్ నీ శస్ యుజ్ స్తు తుద్ సి సిచ్ మిహ్ పత్ దశ్ నహ్ అను నీ పదమూడు ధాతువులపై కరణార్థమున ష్ట్రన్ ప్రత్యయము వచ్చును ష్ట్రన్‌లోని షకార నకారము లిత్తులై లోపించి ట్ర అని యగును షకార లోపమును నిమిత్తముగజేసికొని టకారము తకారమై "త్ర" అని మిగులును

దాత్రమ్ - దాత్యనేన (దీనిచే కోయును) అను కరణార్థమున నీ సూత్రముచే దా (ప్) ధాతువుపై ష్ట్రన్ (త్ర) ప్రత్యయమురాగా దాత్రమ్ అను రూపము సిద్ధించును

సూ - తి-తు-త్ర-త-థ-సి-సు-సర-క-సేషు చ. ७-२-९

వృ - ఏషాం దశానాం కృత్ప్రత్యయానాం ఇట్ న-శస్త్రమ్ యోత్రమ్ యోక్త్రమ్ స్తోత్రమ్ తోత్త్రమ్ సేత్రమ్ సేక్త్రమ్ మేఢ్రమ్ పత్త్రమ్ దంష్ట్రా నద్ధ్రీ

సూత్రమున చెప్పబడిన తి (క్తిన్ క్తిచ్) తు (తున్) త్ర (ష్ట్రన్) త (తన్) థ (క్థన్) సి (క్సి) సు సర (సరన్) క స అనునీ పది కృత్ప్రత్యయములకు ఇడాగమము రాదు

దాత్రమ్ అనుచోట త్ర (ష్ట్రన్) పరమందుండుటచే ఆర్ధధాతుక అను సూత్రముచే వచ్చు ఇడాగమము రాదని భావము ఇట్లే శస్ యు యుజ్ స్తు తుద్ సి సిచ్ మిహ్ పత్ దశ్ నహ్ నీ అను ధాతువులపై దామ్నీ అను పై సూత్రముచే ష్ట్రన్ (త్ర) ప్రత్యయమును ఈ సూత్రముచే ఇడాగమ నిషేధము రాగా క్రమముగా శస్త్రమ్

యోత్రమ్ యోక్త్రమ్ స్తోత్రమ్ పేత్రమ్ సేక్త్రమ్ మేఢ్రమ్ పత్త్రమ్ దంష్ట్రా నద్ధ్రీ నేత్రమ్ అను రూపములు సిద్ధి మను

సూ - అర్తి-లూ-ధూ-సూ-ఖన-సహ-చర ఇత్రః.

ప వి - అర్తి-లూ-ధూ-సూ-ఖన-సహ-చరః ఇత్రః

అరిత్రమ్-లవిత్రమ్-ధవిత్రమ్-సవిత్రమ్-ఖనిత్రమ్ - సహిత్రమ్-చరిత్రమ్-సవిత్రమ్-ఖనిత్రమ్-చరిత్రమ్

ఋ లూ ధూ సూ ఖన్ సహ్ చర్ అను ధాతువులపై కరణార్థమున ఇత్ర అను ప్రత్యయము వచ్చును

అరిత్రమ్ - ఋధాతువుపై ప్రకృత సూత్రముచే ఇత్ర ప్రత్యయము వచ్చి ఋ + ఇత్ర అనికాగా ఋ' స్థానమున గుణము (అ) రపరముగ వచ్చి అర్ + ఇత్ర = అరిత్ర అనియగును న ౦ం ప్ర ఏకవచనములో అరిత్రమ్ అని యగును ఇట్లే లూ ధూ సూ ఖన్ సహ్ చర్ అను ధాతువులపైనను ఇత్ర ప్రత్యయము రాగా క్రమముగ లవిత్రమ్. ధవిత్రమ్ సవిత్రమ్ ఖనిత్రమ్ సహిత్రమ్ చరిత్రమ్ అనురూపములు సిద్ధించును

సూ - పువః, సంజ్ఞాయామ్ ౩-౨-౧౮౫


పవిత్రమ్

సంజ్ఞార్థమున పూ (ఙ్ ఞ్) ధాతువుపై కరణార్థమున ఇత్రప్రత్యయము వచ్చును

పవిత్రమ్ - పూయతే అనేన (దీనిచే పవిత్రము కావింపబడును) అను నర్థమున ఈ సూత్రముచే పూ ధాతుపై ఇత్ర ప్రత్యయము రాగా

గుణము అవాదేశము వచ్చి పవం ప్ర ద్వి ఏకవచనమున పవిత్రమ్ అయియగును ఇట ఇత్రప్రత్యయము రాగా ఏర్పడిన 'పవిత్రమ్' అను సముదాయము అనామికకు ధరించు దర్భవేష్టనమునకు సంజ్ఞ

ఇతి కృదన్త ప్రకరణమ్



— o —

ముద్రణ న్యూస్టేట్ ప్రింటర్స్ నారాయణగూడ హైదరాబాదు-29